ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక





సంధ్యారాగము.


21-7-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

అనంతపురం ఇంజనీరింగు కళాశాల ప్రారంభోత్సవం











అనంతపురం ప్రభుత్వ టెక్నికలు స్కూలును ప్రధాని ఓమండూరు పెదరామస్వామిరెడ్డిగారు సందర్శించినప్పుడు వారికి స్వాగతమిచ్చి జనరల్ ఫిట్టింగుసెక్షను మొదలైన, స్కూలు శాఖలను విద్యాలయాధికారులు చూపిస్తున్న దృశ్యం.



ఇంజనీరింగు కళాశాలకు ప్రధానామాత్యు లరుదెంచినపుడు విద్యాశాఖా డైరెక్టరుగారును శ్రీ కల్లూరు సుబ్బరావుగారును వారిని ఆహ్వానించుట





ప్రధాని ఓమండూరి పెదరామస్వామిరెడ్డిగారు మొన్న 10-వ తేదీన ప్రారంభోత్సవం జరిపిన అనంతపురం ఇంజనీరింగు భవనాలు, ప్రధాని ఆ కళాశాలలోని యంత్రపరికరాలను పరిశీలిస్తున్నప్పుడు తీసిన చిత్రం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా


నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 40

సంచిక 45

Founder: K, NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర ఆషాఢ శుద్ధ పూర్ణిమ బుధవారము



"పడవ సరంగు"

తడరేవుదాపుల పులికట్ సరస్సులో నీళ్లలోతు లేనందున సరంగు పడవను త్రోయు సిల్హౌట్ దృశ్యము.

ఆంధ్రపత్రిక

1948-వ సం॥ జూలై నెల 21-వ తేది బుధవారము

ఈనాములకు పరిహారము

30 ఎకరములకు, అంతకు లోబడిన ఈనాము భూములకు పరిహార మిచ్చు విషయమున కాంగ్రెసు అధిష్ఠాన వర్గము చేసిన సూచనలు రాష్ట్రశాసన సభాకాంగ్రెసుపక్షమున ఎక్కువ మందికి అంగీకారము కాబోవని రెండు రోజుల చర్చవలన వ్యక్తమైనది. అయినప్పటికిని మూడవనాడు రెవెన్యూ మంత్రి ఆ సూచనలను ఉపసంహరించుకొనవలసినదని తీర్మానము ప్రతిపాదించెను. నాటి పార్టీ సమావేశమునకు హాజరైనవారిలో ఎక్కువమంది ఆ తీర్మానమును ఆమోదించిరి. ఇది జరిగినతరువాతకూడ ఇంకను కాంగ్రెసు అధిష్ఠానవర్గము వద్దకు సంప్రదింపులకు వెళ్లుటలో గల ఆంతర్యము బోధపడుట లేదు. అధిష్ఠాన వర్గముతో సంప్రతింపులు అవసరము అని అనుకొనినపుడు—అందులో ముఖ్యముగా పార్టీవైఖరి తెలిసినపుడు-తీర్మానమును ప్రతిపాదించుట అనవసరము. అధిష్ఠానవర్గసూచనలకు పార్టీ సభ్యులేగాక, రెవెన్యూమంత్రికూడ విముఖు డని వ్యక్తమైనది. అందువల్ల, తాను అధిష్ఠానవర్గముతో వాదించుటకు బలము నిమిత్తము ఈ తీర్మానమును ప్రతిపాదించి పార్టీచేత ఆమోదింపచేసినట్లున్నది. అట్లుకాని యెడల అధిష్ఠానవర్గసూచన లివి యని పార్టీకి తెలిపి, తీర్మానముద్వారా కాక చర్చల ఫలితముగా పార్టీ అభిమతము నెరిగియే ఢిల్లీకి ప్రయాణము కావలసియున్నది. తీర్మానముమీద ఓటు తీసికొనవద్దని శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి సూచన క్రమముగ నున్నది. ఆయన చెప్పినట్లు, వారి సూచనలను కాదని తీర్మానించి తిరిగి వారి సలహాను అర్థించవెళ్లుట అధిష్ఠానవర్గమును చిన్నబుచ్చినట్లగును.

అసలు రెవెన్యూమంత్రి తీర్మానము విచిత్రముగ నున్నది. అధిష్ఠాన వర్గ సూచనను ఏ సూత్రరీత్యాగాని, సిద్ధాంతరీత్యాగాని కాదనలేదు. వారు ఈనాముల కివ్వమనిన పరిహార పద్ధతి రాష్ట్రఆర్థికశక్తికి మించినదని మాత్రమే చెప్పిరి. అది ఏవిధముగా ఎక్కువగునో బోధపరచలేదు. ఆయన స్థూలముగా చెప్పినది సరికాదని విషయము నెరిగినవారు నిరూపించిరి. రాష్ట్రశక్తికి మించినదని తోచిన ఆ యంశమును ప్రప్రథమముననే, అనగా పార్టీలో ఈచర్చను తెచ్చుటకుముందే, అధిష్ఠానవర్గమునకు తెలిపి యుండవచ్చునుగదా? అపుడు వారే తమ సలహాను ఉపసంహరించుకొని యుందురు. లేదా మరొక మార్గమును సూచించియుందురు.

అధిష్ఠానవర్గ మివ్వమనిన ప్రకారము పరిహార మిచ్చిన రాష్ట్రశక్తికి మించినమొత్త మని రెవిన్యూ మంత్రి తీర్మానము సూచించినది. వారు రు. 20 కోట్లగునని అంచనావేసిరి. ఇంత కాదని ప్రతివాదులు తెలిపిరి. అయినప్పటికిని, కాకపోయినప్పటికిని రాష్ట్ర ఆర్థిక శక్తికి మించిన దను వాదములో పటుత్వము లేదు. అసలు జమీందారుల కివ్వవలసిన పరిహారమును రాష్ట్ర ఆదాయములనుంచి ఇవ్వదలచిరో మరి యితర విధముగ ఇవ్వదలచిరో ఇంతవరకు స్థిరము కాలేద. జమీందారులకు రు. 10. కోట్లనుండి రు. 12 కోట్లు ఇచ్చుటకు శక్తి చాలినపుడు కొద్దిపాటి ఈనాముదారులకు పరిహార మిచ్చుటకు శక్తి చాల దనుట హాస్యాస్పదము. బీహారు, సంయుక్తరాష్ట్రములు జమీందారీల రద్దు సందర్భమున పరిహారమునకు వందకోట్లకుపైగా వెచ్చింపదలచినపుడు అందులో నాల్గవ వంతుకూడ వెచ్చించుటకు మద్రాసురాష్ట్రమునకు శక్తి యుండదా? అదియునుకాక పరిహార నిర్ణయము న్యాయపద్ధతిని ఉండవలెను గాని పరిహారము ఇవ్వవలసిన వారి శక్తినిబట్టి నిర్ణయింపబడదు కదా? రెవిన్యూమంత్రి తీర్మానము ఈ విచిత్ర పద్ధతినే అనుసరించుచున్నది. ఈనాములను రద్దుచేయదలచిన, వాటికి సక్రమ పరిహార మివ్వవలెను. అందుకు తగిన ధనమును సేకరించవలెను. అది సాధ్యము కానియెడల వాటి రద్దును విరమించవలెను. ఇది తప్ప వేరు మార్గము లేదు.

హైదరాబాదుకు పటేల్ హెచ్చరిక

గత గురువారము తూర్పుపంజాబు సంస్థానముల సమాఖ్య ఆరంభోత్సవము భారత ఉపప్రధాని సర్దార్ వల్లభాయి పటేల్‌గారిచే జరుపబడెను. ఈ సమాఖ్య పశ్చిమ సరిహద్దులు పాకిస్థాను నంటియున్నవి. దీనిలో పాటియాలా, కపుర్తలా, నాభా, జీంద్, ఫరీద్‌కోట, మాలెర్‌కోట్లా, మరి రెండు అప్రధాన సంస్థానములు చేరినవి. పదివేలమైళ్ల భూవిస్తీర్ణము, 30 లక్షల జనాభా, రు. 5 కోట్ల ఆదాయము ఈ సమాఖ్య కలిగియుండగలదు. పాకిస్థాన సరిహద్దున యుండుటవల్లనే గాక, భారతప్రభుత్వ సంస్థానశాఖ ఆరంభించిన సంస్థానసమాఖ్య నిర్మాణమునందు ఇది చివరిది అగుటవల్లకూడ ప్రధానముగా గమనింపవలసియున్నది. అందువల్ల దాని ఆరంభోత్సవము జరుపుచు ఉపప్రధాని సర్దార్ పటేల్ హైదరాబాదునుగురించి మాట్లాడుట ఉచితముగా నున్నది. హైదరాబాద్ కాశ్మీరులు తప్ప మిగిలిన సంస్థానముల సమస్య పూర్తిగ పరిష్కారమైనట్లే. కాశ్మీర్ భారతయూనియన్‌లో చేరినది. బాధ్యతాయుత ప్రభుత్వ మేర్పరచబడినది. ఐక్యరాజ్యసమితి విచారణ సంఘకలాపము దుండగీండ్రను తరిమివేయుటలో భారతసేనల కార్యక్రమమునకు అడ్డు రాజాలదు. కాబట్టి భారత ఐక్యతానిర్మాణ పరిపూర్ణతకు ఒక హైదరాబాద్ మాత్రమే పెద్ద లోటుగా నిలిచినది. ఈ లోటును పూర్తిచేయుటకు భారతప్రభుత్వము దాదాపు సంవత్సరముగా చేయుచున్న ప్రయత్నములు విఫలమైనవి. దీనికి ఆ సంస్థానాధీశుని మంకుతనమే కారణము. అందువల్లనే తూర్పుపంజాబు సంస్థాన సమాఖ్య ప్రారంభోత్సవ సమయమున సర్దార్ పటేల్ అతనికి గట్టి హెచ్చరిక చేసెను. "మౌంట్‌బాటన్ సూచించిన పథకము ఆయనతోనే పోయినది. ఇతర సంస్థానములతో చేసికొనిన పద్ధతినే హైదరాబాద్ పరిష్కారము కూడ జరుగవలసి యున్నది." అనగా హైదరాబాద్ యూనియన్‌లో చేరక తప్పదు. ఈ విధమైన విస్పష్ట ప్రకటన చేయుట అనేక కారణములవల్ల అవసరము. "హైదరాబాదుకు ఒక పద్ధతీ, మా కొక పద్ధతీనా" అని ముందు యూనియన్‌లో చేరిన సంస్థానాధీశులు నిందించిరి. వారి నిందలో అర్థము లేక పోలేదు. ప్రథమమున యూనియన్‌లో చేరవలెనని హైదరాబాద్‌కు షరతు పెట్టిరి. కాని ఆ విషయమున పట్టుపట్టక యథాతథపు ఒడంబడికకు ఒప్పుకొనిరి. ఈ ఒడంబడిక యూనియన్‌లో చేరుటకు దారితీయునని ఆశించిరి. తరువాత బాధ్యతాయుత ప్రభుత్వస్థాపన, రజాకర్ల నిషేధము అవసర మనిరి. వీటిలో యేవీ ఫలింపక పోయినవి. చివరికి, యూనియనులో చేరవలెనను ప్రథమ షరతునే ఇపుడు సర్దార్ పటేల్ ఉద్ఘాటించెను.

హైదరాబాద్‌పట్ల ఈ భిన్నవిధానమును అవలంబించుటకుగల కారణము ఆయన ఉపన్యాసమే వ్యక్తముచేసినది. "తాను బ్రిటిషు ప్రభువుకు విశ్వసనీయుడగు మిత్రుడని నైజాము గర్వించెడివాడు. ఆ సంబంధరీత్యా తాము కలుగజేసికొని అతనిని సన్మార్గమున పెట్టుటకు తమకు హక్కున్నదని బ్రిటిషువారనుకొనిరి. ఆ భావముతో చివరికి తాము సయోధ్య సాధించగలిగితి మని చెప్పుకొనుటకు భారత, హైదరాబాదులు పరస్పరము ఆమోదించవలసిన పథకమును తయారుచేసిరి." హైదరాబాదు యెడ పాక్షిక వైఖరిని ప్రదర్శించుటకు కారణము ఇపుడు వెల్లడి అయినది. నైజాము బ్రిటిషుమిత్రులమీద ఆశ పెట్టుకొన్నట్లు విశదమైనది. కాని మౌంటుబాటన్ ప్రయత్నములు విఫలమగుట వలన ఇక బ్రిటనుదిక్కుకు అట్టులు సాచిలాభము లేదని గ్రహించవలెను. "బయటినుండి తనకు యేదో సాయము రాగలదని నైజాము ఆశ పెట్టుకొనిన దానివల్ల యెట్టి ప్రయోజనముండదు." అని సర్దార్ వల్లభాయ్‌పటేల్‌గారు తెలిపిరి. కాని నైజామునకు ఆ ఆశ ఇంకనూ అంతరించినట్లులేదు. మొన్న కరాచీలో తమకు, భారతప్రభుత్వమునకు జరిగిన ఉత్తరప్రత్యుత్తరము లన్నిటినీ ప్రకటించి తగాదాను మధ్యవర్తి పరిష్కారమునకు సమర్పింపవలెనని సూచించెను. కాని అందుకు అంగీకరించనని భారత ప్రభుత్వము ఇదివరకే వెల్లడిచేసినది. అయినను ఈ ఉత్తరప్రత్యుత్తరములను హైదరాబాదులో కాక ప్రథమముగా పాకిస్థాన రాజధాని అయిన కరాచీయందు ప్రకటించుటలో ప్రత్యేకాంతర్య మున్నట్లున్నది. కాశ్మీర్ కమీషన్ విచారణ సంఘము వచ్చినపుడు వీటిని ప్రకటించుట గమనించదగిన సంగతి. హైదరాబాద్ గౌరవప్రదమైన ఒప్పందమునకు ప్రయత్నించినదని, కాని భారత ప్రభుత్వము పడనివ్వలేదని లేకాలీగారు చెప్పుట హాస్యాస్పదముగ కనుపడక మానదు. మౌంట్‌బాటన్ సూచించిన పద్ధతిని తాను ఆమోదించియు తన పాలకుని చేత ఆమోదింపచేయలేకపోయిన సంగతి ఆయన మరచినట్లున్నది! నైజాము ఇంతవరకు ప్రదర్శించిన వైఖరినిబట్టి భారత ప్రభుత్వము ఆ షరతులను ఉపసంహరింపక తప్పినదికాదు. అప్పటికి కూడ తాము మొదట సూచించిన విధానమునే, అనగా అన్ని సంస్థానములకు సూచించిన పద్ధతినే నైజామునకు సూచించిరి. కాని కచ్చితో కూడిన షరతులను పెట్టలేదు. కాబట్టి వాస్తవిక దృష్టితో ఈ అంశమును గమనించి యూనియనులో చేరుటకు నిశ్చయించునని నమ్ముచున్నాము. రజాకర్ల శక్తివల్ల, బయటవారి సహాయమువల్ల భారతయూనియన్‌తో కయ్యమునకు దిగి నెగ్గగలనని తలచిన అది కేవలము ఆత్మవంచన, వినాశము, కాగలదు.

నేటిప్రపంచం:

పాలస్తీనా పరిస్థితి: యుద్ధ విరమణ ఆదేశ ఆంతర్యం

పాలస్తీనాలో అరబ్ యూదు పక్షాల మధ్య యుద్ధ విరమణను మరికొన్ని రోజులపాటు సాధించడానికి కేవలం మధ్యవర్తి హోదాతో తాను చేసిన ప్రయత్నాలు విఫలం కాగానే, కౌంట్ బెర్నాడోట్ ఎకాయెకిన లేక్ సక్సెస్‌కే వెళ్ళి భద్రతామండలికి ప్రస్తుత పరిస్థితిపై తన సమగ్ర నివేదికను అందజేశాడు.

అరబ్ పక్షపాతి అని యూదులు, యూదు పక్షపాతి అని అరబ్బులు కౌంట్ బెర్నాడోట్‌ను ఉభయత్రా నిందించారంటే, మధ్యవర్తిగా ఆయన తన పనిని తాను సక్యంగా నిర్వహించడానికే ప్రయత్నించాడని చెప్పవచ్చు. ఏమైతే నేమి, ఇప్పటికైనా బెర్నాడోట్ పరిష్కార సాధన ప్రయత్నం మాత్రం ఒకకొలిక్కి రంగానికి రాలేదు. తానుచేసిన యుద్ధ విరమణ ప్రయత్నం విఫలం కాగానే, ఆ పనిని భద్రతామండలి ద్వారానే చేయిద్దామని బెర్నాడోట్ లేక్ సక్సెస్‌కు ప్రయాణమై వెళ్ళాడు.

మధ్యవర్తి నివేదిక

భద్రతామండలి అత్యవసర సమావేశములో ఆయన పాలస్తీనా సమస్యపై నివేదించిన ముఖ్యాంశాలు ఇవి. (1) బలప్రయోగంద్వారా చావో బతుకో తేల్చుకొని పరిష్కారం సాధిద్దామనుకుంటే అందుకు భద్రతామండలి ఏమాత్రం సహించి వూరుకోదుసుమా అని ఉభయపక్షాలకూ స్పష్టంగా నచ్చచెప్పడంకంటే గత్యంతరం లేదు. (2) ఉభయపక్షాలూ ఇందుకు తొలిచర్యగా తక్షణమే యుద్ధాన్ని విధిగా విరమించడం అవసరమని అతిస్పష్టంగా ఆదేశించాలి. (3) పవిత్రమైన ప్రాచీన నగరం జెరూసెలం ఉభయపక్షాల సమరోద్ధతివల్ల సర్వనాశనమైపోయే ప్రమాదం ఏర్పడింది కాబట్టి, ఆ నగరం అంతటినుంచీ సంపూర్తిగా సైనిక ఉపసంహారం జరగాలి; ఇందుకు కావలసిన ఉత్తర్వులను మండలి జారీచేయాలి. (4) ఈ ఆదేశాలలో ఏపక్షంవారు దేన్ని ఉల్లంఘించినా, ఏ ఒక్కదానికి సమ్మతించకపోయినా ఐక్యరాజ్యసమితి ప్రణాళికప్రకారం ఆ పక్షంపై సత్వరమే స్థిరసంకల్పంతో మండలి తీవ్ర చర్యలకు దిగడం అవసరం. (5) జెరూసెలం నగరం సైనికరహితమై, పాలస్తీనాలో ఉభయపక్షాలవారూ సంఘర్షణను కట్టిపెట్టినట్లయితే, ప్రశాంతంగా రాయబారాలు జరపడానికీ, పర్యవసానంగా యుద్ధవిరమణ సాధించడానికీ వీలవుతుంది. ఆ పరిస్థితులలో, ఆచరణసాధ్యమయే పక్షాన, యూదు అరబ్ ఆక్రమితప్రాంతాలలో జనవాక్యనిర్ధారణకు ఉపక్రమించడానికి వీలవుతుంది.

భద్రతామండలికి కౌంట్ బెర్నాడోట్ ఈ అంశాలను మొన్న 13-వ తేదీన నివేదిస్తున్నప్పుడు అరబ్ ఉన్నతవర్గప్రతినిధి సమావేశానికి హాజరుకాలేదు. సమావేశ చర్చలలో పాల్గొంటున్న యూదుప్రతినిధి ఆబ్రే ఇబాన్‌ను యుక్రేన్ సభ్యుడు డిమిట్రీ మానులిస్కీ ఒకానొక సందర్భంలో "యూదు రాజ్యమైన ఇజ్రాయిల్ ప్రతినిధి" అని అధికారహోదాఇచ్చి పిలవడమే అరబ్ ప్రతినిధి ఆగ్రహపడడానికి కారణం.

భద్రతామండలికి మధ్యవర్తి తన నివేదికను వివరిస్తుండగానే రష్యాసభ్యుడు ఆండ్రీ గ్రోమికో పాలస్తీనాలో యుద్ధం తిరిగి ప్రారంభం కావడానికి తప్పు ఏపక్షంమీద వున్నదని ప్రశ్నించాడు. యుద్ధవిరమణ గడువును పొడిగించడానికి ఏ పక్షమైతే అంగీకరించలేదో, ఆ పక్షమే యుద్ధ ప్రజ్వలనకు బాధ్యత వహించవలసి వుంటుందని బెర్నాడోట్ బదులు చెప్పాడు. యుద్ధవిరమణ గడువు పొడిగించడానికి, బెర్నాడోట్ లేక్ సక్సెస్‌కు ప్రయాణం గాకపూర్వమే యూదులు, అంగీకరించివున్నారు కాబట్టి తప్పు అరబ్బులదేనని మధ్యవర్తి అభిప్రాయపడ్డాడన్న మాట.

అరబ్‌ల అనుమానం

యుద్ధవిరమణ గడువును పెంచినకొద్దీ అన్నివిధాలా యూదులకే లాభకరమని అరబ్బుల ఉద్దేశం. అందుకే వారు దాన్ని పొడిగించడానికి వారు మొదటినుంచీ ఆట్టే విముఖతను కనబరచినట్లు తోచదు. ఈ కారణంచేతనే భద్రతామండలిలో సిరియాసభ్యుడు పారిస్ జే ఎల్ ఖౌరీ యుద్ధవిరమణ గడువును పెంచడం ఎవరికి లాభమో చెబుతారా అని బెర్నాడోట్‌ను ఎదురు సవాల్ చేశాడు. అదనంగా వ్యవధి ఇవ్వడం యూదులకే అనుకూలమైతే కావచ్చునని బెర్నాడోట్ బదులు చెప్పాడు.

వ్యవధిఇవ్వడం ఎవరికి అనుకూలమైనా, ఎవరికి ప్రతికూలమైనా మధ్యవర్తిగా వెళ్లిన వ్యక్తి తన పనిని తాను సానుకూలం చేసుకోవాలంటే కొంతవరకైనా ప్రశాంతవాతావరణం అవసరం.

మొత్తంమీద ఈ వాదప్రతివాదాల మధ్య భద్రతా మండలి యుద్ధ విరమణ సాధించడం ఎలా అనే క్లిష్టసమస్యను ఎదుర్కొన్నది. ఉభయపక్షాలూ యుద్ధాన్ని విరమించేటట్లు చేయాలనీ, అందుకు ఎంత కఠిన చర్యలనైనా మండలి తీసుకొనితీరాలనీ బ్రిటన్, అమెరికాలు రెండూ స్థిరంగా సంకల్పించినవి. ఐతే అరబ్బులు ఒకపట్ల మండలిమాట వినేటట్లు లేదు. పాలస్తీనాఅంతా ఏకరాజ్యమని వారి వాదన. అక్కడ వారి దృష్టిలో ఒక్క అంగుళంమేరకూడా యూదురాజ్యంగా వుండడానికి వీల్లేదు. ఐతే పాలస్తీనాలో ప్రత్యక్షంగా యూదురాజ్యం ఏర్పడివున్నదికదా, దాన్ని శాంతిమార్గాన అరబ్బులు ఏవిధంగా తుడిచివేయగలరని కౌంట్ బెర్నాడోట్ తన నివేదికలో ప్రశ్నించాడు. యూదురాజ్యమేర్పడడమే కాకుండా ప్రముఖ రాజ్యాలన్నీ దాన్ని గుర్తించి రాయబారులను సైతం నియమించుకున్నవి. యూదు రాజ్యమైన ఇజ్రాయిల్‌ను నామరూపాలు లేకుండా తుడిచివేయడం అరబ్బులకు శక్యమయే పనికాదు.

అమెరికా తీర్మానం

మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్ నివేదికను సావధానంగా విని, సాకల్యంగా పరిశీలించిన మీదట భద్రతామండలిలో అమెరికా ప్రతినిధి పాలస్తీనా పరిస్థితి ప్రపంచశాంతికే ప్రమాద హేతువుగా పరిణమించింది కాబట్టి, ఆర్థిక సైనిక ఆంక్షల ఆచరణద్వారాగాని, సైనిక ప్రయోగం ద్వారాగాని, శాంతిస్థాపనకు మండలి పూనుకొని తీరాలని ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. బలప్రయోగానికైనా మండలి వెనుకాడ కూడదనే బెర్నాడోట్ కూడా సిఫార్సు చేశాడు. భద్రతామండలి తీర్మానాన్ని ఆమోదించిన మూడే మూడురోజులలోపుగా యూదు అరబ్ పక్షాలు రెండూ తమ సైనిక సంఘర్షణ కట్టిపెట్టేటట్లు కూడా ఆదేశించడం అవసరమని అమెరికన్ ప్రతినిధి హెచ్చరిక చేశాడు.

మండలి ఆదేశం

అమెరికన్ ప్రతినిధి ప్రవేశపెట్టిన తీర్మానంపై మూడురోజులపాటు సమగ్రంగా చర్చలు జరిపి చివరకు గత గురువారంనాడు భద్రతామండలి ఆ తీర్మానాన్ని ఆమోదిస్తూ మూడే మూడు రోజులలోపుగా యూదు అరబ్ పక్షాలు యుద్ధాన్ని బేషరతుగా ఆపివేయాలని ఆదేశించింది. పాలస్తీనా పరిస్థితి ప్రపంచశాంతికి ప్రమాదహేతువనే తీర్మాన భాగానికి 8 వోట్లు అనుకూలంగానూ, ఒకే ఒకవోటు ప్రతికూలంగానూ వచ్చినవి. చైనా అర్జెంటీనాలు మాత్రం వోటు వేయలేదు. అరబ్‌రాజ్యమైనా సిరియా ఒక్కటే తీర్మానాన్ని ప్రతిఘటించింది. తక్షణమే యుద్ధ విరమణ అవసరమనే ఆజ్ఞాపనకు 9 వోట్లు అనుకూలంగానూ, ఒకే ఒకవోటు ప్రతికూలంగానూ వచ్చినవి. అర్జెంటీనా తటస్థంగా వూరుకున్నది. సిరియా ప్రతిఘటించింది. జెరూసెలంలో వెంటనే యుద్ధం ఆగాలనే తీర్మాన భాగాన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. యుద్ధవిరమణ యూదులకే లాభసాటి బేరం కాబట్టి, అరబ్ రాజ్యాల సాధకబాధకాలను సభ్యులు గమనించాలనీ, యుద్ధ విరమణ ఆదేశానికి అరబ్‌రాజ్యాలుకూడా ఏసమాధానం ఇస్తవో కొంచెం ఓపికపట్టి చూడవలసిందని సిరియా ప్రతినిధి మండలికి ప్రత్యేక విజ్ఞప్తి చేశాడు. జులై 18 ఆదివారం అపరాహ్ణముతో మండలి పెట్టిన గడువు పూర్తిఅయింది. అప్పటిలోగానే అరబ్‌రాజ్యాలు యుద్ధ విరమణకు తమ అంగీకారాన్ని మండలికి అందజేయాలన్నమాట. మండలి ఆదేశాన్ని యూదులు అంగీకరించినట్లు వెంటనే తెలియజేశారు. ట్రాన్స్‌జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో రహస్యసమాలోచనలు జరుపుతున్న, అరబ్ రాజ్యాలు యుద్ధ విరమణకు సమ్మతించినవి.

యూదు విజయాలు

పాలస్తీనా భవిష్యత్తుపై భద్రతా మండలి చర్చలు ఈ విధముగా ఒకవైపు సాగుతూనే వున్నవి. వున్నకొద్ది వ్యవధిలోనే యూదు అరబ్ పక్షాలు హోరాహోరిగా పోరాడి ఎవరికి అందిన విజయాలను అవి సాధిస్తూనే వున్నవి.

ఏసుక్రీస్తు జన్మస్థానమైన నాజరెత్ వద్ద ఈ వారారంభంలో ప్రారంభమైన భీషణసంఘర్షణలో చివరకు యూదులదే పైచెయ్యి అయింది. నాజరెత్ వారి హస్తగతమైంది.

జెరూసెలంకు మంచినీరు సప్లయిచేసే పట్టణము, పెద్ద రైల్వేజంక్షనుఅయిన రాస్ ఎల్ ఐన్ (దీని ఉనికి జెరూసెలంకు 20 మైళ్లు వాయవ్యంగా), నాజరెత్‌కు పశ్చిమంగా ఐదు మైళ్ళలోవున్న మలూల్ అనే అరబ్ పట్టణం, హైఫాకు 12 మైళ్లు తూర్పుగావున్న షాఫా అమిర్ అనే మరొకపట్టణం యూదుల వశమైనవి. దక్షిణరంగంలో ఈజిప్షన్ సేనలు చేరివున్న ఇస్దూద్ అనే పట్టణ రక్షణ శ్రేణులలోకి తమ సేనలు చాలా సార్లు చొచ్చుకొని వెళ్లినట్లుకూడా యూదులు ప్రకటించారు. ఇంతేగాక, ట్రాన్స్‌జోర్డాన్ రాజధాని అమ్మాన్ నగరంపైనా, రాజధాని కైరోపైనా యూదువిమానాలు ఈ వారం చాలసార్లు విజృంభించి దాడులు జరిపినవి.

300 మంది పరిశీలకులు

ఇప్పుడున్న యుద్ధవిరమణపరిశీలకుల సంఖ్య చాలదనీ, అదనంగా కనీసం మూడువందల మందైనా కావలసి వుంటుందనీ కౌంట్ బెర్నాడోట్ భద్రతామండలికి విజ్ఞప్తి చేశాడు. ఈ విజ్ఞప్తిని మండలి పాటించింది. అమెరికా, ఫ్రాన్సు, బెల్జియం దేశాలు మూడూ ఒక్కొక్కటే వందమంది యుద్ధవిరమణ పరిశీలకులను సప్లయి చేయవలసి వుంటుందని సమితి ప్రధాన కార్యదర్శి ట్రిగ్వేలీ కోరినట్లు తెలుస్తున్నది.


ఐక్యరాజ్యసమితి ఆర్థిక సైనిక ఆంక్షలను ప్రయోగిస్తుందేమోననే భయమే అరబ్ రాజ్యాలు యుద్ధవిరమణ ఆదేశాన్ని అంగీకరించడానికి చాలావరకు కారణమై వుంటుంది.

ఐక్యరాజ్య సమితినుండి విరమించడానికైనా తాము సిద్ధమేనని మొదట ప్రగల్భాలు కొట్టిన అరబ్ రాజ్యాలు అంతర్జాతీయ ఒత్తిడికి లొంగి కొంతవరకు దారికి వస్తున్నవనే భావించవలసి వుంటుంది. పైగా, కొత్తగా ఏర్పడుతున్న యుద్ధ విరమణకాలంలో సైనికంగా కట్టుదిట్టాలు చేసుకొని ద్విగుణీకృతోత్సాహంతో తిరిగి యుద్ధం సాగించాలన్నది కూడా అరబ్బుల ఉద్దేశం కావచ్చు. లోలోపల ఏ ఉద్దేశాలు, ఏ దురుద్దేశాలు వున్నప్పటికీ ఉభయపక్షాలు యుద్ధవిరమణ ఒప్పుకుంటున్నవి. ఐతే ఈ యుద్ధ విరమణను ఐక్యరాజ్యసమితి మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్‌కు పాలస్తీనాసమస్యను శాశ్వతంగా రించడానికి ఎంతవరకు ఉపయోగపడుతుందన్నదే పెద్ద సందేహం.

ఐక్యరాజ్యసమితి ఆమోదించిన విభజన పథకం, ప్రత్యేక యూదురాజ్యాన్ని స్థిరపరచడం, పాలస్తీనాకు యూదులను వలసరానివ్వడం, జెరూసెలం నగరభవిష్యత్తు—ఈ జటిల సమస్యల పరిష్కారానికి యుద్ధవిరమణ ఏమైనా సహాయపడగలదా? లేక, ఈసారి ఏర్పడే యుద్ధవిరమణకు కూడా లోగడ విరమణకు పట్టిన గతే పడుతుందా? ఉభయపక్షాల వాదప్రతివాదనలను, యుద్ధ సంకల్పాన్నీ బట్టి చూస్తే పాలస్తీనా సమస్యను కౌంట్ బెర్నాడోట్‌గాని, ఆయనకింద కొత్తగా పనిచేసే 300 మంది పరిశీలకులుగాని, ఐక్యరాజ్య సమితిగాని సామరస్యంగా పరిష్కారం చేయగలరనుకోవడం కేవలం భ్రమ ఏమో ననిపిస్తోంది.

అమెరికన్ డెమోక్రటిక్ పార్టీ చీలిక
ట్రూమన్‌కు పోటీగా మరొక అభ్యర్థి

అమెరికన్ డెమోక్రటిక్ పార్టీ సమావేశం ఈ వారం మూడు రోజులపాటు ఫిలడెల్ఫియా నగరంలో సమావేశమై రానున్న ఎన్నికలలో అధ్యక్షస్థానానికి తమ అభ్యర్థిగా ప్రెసిడెంట్ ట్రూమన్‌ను నామినేట్ చేయడానికి నిర్ణయించింది. ఐతే ఇది ఏకగ్రీవంగా జరిగిన నిర్ణయం కాదు. నీగ్రోలకు పౌరసత్వహక్కులను ప్రసాదించడానికి ట్రూమన్ అనుసరిస్తున్న విధానాన్ని జాతివిద్వేషభరితులై దక్షిణరాష్ట్ర ప్రతినిధులు ఖండిస్తున్నారు. యూదుల విషయంలో కూడా ట్రూమన్ విధానం వారికి నచ్చలేదు. అందుచేత దక్షిణరాష్ట్రాల డెమోక్రటిక్ పార్టీ తరఫునే అధ్యక్షస్థానానికి దక్షిణ కెరొలినా రాష్ట్ర గవర్నర్ స్ట్రాం థర్మాండ్‌ను ట్రూమన్‌కు పోటీగా నిలుపదలచారు. ఈ విధంగా డెమోక్రటిక్ పార్టీలోనే పెద్ద చీలిక ఏర్పడడంవల్ల, ఎన్నికలలో ట్రూమన్ విజయావకాశాలు మరీ సన్నగిలిపోయినట్లు స్పష్టపడుతున్నది. రానున్న ఎన్నికలలో హెన్రీ వాలెస్, థామస్ డ్యూయి, ప్రెసిడెంట్ ట్రూమన్, స్ట్రాంథర్మాండులు నల్గురూ పోటీ చేస్తారన్నమాట.



౨౫

నికోల్స్కలో కాట్యా, ఆర్కాడీలు ఒక ఆష్ చెట్టునీడలో పచ్చికమీద కూర్చున్నారు. ఫీఫీ వారికి దగ్గరగా నేలమీద చిత్రంగా వంపు తిరిగి పడుకుని ఉంది. పక్కలమీద మోజు గలవాళ్లు ఆ వంపుని 'తోడేలు వంపు' అంటారు. ఆర్కాడీ, కాట్యా ఇద్దరూ మౌనంగానే కూర్చున్నారు. సగం తెరిచిన పుస్తకం అతనిచేతిలో ఉంది. ఆమె ఒక బుట్టలోనుంచి మిగిలిపోయిన రొట్టెముక్కలు ఏరుతోంది. ఏరి వాటిని పిచ్చుకలకు గిరవాటేస్తోంది. చిత్రమయిన పిరికితనంతో కూడిన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తో ఆ పిచ్చుకలు ఆమెకాళ్లదగ్గరే ఎగురుతూ గెంతుతున్నాయి. చిరుగాలికి ఆష్ చెట్టు ఆకులు కిందికీ పైకీ ఊగుతున్నాయి. ఫీఫీ వీపుమీద పల్చని బంగారు రంగు ఎండపొడలు ఆ ఆకుల కదలిక వల్ల వచ్చిపోతున్నాయి. ఆర్కాడీ కాట్యాలు ఎండపొడ లేని, నీడలో కూర్చుని ఉన్నారు. అప్పుడప్పుడు కాట్యాతలకట్టు పగటి వెలుగువల్ల తళుకుమని మెరుస్తోంది. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. కాని ఆ మౌనంగా ఉండడంలోనే, అల్లా దగ్గరగా కూర్చోవడంలోనే, పరస్పర విశ్వాసంతో కలిసిన చనువు వ్యక్తమవుతోంది. ఒకరికొకరు దగ్గరగా ఉన్న ఆనందం ఇద్దరి హృదయాలలోనూ రహస్యంగా ఉన్నా, ఒకరిని గురించి ఒకరు ఆలోచిస్తున్నట్టుకూడా వారు కనుపించరు. వనకాల మనం చూసినప్పటికంటె ఇప్పుడు వారి ముఖాలుకూడా మారిపోయాయి. ఆర్కాడీ ఎక్కువ ప్రశాంతంగా ఉన్నాడు. కాట్యా ఎక్కువ చురుకుగా సంకోచం లేకుండా ఉంది.

ఆర్కాడీ అన్నాడు, "ఈ ఆష్ చెట్టుని రష్యన్ భాషలో యాసెన్ అంటారు. అది అందంగా లేదూ? గాలికూడా కనిపించేటంత పల్చగా అంత కలాసాగా ఉండే చెట్టు ఇంకొకటి నాకు కనిపించలేదు."

కాట్యా చూపులు పైకెత్తిచూసింది "నిజమే," అంది. ఆర్కాడీ తనలో అనుకున్నాడు, "ఈ మెమట్టుకు కవిత్వం మాట్లాడినందుకు నన్ను చులకన చెయ్యదు"

"హీన్ అంటే నాకు గిట్టదు," అంది కాట్యా, ఆర్కాడీచేతిలో ఉన్న పుస్తకంవేపు చూస్తూ, "అతను దుఃఖిస్తున్నా, నవ్వుతున్నా నాకు ఒకలాగే ఉంటుంది అతను విషాదంగా, బరువుగా ఆలోచనలో పడ్డప్పుడుమాత్రం నాకు నచ్చుతాడు."

"అతను నవ్వుతుంటే నాకు ఇష్టం," అన్నాడు ఆర్కాడీ.

"వెనకటి కెళ్లకోళపు పద్ధతి తాలూకు వాసనలు నీలో ఇంకా పోలేదు," ("వాసనలా!" అనుకున్నాడు ఆర్కాడీ, "బజరోవ్ ఇది వింటే!") "కొన్నాళ్లు ఆగితే నిన్ను మార్చి వేస్తాం"

"ఎవరు నన్ను మార్చేది? నువ్వా?"

"ఎవరా?—మా అక్కయ్య. నువ్వు ఈమధ్య జగడం ఆడడం మానేశావే—ఆ ప్రొఫిరీ ప్లాటానోవిచ్, తరవాత నువ్వు చర్చికి వెళ్ళినా, కూడా వుండి తీసుకువెళ్లావే—ఆ మనిషి."

"అవును మరి. రమ్మంటే ఎల్లాగ రాననడం? ఇంక ఆనాసర్గీవ్నా విషయం. నీకు జ్ఞాపకం ఉందా, బజరోవ్‌తో ఎక్కువగా ఏకీభవిస్తుంది ఆమె."

"అప్పుడు అతని ప్రభావంలో పడిపోయింది ఆమె—నీలాగే."

"నాలాగా? అయితే ఆ ప్రభావాన్ని ఇప్పుడు వదల్చుకున్నానని నువ్వు కనిపెట్టావా?"

కాట్యా సమాధానం చెప్పలేదు.

"నాకు తెలుసు," అన్నాడు ఆర్కాడీ, "అతనంటే నీకు ఇష్టంలేదు."

"అతన్ని గురించి నాకు ఏ అభిప్రాయమూ లేదు"

"కాతెరీనా సర్గీవ్నా, నువ్వు అల్లా సమాధానం చెప్పినప్పుడల్లా నువ్వు నిజం చెప్పడం లేదని నాకు అనిపిస్తుంది తెలుసా?.....ఎవరిని గురించి అయినాసరే మనకి ఏ అభిప్రాయమూ లేకుండా ఉండదు. ఊరికే అల్లాఅంటే సభ్య పరచడం అవుతుంది."

"పోనీ, అల్లా అయితే నాకు ఇష్టం లేదనే అనుకో... అతనంటే నాకు ఇష్టంలేకపోవడం కాదు. కాని అతని తరహా వేరు... నా తరహా వేరు, నా... నీతరహాకూడా వేరే."

"ఎంచేత?"

"అది ఎల్లా చెప్పడం?... అతను అడివిజంతువయితే నువ్వు పెంపుడు జంతువ్వి."

"నేను పెంపుడు జంతువునికూడానా?"

కాట్యా తల ఊపింది.

ఆర్కాడీ చెవి గోక్కున్నాడు. "ఒక సంగతి నీతో చెప్పనా? కాతెరీనా సర్గీవ్నా నువ్వన్నది దూషణకింద వస్తుంది తెలుసా?"

"అయితే నీకు అడివి జంతువుగా ఉండడం ఇష్టమా?"

"అడివి జంతువని కాదు, చైతన్యశక్తితో నిండి ఉండాలి."

"అల్లా ఉండాలని ఆశిస్తే లాభం లేదు. చూశావా నీ స్నేహితుడు అల్లా ఉండాలని ఆశించడు, సహజంగానే అల్లా ఉంటాడు అంతే"

"ఊఁ! అయితే ఆనాసర్గీవ్నాకూడా అతని ప్రభావంలో పడి పోయిందని నీ అభిప్రాయం."

"అవును. అయినా ఎవరుగాని ఆమెకంటె పైచేయిగా అట్టే కాలం నిలబడలేరు,' అంది కాట్యా మెల్లగా.

"ఎంచేత అల్లా అనుకుంటున్నావు?"

"ఆమెకు గర్వం ఎక్కువ...... అంటే నా అభిప్రాయం...... తన స్వేచ్ఛని అన్నిటికంటే ఎక్కువగా ఆమె చూసుకుంటుంది."

"ఎవరు చూసుకోరు?" ఆర్కాడీ అడిగాడు. కాని అతని మనస్సులో మెరుపులా మెరిసింది ఒకప్రశ్న, "దానివల్ల ప్రయోజన మేమిటి?" కాట్యాకికూడా అదేప్రశ్న మనస్సులో తోచింది, "దానివల్ల ఏం ప్రయోజనం?" యువతీయువకులు చనువుగా స్నేహంగా కూర్చుని మాట్లాడుతున్నప్పుడు తరుచు ఒకేరకమయిన ఊహలు వారి మనస్సుల్లోకి వస్తుంటాయి.

ఆర్కాడీ చిరునవ్వు నవ్వుతున్నాడు. కాట్యాకి దగ్గరగా జరిగాడు. మెల్లగా చెవిదగ్గర అన్నాడు, "ఆమెను చూస్తే నీకు కొంచెం భయమని ఒప్పుకుంటావా?"

"ఎవరంటే?"

"ఆమె," ఆర్కాడీ స్పష్టీకరిస్తూ అన్నాడు.

"నీ విషయం?" అని కాట్యా ప్రశ్నించింది.

"నేను కూడా. నేనుకూడా అన్నాను గుర్తుంచుకో."

కాట్యా చూపుడు వేలితో అతన్ని బెదిరించింది. "నాకు చిత్ర మవుతుంది," అంది కాట్యా. "మా అక్క ఇదివరకెప్పుడూ ఇంత స్నేహంగా నీతో మసలలేదు. నువ్వు ఇక్కడికి మొట్టమొదట వచ్చినప్పటికంటేకూడా..."

"నిజంగా!"

"ఏం నీకు కనిపించడంలేదూ? నీకు సంతోషంగా లేదూ?"

ఆర్కాడీ ఆలోచనలో పడ్డాడు.

"ఆనాసర్గీవ్నా స్నేహానికి నే నెల్లాగ అర్హుణ్ణి అయ్యాను? ఊరికే మీ అమ్మగారు వ్రాసిన ఉత్తరాలు తెచ్చిపెట్టినందుకు కాదా?"

"అదీన్నీ, ఇంకా కొన్ని కారణాలున్నాయి. అవి చెప్పను."

"ఏం?"

"చెప్పను."

"అబ్బ! నీకు పెంకితనం ఎక్కువ."

"అవును. నిజమే."

"అల్లా ఉంటావుగాని చాలా చూస్తుంటావు."

కాట్యా పక్కవాలుగా అతనివేపు చూసింది. "అయి ఉండవచ్చు. ఏం నీకు చిరాకుగా ఉంటుందా? ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నువ్వు ఇంత సునిశితంగా ఎల్లా చూడ్డానికి అలవాటుపడ్డావో నని ఆలోచిస్తున్నాను. నీకు సంకోచం ఎక్కువ ఎవరితోటీ చనువుగా మాట్లాడవు. అందరినీ దూరంగా అట్టేపెడతావు"

"నేను జీవితంఅంతా ఏకాంతంగానే గడిపాను. అల్లా ఉన్నప్పుడు ప్రతివాళ్లకీ ఆలోచన ఎక్కువవుతుంది. కాని నేను అందరినీ దూరంగా అట్టే పెడుతున్నానా?"

ఆర్కాడీ కృతజ్ఞతతో కాట్యా వేపు చూశాడు.

"అదంతా బాగానే ఉంది," అన్నాడు, "కాని నే ననేది ఏమంటే, నువ్వు పెరిగిన పరిస్థితుల్లో పెరిగినవాళ్లకి ఆ శక్తి సామాన్యంగా వచ్చిపోతుంది. మహారాజుల కిల్లాగో అల్లాగే వాళ్లకికూడా నిజాన్ని గుర్తించడం మహాకష్టం."

"కాని నాకు డబ్బులేదు చూడు"

ఆర్కాడీ ఆశ్చర్యపడ్డాడు. కాట్యా అన్న మాటలకి అర్థం అతనికి వెంటనే స్ఫురించలేదు. "అవును నిజమే. ఆస్తిఅంతా అక్కగారిదేగా," అన్న ఊహ చటుక్కుని అతనికి తోచింది. ఆ ఊహ అతనికి ఎంతమాత్రం వెగటుగా లేదు. "ఎంత చక్కగా చెప్పావు అది!" అన్నాడు.

"ఏది?"

"నువ్వు చాలా సహజంగా, చక్కగా అన్నావు. నీకు డబ్బు లేదని నువ్వు సిగ్గుపడకుండాను, అదొక గొప్పవిషయం అన్నట్టు దర్పం లేకుండానూ చెప్పావు. సంగతి వచ్చిందిగనక అంటున్నాను. తను పేదవాడని తెలిసిఉండి, అది తరుచు చెప్పకునే వ్యక్తికి సామాన్యంగా ఆవిషయమయి ఒకరకమయి నగర్వం ఉంటుంది."

"మా అక్కధర్మమా అని నిజంగా నాకు అల్లా అనుకోవలసిన అవసరమే లేకపోయింది. ఊరికే విషయంవచ్చింది గనక నేను ఆమాట అన్నాను."

"అయితే; నే నన్న గర్వం నీకుకూడా కొంత ఉందని నువ్వు ఒప్పుకోవాలి."

"ఎల్లాంటి గర్వం?"

"ఎల్లాంటి గర్వం అంటే, నువ్వు—ఈ ప్రశ్న వేసినందుకు నువ్వు ఇంకోలా అనుకో కూడదు—నువ్వు ఒక ధనవంతుణ్ణి పెళ్లాడ్డానికి ఒప్పుకుంటావా?"

"అతన్ని నేను బాగా ప్రేమించగలిగితే సం......అయినాసరే నేను పెళ్లాడ్డానికి ఒప్పుకోననుకుంటాను."

"చూశావా? నేను చెప్పలేదూ?" ఆర్కాడీ చటుక్కుని అన్నాడు. కొంతసేపు ఆగి అన్నాడు, "ఎందుకు ఒప్పుకోవు?"

"ఎంచేతనంటే కథల్లోకూడా ఇద్దరి తాహతూ సరిపడకపోతే ఆ పెళ్లిళ్లు సవ్యంగా ఉండవు."

"నీకు అధికారం చెలాయించడానికి అవకాశం ఉండాలని నీకోరిక, లేకపోతే......"

"లేదు. ఎందుకుండాలి నాకల్లాంటి కోరిక? అదేకాదు, నేను ఒకరికి లొంగి ఉండటానికి ఏమీ అభ్యంతరం చెప్పను. సమానత్వం లేకపోతే నేను భరించలేను. తన ఆత్మగౌరవానికి భిన్నంలేకుండా ఒక వ్యక్తికి లొంగి ఉండడం నాకు తెలుసు. అందులో నిజమయిన ఆనందం ఉంది. కానీ పరిస్థితులకు లొంగిపోయి జీవించడం......వద్దు. ఆజీవితం నేను చాలాకాలం నించి గడుపుతున్నాను."

"సరే, ఆవిషయం ఇంక మాట్లాడనక్కరలేదు," అన్నాడు ఆర్కాడీ. "అవును నిజమే," తరవాత అన్నాడు, "ఆనాసర్గీవ్నా చెల్లెలివయి నందుకు ఊరికే పోలేదు. ఆమెకు స్వేచ్ఛ ఎంత ఇష్టమో, నీకూ అంతే. నువ్వసలు ఎవరితోటీ కలవవు. అది ఎంత గాఢమయినదయినా సరే, ఎంత పవిత్రమయినదయినా సరే, నీ అంతట నువ్వు నీ హృదయంలో ఉదయించిన భావాన్ని ఏమయినాసరే వ్యక్తపరచవు. నాకు తెలుసు......"

"అయితే ఎల్లా ఉండాలని నీ అభిప్రాయం?" కాట్యా అడిగింది.

"నీకు ఆమెకున్నంత తెలివితేటలూ ఉన్నాయి. అంతటి గాంభీర్యమూ ఉంది."

"అబ్బ! మా అక్కతో నన్ను పోల్చకు బాబూ!" కాట్య అతన్ని వారిస్తూ అంది. "నాకు అన్యాయం చేసినట్టు అవుతుంది. నువ్వు మరిచిపోతున్నట్టున్నావు మా అక్క అందమయినది, తెలివయినది. తరవాత......నువ్వు అల్లాంటిమాటలు అనకూడదు, ఆర్కాడీ నికోలాయిచ్, అందులో అంత దీర్ఘముఖంతో అసలే అనకూడదు."

"నే ననకూడదంటే నీ అభిప్రాయం? నేను వేళాకోళాని కంటున్నానని నీకెందుకు అనిపించింది?"

"సందేహం ఏమిటి? నువ్వు వేళాకోళానికే అంటున్నావు."

"నువ్వలా అనుకుంటున్నావా? నేను నిజంగానే ఇల్లా అనుకుంటూ ఉంటేనో? అసలు చెప్పవలసినంతగట్టిగా నేను చెప్పలేదని అనుకుంటేనో?"

"అయితే నీ తత్వం ఏమిటో నాకు బోధపడదు"

"నిజంగా? సరే అయితే. నే ననుకున్నంత గ్రహణశక్తి నీకు లేదన్నమాట."

"ఎంచేత"

ఆర్కాడీ సమాధానం చెప్పలేదు. పక్కకి తిరిగాడు. కాట్యా ఇంకా కొన్ని రొట్టె ముక్కలకోసం బుట్టలో వెతికింది. అవి తీసి పిచుకలకు విసిరింది. కాని ఆ విసరడం చెయ్యి చురుకుగా విసిరింది; పిచుకలు భయపడి అవి తినకుండానే ఎగిరిపోయాయి.

(19 వ పేజీ చూడుడు)

గాంధీ మహాత్ముని సందేశము

ఎడ్గార్ స్నో

3

గాంధీజీ, మార్క్సువలెనే ప్రభుత్వ వర్గ మంటూ ఒకటి ఉండటానికి అయిష్టపడతాడు. ఒకసారి నాతో, తాను "వేదాంతపరమైన అరాచకవాది"గా సంభావించుకొంటున్నానని చెప్పాడు. కాని ఆయన కర్మణ్యుడైన సామ్యవాది. అందుచేతనే ప్రజాస్వామ్యసిద్ధికైన ఆయన ప్రయత్నంలో, 'ప్రభుత్వ'-భావ-హ్రస్వత్వాన్ని ఆలంబనగా చేసుకోవలసిన అవసరం ఆయనకు కనబడలేదు—అయితే "ప్రజాస్వామ్య"న్ని ఆయన అవగాహన చేసుకున్న పద్ధతిని, నేటి క్రెమ్లిన్‌లోని "పోలీసుపాలిత" సామ్యవాదస్థితి, తోటిదని, అనూహపడటానికి ఏంతమాత్రమూ వీలులేదు. (మహాత్ముని హత్యవార్త తెలిసినవెంటనే ప్రపంచదేశాల ప్రభుత్వాలన్నీ భారత ప్రభుత్వానికి తమ సానుభూతి తెలుపుతూ సందేశాలనంపాయి. ఒక్క జనరలిస్మో స్టాలిన్ వద్దనుంచి మాత్రమే ఏ సందేశమూ లేదు.)

"సరిగా చూస్తే, తనకు, న్యాయంగా అవసరార్థంగా, కావలసినదానికన్నా ఎక్కువ, కూడబెట్టటం, దొంగతనమే అవుతుంది. సంఘన్యాయం పాటిస్తూ, సంపద సమిష్టిగా, సక్రమంగా వినియోగపడే నిబంధనావళిని తెలివిగా ఏర్పరుచుకో గలిగితే దొంగలుండటానికి గాని, దొంగతనం చెయ్యటానికిగ్గాని అవకాశమే ఉండదు." అని గాంధీజీ ఒకసారి చెప్పాడు.

పెద్దపెద్ద పరిశ్రమల యాజమాన్యము సంఘపరమై యుండి, సహకారపద్ధతిని వ్యావసాయిక సంపదనుపయోగిస్తూ, చైనాలో ఉంటూన్నటువంటి (ఉన్నయని నేనే ఆయనతో చెప్పాను.) చిన్న పరిశ్రమల సహకారవిధానము వాటికి తోడుగా ఉంటూ, ఉండాలని ఆయన కోరేవాడు. కాని ప్రభుత్వము శాంతపద్ధతులలో మాత్రమే, నెమ్మదిగా, ఈ ఆధిపత్యము తీసికోవాలని అనేవాడు. "బలవంతంగా ధనవంతుల వద్ద నుండి ధనం లాగేయటం నేను ఒప్పుకోను. జాతి సంపద అంతా ప్రభుత్వాధిపత్యంలో ఉండేందుకు చేసే ప్రయత్నంలో, వాళ్ళ సహకారాన్ని కూడా అపేక్షించాలి. సంఘానికి అస్పృశ్యులు అంటూ లేరు. లక్షాధికారులూ, భిక్షాధికారులూకూడా, సంఘములోని ఒకే జాడ్య ఫలితంగా ఉద్భవించిన వ్రణాలు." అని ఆయన చెప్పాడు.

"నేను ముప్ఫైఏళ్ళక్రింద దక్షిణాఫ్రికాలో ఉన్నపుడే, సామ్యవాదతత్వాన్ని ఒప్పుకున్నాను." అని గాంధీజీ అన్నాడు. "సామ్యవాదానికి మూలస్తంభము, సర్వజనుల ఆర్థిక సమానప్రతిపత్తి. ఒకవైపు జనబాహుళ్యానికి తిండికిలేకుండా ఉంటూ, మరొకవైపు ధనవంతులు భోగాల్లలో పొర్లుతూన్న నేటి సాంఘిక, అసమదుస్థితులలో, "రామరాజ్య" మంటూ ఉండటానికి ఆస్కారము లేదు."

దేశంలో నూటికి ఇరవైమంది నిత్యమూ తిండిలేక, ఆకలివాత బడి క్రుంగిపోతూ, మరి ఇంకో నలభైమంది అరాకలితో ఎట్లాగో ప్రాణాలీడ్చుకొంటూ, ఆ దేశంలోనే మరోవైపు ప్రపంచంలోకల్లా మహాధనవంతులైన కోటీశ్వరులు గల్గిన, భారతదేశంలో, సమిష్టిగా, సార్వజనీనముగా సంస్కారం కలిగేందుకు సర్వతోముఖమైన నిరంతరకృషి సాగించవలసిన ఆత్యవసరాన్ని గాంధీజీ గుర్తించాడు. హరిజన్‌లో ఆయనవ్రాసిన తుది సంపాదకీయంలో, కాంగ్రెసుపక్షాన్ని తీవ్రంగా మందలిస్తూ "నిన్నటిదాకా కాంగ్రెసు, దేశసేవకస్థానంలోనే నిలచింది. నేడు మనకు లభించింది రాజకీయస్వాతంత్ర్యమొకటిమాత్రమే. ఇంకా ఆర్థిక స్వాతంత్ర్యము, సాంఘిక స్వాతంత్ర్యము, నైతిక స్వాతంత్ర్యమూ, మనము సాధించుకోవలసి ఉంది." ఆ సంపాదకీయంలో ముగింపుమాటలు, ఇట్లా ఉన్నవి: "ఈనాడు దేశరంగం, కాంగ్రెసు పిడికిలిలో సంపూర్ణంగా లేకపోవటం మన అదృష్టం! అందుకు దైవానికి ధన్యవాదాలర్పించవచ్చు." ఈ మాటలు గాంధీజీ అన్నాడంటే గాంధీజీ, వజ్రాయుధాన్ని ఝుళిపించాడన్నమాటే.

ఈనాడు ప్రపంచం అడుగుతూన్న ప్రశ్న ఇది: "గాంధీ లేకుండా, గాంధీ తత్వాన్ని ప్రయోగించేందుకు ఆస్కారముందా?" దీనికి జవాబు ఇవ్వాలంటే, ప్రప్రథమ అర్హత భారతదేశానికే ఉంది. ఆ గురువు జీవించి, సుస్పష్టంగా, నిర్దిష్టంగా, బోధిస్తూ సంచరించిన దేశ మిది. ఆయన చివరిదినాల్లో ఆయనతో మాట్లాడినవాళ్ళు, ఆయన సంభాషణ తీరు కేమాత్రం అలవాటుపడకున్నా చాలు— ఆయనలోని అసంతృప్తిని గ్రహించగలిగి ఉండేవారు. ప్రభుత్వ యంత్రంలోని అవినీతి, హింసాబుద్ధితో, మతకలహాలను ప్రేరేపిస్తూ, నిత్యం మొలకలెత్తుతున్న పరస్పరద్వేషాలను తుడిచిపెట్టెయ్యలేకపోవటం—ఇవి ఆయనను నైరాశ్యపూరితుని చేస్తుండేవి. ఈ మతవిద్వేషబీజాలు ప్రభుత్వయంత్రంలోకూడా కొద్దికొద్దిగా ప్రవేశించ గలిగాయనటానికి, హిందూ ముస్లిం సఖ్యతను సంస్థాపించలేనందుకు ఆక్షేపణగా ఆయన మొదలుపెట్టిన తుది ఉపవాసమే తార్కాణము.

గాంధీజీ ప్రభుత్వవిషయంలో నెహ్రూ పక్షానికి మొగ్గేవాడు. ఆ పక్షము లిబరల్-డెమోక్రాటిక్ పక్షము. మహాత్ముని "సంఘన్యాయ" ప్రణాళికను ఒప్పుకున్నది. అనేక సార్లు నెహ్రూ తన "రాజకీయవారసుడ"ని ఆయన చెప్పనే చెప్పాడు. కుడిపక్షంవారు, గాంధీజీహత్య జరిగేదాకా తాము నెగ్గుతూన్నట్లే అనుకున్నారు. కాని "నిప్పుతో చెరలాడుతున్నామని వాళ్ళకు తెలియటంలే"దంటూ గాంధీజీ తన్ను చూడవచ్చేవారిలో ఒకరితో అన్నాడు. గాంధీజీ, ఏ, మతపక్షం బయలుదేరినందుకు విచారిస్తూండేవాడో, ఏ మతపక్షమే చివరికి ఆయనను బలిగొన్నదో, ఆ దుష్టసంస్థను అణచేసి ఆయనను రక్షించకపోయారే అని, ఏ ఒక్కరినెత్తిమీదా బాధ్యత పెట్టి నిందించటం, ఇవాళ చాలా, అనవసరంగా నిష్ఠురమాడటం అవుతుంది.

ఈ ప్రభుత్వం విషయంలో ఆయన అభిప్రాయం ఏమిటని, చివరిమాటు ఆయన్ని నేను ప్రశ్నించినప్పుడు గాంధీజీయే, ప్రభుత్వ ప్రణాళికలను చాలావాటిని తను ఆమోదించటం లేదని నాతో చెప్పాడు. అని, తనంతటతనే "మునుపు వల్లభాయి పటేలు నేను చెప్పిందానికల్లా తల ఊపుతాడని అనేవారు. ఇప్పుడల్లా అంటే, అపహాస్యంగా ఉంటుంది. అతనిమీద నా కిప్పుడేమీ ప్రభావం లేదు" అన్నాడు.

పాతికేళ్ళక్రింద, పటేలు తన సర్వస్వమూ త్యాగం చేసివైచి, మహాత్ముని వెంట నడచాడు. కాని ఆనాడుకూడా, స్వాతంత్ర్య సమరానికి ధనం సమకూర్చేందుకు, సంకుచితతత్వులైన మహాధనవంతులతో సంబంధబాంధవ్యాలు అట్టే నిలుపుకొని, వారి ధనసహాయాన్ని ఉద్యమానికి సమీకరిస్తూ వచ్చాడు. జాతీయోద్యమ సంకలనవిధిలో గాంధీజీ ఆ ధనవంతుల సహాయాన్ని స్వీకరించాడు. కాని రానురాను, ఆ సహాయంలో అనుభూతమై ఉన్న అపాయాలను గుర్తించాడు.

భారతమంత్రివర్గంలో "తాత్వికంగా" పొరపులు వచ్చినప్పుడు నెహ్రూను బలపరుస్తూ వచ్చాడు. ఒకసారి పటేలుతో, "నెహ్రూ బలవంతంగా మంత్రివర్గంలోనుంచి విరమించాల్సిన స్థితి తెస్తే, ఇకనేను నీతో మాట్లాడను" అన్నంత తీవ్రంగా బెదిరించినట్టు కూడా, అధికారవర్గాలవల్ల నాకు తెలిసింది.

ఏది ఏమైనా, కాంగ్రెస్ అధిష్ఠానవర్గంమీద ప్రభావం, పటేలుకు పూర్తిగా ఉందనీ, ప్రభుత్వ కీలకస్థానాలలో ప్రతిచోటా తన వాళ్ళను పటేలు నియమించాడనీ అనేది యదార్థము. "హోం" శాఖామంత్రిగా పోలీసువర్గం అంతా అతనిచేతిలో ఉంది. సంస్థానశాఖామంత్రిగా, దేశంలో మూడోభాగం ఆక్రమించుకొన్న సంస్థానాలకు, అధిపతులైన మహారాజుల వ్యవహారాలన్నీ అతనితోనే ఉన్నాయి. ప్రచారశాఖామంత్రిగా, దేశంలో ప్రచార ప్రభావం అంతా అతని అదుపాజ్ఞలోనే ఉంది. కాంగ్రెస్ ఖజానాతాళంచెవులు అతని చేతిలోనే ఉన్నాయి. రష్యన్ పోలిట్ బ్యూరోలాంటి కాంగ్రెసుకార్యవర్గంలో అధికసంఖ్య అతని చేతులలోనే ఉంది. జాతీయ వాదులలోనుంచి వచ్చినవారందరిలోకీ మిన్నగా పరిపాలనా సమర్థుడు కావటంకల్ల పటేలు సహాయం నెహ్రూకు చాలా అవుసరమైంది.

ఒకప్రక్క కులమతవర్గవివక్షతా హీనమూ, సర్వసంఘ సంస్కారపూరిత ప్రజాస్వామ్యమూ—అనే ఏ సూత్రాలమీద కాంగ్రెస్ అధికారంలోకివచ్చిందో, ఆ సూత్రాలను విపులీకరిస్తూ నెహ్రూ ఉపన్యాసాలిస్తూంటే, మిలిటరీరాజ్యము, హిందూ పక్షపాతము వైపు నడుస్తూన్న ప్రభుత్వంలో తన ఆధికారాన్ని పటేలుబలీయం చేసుకోగలిగాడు.

గాంధీజీ నిర్యాణానికి కొద్దికాలంక్రితమే, హిందూమహాసభను, రాష్ట్రీయ స్వయంసేవకసంఘాన్నీ, తమసంస్థలను చాలించి, కాంగ్రెసులో చేరవలసిందని పటేలు ఆహ్వానించాడు. ఈ సంఘాలు రెంటినీ గాంధీజీ ఆమోదించలేదు. పైగా ఆయన కోరిన ప్రతిసంఘసంస్కారాన్నీ వాళ్ళు ఎదిరిస్తూవచ్చారు. "కాంగ్రెసు, సర్వజనుల సంస్థయై, దేశంలోని అన్నివర్గాల స్త్రీ పురుషులందరినీ భాగస్వాములుగా చేర్చుకోవాలి. లేకపోతే, ఇప్పటికే చాలా తగ్గిన తన ప్రభావాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ కూడదీసుకోలేదు." అంటూ గాంధీజీ హరిజన్ సంపాదకీయంలో ఉద్బోధిస్తున్న సమయంలోనే, పటేలు ఈ ప్రయత్నంచెయ్యటం విపరీతంగానే కనబడుతుంది.

ఈ సంస్థల సంపూర్ణాశయా లేవిటో పటేలుకు ఏమాత్రం తెలియకుండా ఉండి ఉంటాయనటం నిశ్చయం. కాని, కేంద్రప్రభుత్వ, ఉద్యోగకార్యాలయాల్లో రాష్ట్రీయసేవకసభ్యుల సంఖ్య అధికంగా ఉండటం, వాళ్ళ కక్కడున్న ప్రభావం, అవన్నీ పత్రికావిలేఖరుల కందరికీ తెలిసినంతటి ప్రత్యక్షవిషయా లయ్యాక కూడా ఆయన ఈ సంఘప్రభావాన్ని గుర్తించి ఉండకపోవటం ఆశ్చర్యజనకంగానే ఉంటుంది. ప్రత్యక్షంగా "జాతీయజండా"ని అవమానపరుస్తూ, నియంతృత్వ పద్ధతులలో తయారౌతున్న ఈ రెండు అతివాదవర్గాలపట్లా పటేలు సహనం చూపటం "టెక్నికల్" గా చూస్తే తప్పుగానే గోచరించవచ్చును. కాని ఒక్క సోషలిస్టులూ, కమ్యూనిస్టులూమాత్రమే గాంధీజీహత్యకు, నైతికంగా బాధ్యత పటేలుదే ననీ, అతను రాజీనామా ఇయ్యాలనీ, దూషింపసాగారు. కాని జవహార్లాలు అద్భుతంగా, ఈ "ఉక్కుమనిషి"కి ఊతగా నిలిచి, అతని నిర్దోషిత్వాన్ని నిరూపించి, అట్లాంటి అవకతవక ఆరోపణలు పటేలుపై చేయటం చాలా నీచమైన పని అని చెప్పి అతన్ని కాపాడాడు.

మరుక్షణమే రా. స్వ. సే. సంఘంపై ఆంక్ష విధించారు. దేశమంతటా ఆ సంఘనాయకులను బందీచేశారు. గాంధీజీని చంపిన ఐదోనాటికి, కాంగ్రెసు కార్యవర్గం రహస్య సమావేశంలో, పటేలుపై తమ విశ్వాసాన్ని ఏకగ్రీవంగా వెలువర్చారు. విదేశీయులకు విచిత్రంగా కనబడ్డదేమంటే, ఆ అంతఃపత్రంలోకూడా, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ పూర్వకృషిని ప్రశంసిస్తూ ప్రస్తుతం తప్పుదోవల్లో పడి తన పద్ధతి మార్చుకొందని పటేలు విచారం వెలిబుచ్చటం.

ఈ క్షణాన్న భారత దేశ ప్రజాహృదయంలో, నెహ్రూస్వరూపము, గాంధీ తత్వవసనాచ్ఛాదితమయ్యే వెలుగుతూంది. అతని ప్రతిష్ఠ చాలా ఉత్తానస్థితిలోనే ఉంది. కులతత్వ ద్వేషులంతా ఆయన పక్షాన్నే ఉన్నారు. కాని ఆ శక్తులను సరిగా సంయోగపరుస్తున్న విధానం లేదు. ఈ ప్రభావాన్ని, రాజకీయాభ్యుదయానికెంతవరకూ అతను వినియోగిస్తాడో, అసలు వినియోగించక విరమిస్తాడో -అన్నవాటిపై, భవిష్యత్తు చాలామటుకు ఆధారపడి ఉంటుంది.

పాశ్చాత్యులోకదృష్ట్యా చూస్తే, నెహ్రూ నైతికంగా, అత్యుత్తమ పురుషుడుగానే గోచరిస్తాడు. కాని నిరీశ్వరవాది. మత్స్య మాంస నిషేధాలు లేవు. ధూమపాయి. అహింసాప్రవక్త కాడు. పటేలులాగా స్వపక్షయంత్రాన్ని కుశలంగా నడిపించుకు రాగల దిట్ట గాడు. గాంధీ మహాత్ముడు నిస్సంగ యోగిగా జీవితం గడపటం బాహ్యాడంబరంకోసం చేయలేదు. కాని ప్రజాహృదయాలకు, ఆ మాదిరి జీవిద్వారా తాము సాక్షాత్తు భగవత్సాన్నిధ్యంలో ఉన్నట్లు భావించ వీలుకలిగేది. నెహ్రూ ఆ స్థానంలోకి రావాలనుకోటం అత్యాశమాత్రమే అవుతుంది. గాంధీజీ సమన్వయం చేసుకోగలిగిన విపరీత విధానా లన్నిటినీ, ఆయన రాజకీయవారసుని కంటగట్టలేము.

ఈనాడు భారత భవితవ్యాన్ని, నిర్మించుకొంటూన్న భారతీయ స్త్రీ పురుషులంతా, తమలో తాము సమిష్టి శిక్షణాపద్ధతిపై నడుచుకోగలిగి, తద్వారా, గాంధీజీ మృతితో ఖాళీయేర్పడిన స్థానం పూరించేందుకు, ప్రజాప్రేమను ఆదరణనూ, చూరగొనగలిగినంతగా, అంతశ్శుద్ధియుతమైన విశిష్ట ప్రవర్తనకు కట్టుబడి ఉంటే, ఏ "సర్వప్రజాసమానత్వ" సూత్రానికై మహాత్ముడు తన అసువులవిడిచాడో, ఆ సూత్రయుతమైన సంఘపురోగతికి, అభ్యుదయానికీ, దోవ తీయగలుగుతారాఅనేది చూడవలసిఉన్నది.

ప్రపంచంలో మహాబలాధికమైన ప్రభుత్వాన్ని ఎదిర్చేందుకు గాంధీజీ పూనుకొన్ననాటి ప్రతిరోధకశక్తులకన్నా మహాబలీయమైన శక్తులు ఈనాడు వారి కార్యాచరణ కడ్డుగా నిలచి ఉన్నాయి. వారా శక్తులను అధిగమించి పురోగమించవలసి ఉంది.

ప్రపంచప్రజలదృష్టిలో నిలబడి, తను "సామ్యవాది" నని చెప్పుకొన్న, మహాయోగి, విడిచి వెళ్ళిన కార్యభారాన్నంతనూ వహించి, సమర్థనీయంగా నడపగలగటమనేది బహు భారావహమైన కార్యము—కాని జాతి పురోగమన బాధ్యత ఆయన తన దేశపుత్రులపై పెట్టివెళ్ళాడు. వాళ్ళు మళ్ళీ ఆయనలాగే, శాంతి, అహింసా విధానాలలో, మానవుని అవసరాలను అవగాహన చేసుకొని సమన్వయస్థితిలో నడిపించే కొత్తపుంతలు వెదుక్కోగలిగితే, గాంధీజీతో మనము పోగొట్టుకొన్న ఆ "స్వచ్ఛస్ఫటిక దర్పణాన్ని" మళ్ళా పొందగలుగుతాము— ఏ హింసాపిశాచి, ఆయన దేహాన్ని మాత్రం బలిగొనగలిగి, ఆ ఉన్నతాత్మనుమాత్రం ఏమీ అంటలేకపోయిందో, ఆ హింసలో సర్వప్రపంచమూ నాశనమయేలోగా, భారతీయులీ రీతిని సంచరించగలిగితే, "సత్య", "ధర్మా" లే లోకాన్ని పాలించి, లోకమంతా, వారికి ధన్యవాదము లర్పించ గలదు.

(సాటర్డే ఈవినింగ్ పోస్టునుండి.)

స్టర్లింగు నిలువల విడుదల ఒడంబడిక

అసంతృప్తికరమని మాటలతోగాక చేతలతో రుజువు చేయవలెను

భారత రిజర్వుబ్యాంకుపేర బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఖాతాలో పేరిగియున్న స్టర్లింగు నిలువల విడుదల విషయమై బ్రిటిష్-భారత ప్రభుత్వాలమధ్య ఒక సమాధానము కుదిరినది. ఎంత మార్చిచెప్పినా, ఈ సొమ్ము బ్రిటిష్ ప్రభుత్వము భారతదేశానికి యివ్వవలసిన సొమ్మే. అందువలననే భారతప్రభుత్వ అగ్రఉద్యోగులు దాదాపు 35 గురు రెండునెలలపాటు బ్రిటన్‌లో మకాం వేసివుండి, సంప్రదింపులు జరిపి, ఈ ఒడంబడిక కుదుర్చుకొనగలిగిరి. భారత ప్రభుత్వ ఖజానామంత్రి షణ్ముఖంచెట్టి, భారత రిజర్వు బ్యాంకు గవర్నర్ సర్ చింతామణ్ దేశముఖ్ గారలుకూడ ఈ సంప్రదింపులలో పాల్గొనిరి. బ్రిటిష్ ప్రభుత్వము తరఫున ఖజానామంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్ సంప్రదింపులు జరిపెను. పాకిస్థాన్ తరఫున ఖజానామంత్రి గులాం మహమ్మద్‌కూడ భారత ప్రతినిధులతోపాటు అవుసరమైనప్పుడు సంప్రదింపులలో పాల్గొనెను. చిట్టచివరకు ఇండియా, పాకిస్థాన్‌లు వేర్వేరుగా ఒడంబడికలు చేసుకున్నవి.

మన స్టర్లింగు నిలువల విషయమై ఇదివరకు రెండు తాత్కాలిక ఒడంబడికలు జరిగెను. వీనిలో మొదటి ఒడంబడిక 1947 వ సం. జులై నెల ప్రారంభమునుండి డిశెంబరు నెలాఖరు వరకున్నూ, రెండవది 1948 వ సం. జనవరి ప్రారంభమునుండి జూన్ నెలాఖరువరకున్నూ అమలులోనుండెను. ఇప్పుడు జరిగిన ఈ ఒడంబడిక 1948 వ సం. జులై 1 వ తేదీనుండి మూడు సంవత్సరములు, అనగా 1051 వ సం. జులై 1 వ తేదీవరకు అమలులో నుండును.

మనస్టర్లింగు నిలువలమొత్తం దాదాపు 1600 కోట్ల రూపాయి లుండును. వర్తకవ్యాపారములవలన మనము సంపాదించుచు, ఖర్చుపెట్టు స్టర్లింగు ఈ మొత్తముతో కలుపబడక వేరుగా లెక్కవేయబడును. 1947 వ సం. ఆగస్టునెలలో జరిగిన మొదటి తాత్కాలిక ఒడంబడిక ప్రకారం ఈ నిలువలలో 65 మిలియన్ పౌనులు (దాదాపు 85 కోట్ల రూపాయలు) మన వాడుకకు విడుదలచేసి, తక్కినమొత్తము ఒక శాశ్వత ఖాతాకు జమకట్టిరి. ఈ 85 కోట్ల రూ. లు 6 నెలలకాలములో వాడుకొనవచ్చును. కాని ఆ ఆరునెలలకాలములో ఈ విడుదలయిన మొత్తమునుండి చాల తక్కువ భాగము ఖర్చయినది. స్వాతంత్ర్యము లభించిన తరువాత ప్రారంభమైన కల్లోలములు, సందిగ్ధపరిస్థితులవలన వ్యాపారము ఆశించినంత ఎక్కువగా జరుగనేలేదు. రెండవ తాత్కాలిక ఒడంబడిక జరుగునప్పుడు, ఇదివరకు విడుదలైన మొత్తములో మిగిలియున్న భాగమునకు మరొక 18 మిలియన్ పౌనులు (దాదాపు 24 కోట్ల రూపాయలు) కలుపబడినది. కాబట్టి, రెండు తాత్కాలిక ఒడంబడికలలోను కలసి మొత్తం 88 మిలియన్ పౌనులు (దాదాపు 110 కోట్ల రూపాయలు) మన వాడకమునకు విడుదలచేయబడెను. కాని ఇందులో నాలుగు కోట్ల రూపాయలకన్న ఎక్కువ మన ముపయోగించలేదు. బ్రిటన్‌నుండి మనదేశమునకు ఎగుమతి - దిగుమతులు ఎప్పుడూ జరుగుచునే యుండును. బ్రిటన్‌కు ఎగుమతులకన్న దిగుమతులు ఎక్కువైనచో మనము బాకీ పడిపోయెదము. మనదేశము పారిశ్రామికముగా అభివృద్ధిచెందుటకు అవుసరమగు యంత్రసామగ్రి వగైరా బ్రిటన్‌లో ఎక్కువగా కొనవలెను కాబట్టి మొత్తంమీద మనము బ్రిటన్‌కు, వ్యాపారరీత్యా, అప్పు పడవచ్చును. అట్టి అప్పును తీర్చుటకు ఈ విడుదలైన మొత్తమును ఉపయోగించవలెను. గత సంవత్సరకాలములో ఈ విడుదల మొత్తమునుండి 4 కోట్లరూపాయలనే మనము వినియోగించుకొంటిమి; అనగా మనము బ్రిటన్‌నుండి ఆశించినంత ఎక్కువగా దిగుమతులు చేసుకొనలేదన్నమాట. ఇందుకు మన ప్రభుత్వము, పారిశ్రామికవేత్తల అలసత కారణము కావచ్చును; బ్రిటన్‌లో మనకు కావలసిన వస్తువులు, సకాలమునకు, సరియైనధరకు దొరకకపోవటము కావచ్చును. తప్పు పారిశ్రామికవేత్తలదే ననీ, యంత్రసామగ్రికి, ఏదేశమునుండి దిగుమతి చేసికొనటకైనాసరే, అనుమతి, విదేశమారకము ఎన్నడూ నిరాకరింపబడలేదనీ శ్రీ షణ్ముఖంచెట్టిగారు స్పష్టపరచిరి.

ఇప్పటి ఒడంబడిక సందర్భమున మూడు విషయములను గురించి ముఖ్యనిర్ణయములు జరిగినవి. యుద్ధకాలములో బ్రిటిష్ సేన లీ దేశములో నున్నప్పుడు వారు తెచ్చిన సామగ్రి ఇక్కడనే దిగవిడిచి వెళ్ళిరి. ఈ సామగ్రిలో కొన్ని ఫ్యాక్టరీలు, శకటములు, యుద్ధసామగ్రికూడ వుండెను. దీనినంతను అవిభక్త భారతదేశము వశపరచుకొనెను. అటుతర్వాత దేశము విభజింపబడినప్పుడు, ఇండియా, పాకిస్థాన్‌లు ఆ సామగ్రిని పంచుకొనెను. కాని ఆ సామగ్రి ఖరీదు ఇంతవరకు నిర్ణయింపబడి యుండలేదు. బ్రిటిష్ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ ఆస్తుల విలువలు దాదాపు 500 కోట్ల రూపాయలు వుండునట. ఈ ఆస్తినంతను 138 కోట్లరూపాయలకు ఇచ్చివేయుటకు బ్రిటిష్‌ప్రభుత్వము అంగీకరించినది. ఈ సామాను చాలకాలము వాడి, అరిగిపోయి వుండి, అటుతర్వాత వాడకము లేకుండా వుండటమువలన మొదట్లో 500 కోట్ల రూపాయలు ఖరీదుగలదైనా, ఇప్పుడు 138 కోట్ల రూపాయలు ఖరీదు చేస్తుందో లేదో చెప్పటం కష్టమే. ఈ సందర్భంలో భారతప్రతినిధివర్గం లాభసాటియైన షరతులను సంపాదించినట్లు పైకి కనిపించినా, జాగ్రత్తగా పరిశీలించినచో అంతలాభము కనబడకపోవచ్చును.


బ్రిటిష్ ఉద్యోగులు పింఛను పుచ్చుకుని బ్రిటన్ వెళ్ళిపోయెదరు. వారికి పింఛను ప్రతినెలా భారతప్రభుత్వమే, స్టర్లింగు రూపేణా చెల్లించవలెను. భారతదేశం స్వతంత్రమైనప్పుడు, చాలమంది బ్రిటిష్ ఉద్యోగులు ముందుగానే పింఛను పుచ్చుకుని స్వదేశమునకు వెళ్ళిపోయిరి. అట్టివారికి జీవితాంతమువరకు భారతప్రభుత్వము పింఛను చెల్లించవలసి యుండును. ఇప్పుడు మనకు వున్న స్టర్లింగు నిలువలో కొంతమొత్తమును బ్రిటిష్‌ప్రభుత్వమునకు దాఖలుపరచి, ప్రతిఏటా కొంతమొత్తము-మనము చెల్లించవలసిన పింఛనులకు, సరిపడు మొత్తము—60 ఏండ్లవరకు చెల్లించునట్లు, ఒప్పందము చేసికొనిరి. భారతప్రభుత్వము ప్రతిఏటా 8 కోట్ల రూపాయలు పింఛన్ చెల్లించవలసియుండునని అంచనా వేశారు. ఏండ్లుగడచి, పింఛనుదారులు మరణించినకొలదీ ఈమొత్తము తగ్గుచుండును. 197 కోట్లరూపాయల స్టర్లింగు బ్రిటిష్‌ప్రభుత్వమునకు ఇప్పుడు చెల్లించివేసి, 60 ఏండ్లవరకు, ప్రతిసంవత్సరము పింఛనులకు కావలసిన సొమ్ము ఇచ్చునట్లు ఏర్పాటుచేసిరి.

ఈ రెండుపద్దులు పోగా మిగిలిన మొత్తము స్టర్లింగును ఇండియా, పాకిస్థాన్‌లు పంచుకొనవలెను. పాకిస్థాన్‌లో చలామణిలోనున్న రిజర్వుబ్యాంకునోట్లన్నీ, చలామణిలోనుంచి ఉపసంహరించి, రిజర్వుబ్యాంకుకు వప్పజెప్పిననేగాని స్టర్లింగు నిలువలను ఇండియా, పాకిస్థాన్‌లు ఏ దామాషాలో పంచుకొనవలెనో తేలదు. ఒకటిరెండునెలలో ఈ పంపకము జరుగును. పాకిస్థాన్‌వంతుకు దాదాపు 200 మిలియన్ స్టర్లింగు (దాదాపు 27 కోట్ల రూపాయలు) పోవచ్చును. తక్కినది భారతప్రభుత్వమునకు మిగిలివుండును.

భారతకేంద్ర ప్రభుత్వ బ్రిటిష్ ఉద్యోగుల పింఛనువిషయమే పైన ప్రస్తావింపబడినది. భారతరాష్ట్ర ప్రభుత్వముల కొలువులో వుండి, పింఛను పుచ్చుకున్న బ్రిటిష్‌ఉద్యోగులకు యివ్వవలసిన పింఛన్ల మొత్తముకూడ పై ప్రకారమే లెక్కగట్టి, పింఛనులు ప్రతినెలా చెల్లించుటకు, సంవత్సరమున కొకమారు చొప్పున 60 సంవత్సరములు అవుసరమైన స్టర్లింగును ఇచ్చుటకుగాను, భారత యూనియన్ రాష్ట్రములన్నింటికిగాను, 27 కోట్ల రూపాయల స్టర్లింగు బ్రిటిష్ ప్రభుత్వమునకు దఖలుపరచబడెను.

ఇది పోగా తక్కిన మొత్తము బ్రిటన్ భారతదేశమునకు చెల్లించవలసిన నికరమొత్తము స్టర్లింగు. ఈ మొత్తమంతయు ఒక్కమారు విడుదలచేయుట బ్రిటన్‌కుగాని, మనకుగాని ప్రయోజనకరముకాదు. బ్రిటన్ శక్తికి తగినట్లు, మన అవుసరములకు సరిపోవునట్లు ప్రతి ఏటా కొంతమొత్తమును విడుదలచేయుచుండిన చాలును. ఈ విడుదల మొత్తము తక్కువై, అందువలన మన పారిశ్రామికాభివృద్ధి కుంటుపడకుండ చూడవలెను. గత రెండు పర్యాయములు తాత్కాలిక ఒడంబడికలలోను విడుదలచేసిన మొత్తము 110 కోట్ల రూపాయలలో మనము 4 కోట్ల రూపాయలు మాత్రమే వాడుకొనగల్గితిమి. కాబట్టి మనకు ఎక్కువ మొత్తము విడుదల అనవుసరమని తేలుచున్నది. ఇప్పటివరకు మన దేశములో పరిస్థితులు చక్కబడక పోవుటవలనను, భారత ప్రభుత్వ పారిశ్రామిక విధానమును గురించి పారిశ్రామికవేత్తలకు కొన్ని అనుమానము లుండుటవలనను, సకాలమునకు యంత్రసామగ్రి అందకపోవుటవలనను పారిశ్రామికాభివృద్ధి వెనుకబడి యున్నది. ఇప్పుడీ అడ్డంకులు తొలగిపోయినవి కాబట్టి స్టర్లింగు వాడకము—అంటే బ్రిటన్‌లోను, ఇతర స్టర్లింగు ప్రాంతములోను యంత్రసామగ్రి కొనుగోలు—హెచ్చు కాగలదు. ఇకముందు మన దేశపారిశ్రామికాభివృద్ధి యంత్రసామగ్రి సరఫరాపైననే ఆధారపడియుండును. మన స్టర్లింగు నిలువలనుండి విడుదలచేసెడి మొత్తమును ఈ దృక్పథముతోనే పరిశీలింపవలెను. రానున్న మూడేండ్లకు మొత్తం 160 మిలియన్ పౌనులు (218 కోట్ల రూపాయలు) విడుదలచేయుటకు ఉభయపక్షములు అంగీకరించినవి. ఈ మొత్తము చాల తక్కువగానే కనిపించుచున్నది. కాని గతసంవత్సరపు అనుభవమును పురస్కరించుకుని ఆలోచించిన, బహుశః సరిపోవచ్చుననిపించును. ఒకవేళ, ఈ మొత్తము చాలకపోయినచో, తిరిగి సంప్రదింపులు జరిపి, ఇంకెక్కువ మొత్తము సంపాదించుటకు కూడ అవకాశమున్నది. ఇప్పుడు విడుదలచేసిన మొత్తము తక్కువని అనవుసరాందోళన చేయుటకన్న, ఆ మొత్తమును వాడివే, చాలలేదని ఋజువు చేయుట మంచిది. మూడు సంవత్సరములకు విడుదల చేసిన 218 కోట్ల రూ.లలో దాదాపు 107 కోట్లు రూ.లు మొదటి సంవత్సరములోనే వాడివేయవచ్చును. గత సంవత్సరము నాలుగు కోట్ల రూ. లు వాడగల్గినవారు, ఈ సంవత్సరమెంత వాడెదరో చూడవలసియున్నది. ఈ 210 కోట్ల రూ.లతోను ఒక్క బ్రిటన్‌లోనే వస్తువులు కొనవలెనను నియమము లేదు. 'అరుదు నాణెముల' దేశములుగా ప్రకటింపబడిన వానిలో గాక ఇతరదేశము లన్నింటిలోను స్టర్లింగుతో వస్తువులు కొనవచ్చును. ఈస్టర్లింగుప్రాంతమునకు ఈమధ్యనే స్విట్జర్లాండు, స్వీడన్, జెకొస్లవేకియా, బ్రెజిల్, అర్జెంటినా మొదలగు దేశములుకూడ చేర్చబడినవి. ఇప్పుడు 'అరుదు నాణెము'లదేశములలో నున్నవి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, బెల్జియం, కొన్ని దక్షిణ అమెరికా దేశాలు, పోర్చుగల్, కొంతవరకు జపాన్‌మాత్రమే. ఈ దేశములతో వ్యాపారముచేసికొనుటకు, మన ఎగుమతుల ద్వారా మామూలుగా లభించు నాణెములుగాక ఈ సంవత్సరమునకే 15 మిలియన్ పౌనులు ప్రత్యేకింపబడినవి. మనము ఇదివరకు అమెరికానుండి దిగు

(20 వ పేజీ చూడుడు)



భారతదేశంలో క్రొత్తగా నియమింపబడిన అమెరికన్ రాయబారి లాయ్ హెండర్సన్ (కుడివైపున)—ఈ మధ్య అమెరికా వెళ్లిన నేపాలు సౌరాష్ట్ర సంఘ నాయకుడు షంషేర్ జంగ్ బహదూర్ రాణా.

భారతరాజకీయాలు :

తూర్పు పంజాబ్ సంస్థానకూటమి అవతరణ

భారతనౌకా, విమానదళములసత్వరాభివృద్ధికిఏర్పాట్లు

దేశకీలక స్థానము, విస్తీర్ణము, ప్రాముఖ్యత గమనించినచో భారతదేశ నౌకా, విమానదళములు అతిబలిష్ఠములుగా నుండి, ప్రాచ్యరాజ్యములలో శాంతి కాపాడుటకు, హిందూమహాసముద్రమును సురక్షితమొనర్చుటకు సమర్థమై యుండవలసిన ఆవశ్యకము బోధపడగలదు. ఇప్పటికి భారతదేశమున వున్న నౌకా, విమానదళములు అతిస్వల్పములు. దేశవిభజన సమయమున ఇండియాకు ఏడు యుద్ధవిమానదళములు, ఒక రవాణావిమానదళము, పాకిస్థాన్‌కు యుద్ధవిమానదళ మొకటి, రవాణావిమానదళ మొకటి పంచిపెట్టబడినవి. లాహోర్, పెషావరులలోనున్న విమానములను, బాగుచేసి, కొద్ది మార్పులు చేసి పాకిస్థాన్ మరొక యుద్ధవిమాన దళమును చేకూర్చుకొనగల్గునని కూడ అప్పుడు ఆశింపబడెను. నౌకాదళము పంపిణీలో ఇండియాకు 4 స్లూప్లు (చిన్న యుద్ధనౌకలు), 2 ఫ్రిగేట్లు (కొంచెము పెద్ద యుద్ధనౌకలు), 12 మైన్‌స్వీపర్లు, ఒక సర్వేనౌక, 8 ట్రాలర్లు, 4 హార్బర్ నౌకలు, పాకిస్థాన్‌కు 2 స్లూపులు, 2 ఫ్రిగేట్లు, 6 మైన్‌స్వీపర్లు, 2 ట్రాలర్లు, 4 హార్బర్ నౌకలు వచ్చినవి. భారతదేశానికి చాల పొడుగగు సముద్రతీరం వున్నది. కోస్తా ప్రదేశమును రక్షించుకొనుటకు ఇప్పుడున్న నౌకాదళము అసలు ఎందుకూ పనికి రానేరాదు.

నౌకా, విమానదళముల అభివృద్ధిపరచుట నౌకలను, విమానములను కొని పడవేయుటతో జరుగదు. వానిని నడుపుటకు సమర్థులగు నిపుణులను, నడిపించ సమర్థులకు ఉద్యోగులను సంపాదించవలెను. భారతనౌకా, విమానదళములలో ఇట్టి నిపుణుల, ఉద్యోగుల సంఖ్య చాల తక్కువ. అందువలన నౌకా, విమానదళములలో ఎక్కువమందిని చేర్చుకుని, విదేశములకు పంపి అన్ని రకముల నౌకలను, విమానములను ఉపయోగించు విధానములలో శిక్షణయిప్పించవలెను. దేశభక్తులకు యువకులు ముందుకు వచ్చి ఈ దళములలో చేరవలెను.

ఈవిషయమున భారతదేశముకన్న పాకిస్థాన్ ముందంజ వేసినదని చెప్పవలెను. పాకిస్థాన్‌కు సముద్రతీరము ఎంతో కాదు. అయినను అనేకులు నావికులను బ్రిటన్ పంపించి, అక్కడ శిక్షణ యిప్పిస్తున్నారు. భారత ప్రభుత్వము నౌకాదళము విషయమున ఇప్పుడే మేల్కాంచినది. సమర్థులగు నావికులను బ్రిటన్ పంపి, అదనపు తర్ఫీదు నిప్పించవలెనని ఇప్పుడాలోచనలో నున్నది. నౌకాదళమునుకూడ అభివృద్ధి చేయుటకు భారత ప్రభుత్వము ప్రయత్నించుచున్నది. ఒక క్రూయిజరు (పెద్ద యుద్ధనౌక) ఈమధ్యనే కొన్నారు. విమానవాహక నౌకలు రెండు, కొన్ని డిస్ట్రాయర్లు, క్రూయిజర్లు కొనవలెనని ఇప్పుడాలోచించుచున్నారు. వీనిని భారతదేశములోనే నిర్మించుటకు నౌకానిర్మాణశాలలను ఏర్పాటుచేయు విషయము ఇంకా ఆలోచనకుకూడ రాలేదు.

భారత విమానదళములో ఇప్పుడు 8 దళములే వున్నవి. కొన్ని జెట్ విమానముల, బాంబరు విమానముల దళములను కొని, ఐదేండ్లలోగా మొత్తం 15 దళము లేర్పాటుచేయవలెనని నిశ్చయించిరి. వైమానికులకు ఉన్నత శిక్షణనిచ్చుటకు మన దేశములోనే కొన్ని శిక్షణశాలలు ఏర్పాటుచేయుటకు, కొందరు వైమానికులను విదేశములకు పంపి శిక్షణ యిప్పించుటకు ఆలోచనలు జరుగుచున్నవి.


కేరళ కాంగ్రెస్ విభేదాలు

కేరళ కాంగ్రెస్‌లో కేలప్పన్ వర్గానికీ, గోవిందన్ నాయర్ వర్గానికీ ఏర్పడ్డ వివాదాలు ఆనాటి కానాడు పెరిగిపోయినవి. వీటి పరిష్కారంకోసం కాంగ్రెస్ అధిష్ఠానవర్గం దగ్గరకు త్వరలోనే కేలప్పన్ వెళ్ళనున్నాడని కూడా తెలుస్తున్నది. కేరళ కాంగ్రెస్‌లో, ఇతర రాష్ట్రకాంగ్రెస్ సంఘాలలోవలెనే, ఎన్నికలలో కాంగ్రెస్ సభ్యత్వము సంపాదించే సమస్యపైననే విభేదాలు ప్రారంభమైనవి. రాజ్యాంగపరిషత్తుకు కేరళ కాంగ్రెస్ తరపున ఎన్నుకొనవలసిన వారి పేర్లను నిర్ణయించునప్పుడు, కేరళ కాంగ్రెస్ కార్యవర్గం గోవిందన్ నాయర్ పేరునుకూడా చేర్పిందట. కాని రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు కేలప్పన్ ఈ పేరును తొలగించి, గోపాలమీనన్ పేరు చేర్చాడట. తానిట్టి పని చేయలేదనీ, ప్రస్తుత మంత్రి మాధవమీనన్ గారే కామరాజనాడార్ ద్వారా తన పేరు చేర్పించుకోవటానికి ప్రయత్నించాడనీ కేలప్పన్ అంటాడు. మొత్తంమీద విభేదాలు ఇంతటితో ప్రారంభమైనవి. మద్రాసులో ప్రకాశం మంత్రివర్గం పడిపోవటం, కేలప్పన్ ప్రకాశంగారిని బలపరచటం జరిగినప్పటినుండి పైచర్యకు కేలప్పన్ పట్ల అసంతృప్తులై వున్నవారందరు ఒక గ్రూపుగా ఏర్పడి మాధవ మీనన్ నాయకత్వమున వ్యవహరిస్తూ వచ్చారు. ఈమధ్య జరిగిన మ్యునిసిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఎన్నుకొనటలో ఈ విభేదాలు మరింత తీవ్రమై, కేరళ కాంగ్రెస్ కార్యదర్శి గోవిందన్ నాయర్ రాజీనామా నిచ్చెను. కేలప్పన్ తన వర్గమువాని నొకనిని కార్యదర్శిగా నియమించుకొనెను. గత ఫిబ్రవరిలో రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులు 24 గురు, కేలప్పన్ పై దాదాపు విశ్వాసరాహిత్య తీర్మానమువంటి తీర్మానము నొకదానిని ప్రవేశపెట్టదలచి, సభ జరుపవలసినదని కోరిరి. కొచ్చిన్ ప్రజామండలి నాయకుడగు ఇక్కండవరియార్ మధ్యవర్తిత్వము వహించి తగాదాను కొంతవరకు సర్దెను. అప్పుడు ఏర్పాటుచేసుకున్న రాజీప్రకారము, కార్యవర్గములో గోవిందన్ నాయర్ వర్గమువారికి కేలప్పన్ కొన్ని స్థానము లివ్వవలసియుండెను. ఈ రాజీ ఫిబ్రవరి నెలలో జరిగినా, మే నెలవరకు వారికి స్థానము లివ్వబడలేదు. వారికి స్థానము లిచ్చినతర్వాత ఇనతవరకు కార్యవర్గసభ జరుపనేలేదు. ఇది ఇట్లుండగా, జూన్ 13 వ తేదీన రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గమును తిరిగి ఎన్నుకొనుటకు రాష్ట్రకాంగ్రెస్ సంఘము సమావేశమయ్యెను. ఈ సమావేశములో కేలప్పన్ ఎదుటివర్గమును నిశితముగా విమర్శించుచు, రాష్ట్ర కాంగ్రెస్ విభేదములకు మంత్రి మాధవమీనన్ దోహదము చేస్తున్నాడనీ, తిరువాన్కూర్ సభ్యులు రాష్ట్రకాంగ్రెస్‌కమిటీ సభకు హాజరుకాకుండ చేయమని తిరువాన్కూర్ ప్రధాని పట్టం తానుపిళ్లెను మాధవమీనన్ కోరినాడనీ ఆరోపించెను. కేలప్పన్ ఉపన్యాసమును ఖండించుచు, మంత్రి మాధవమీనన్ ఒక ప్రకటనా, గోవిందన్ నాయర్, అతని సహచరులు ముగ్గురూ కలసి సంయుక్తముగా ఒక ప్రకటనా చేసిరి. కేలప్పనే రాష్ట్రకాంగ్రెస్ విభేదాలకు కారకుడని ఆరోపించుచు, అతనిపై కొన్ని స్పష్టమగు ఆరోపణలు కూడ వారు చేసిరి. ఆ ఆరోపణలలో, పైజెప్పిన, రాజ్యాంగ పరిషత్తు ఎన్నికలలో జోక్యము ఒకటి. మలబార్ స్పెషల్ పోలీసుల అత్యాచారములను విచారించుటకు గత సంవత్సరము కేరళ కాంగ్రెస్ ఒక సంఘమును నియమించెను. ఆ సంఘము పని ప్రారంభించనుండగా కేలప్పన్ ఒక పెద్ద ప్రకటనచేసి, వారి పని కంతరాయము కలిగించెనని, అందువలన వారు ఆ పని చేయలేకపోయిరనీ మరొక ఆరోపణ. ఇందుకు సమాధానముగా, తాను ప్రకటన చేసిన మాట వాస్తవమైనా, ఆతర్వాత కూడా ఆ సంఘము కొంతకాలము పనిచేసి, తరువాత ఎందువలననో మానివేసెననీ కేలప్పన్ చెప్పుచున్నాడు. లేబర్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్‌లకు వ్యతిరిక్తముగా, కార్యవర్గము వలదన్నా వినకుండా, కేలప్పన్ ప్రకటనలు చేసెననీ, గోవిందన్ నాయర్ కార్యదర్శిత్వమునుండి విరమించినతర్వాత ఇదివరకటినుండి అతనికిస్తున్న ధనసహాయము ఆపివేసెనని మరొక ఆరోపణ. కాంగ్రెస్‌ను విచ్ఛిన్నపరచరాదనీ, కాంగ్రెస్ ఐక్యతను కాపాడవలెననీ తాను చెప్పుచుంటిననీ, దానికివ్వబడుచున్న ధనసహాయము, అవి పనిచేయక పోవుచుండుటవల్లనే ఆపివేయబడెననీ కేలప్పన్ సమర్థించుకొనుచున్నాడు. గత ఆగస్టునెలలో రివిన్యూమంత్రి కాలికట్ వెళ్లినప్పుడు మలబార్ రైత్వారీ నివేదికనుగురించి ఆయనతో మాట్లాడుటకు వెళ్ళిన ప్రతినిధివర్గమును, మాట్లాడనివ్వకుండా కేలప్పన్ ఆపివేసెనని మరొక ఆరోపణ. తాను సభకు ఆలస్యముగా వెళ్ళితిననీ, అప్పటికే ఈ విషయము మాట్లాడుట అయిపోయినదనీ కేలప్పన్ ఇందుకు సమాధాన మిచ్చుచున్నాడు. ఈ వాదప్రతివాదములు, ఆరోపణలు, జవాబులు పత్రికాముఖమున జరుగుచుండుటవలన, కేరళరాష్ట్రములోని కాంగ్రెస్‌వాదులందరు రెండు కూటములుగా విడిపోయి, కాంగ్రెస్ ప్రతిష్ఠకే ప్రమాదము ఏర్పడుచున్నది. ఈ వివాదముల పరిష్కారమును కాంగ్రెస్ హైకమాండుకు వదలివేయుటకు కేలప్పన్ నిశ్చయించి, అధిష్ఠానవర్గమును దర్శించుటకు ఢిల్లీ వెళ్ళినాడు. ఈ వివాదము లెట్లు పరిష్కారమగునో చూడవలసియున్నది.

సరిహద్దుజాతులతో పాకిస్థాన్ వైరం

పాకిస్థాన్ ప్రత్యేకరాజ్యముగా ఏర్పడినప్పటినుండి ముస్లింలీగ్ నాయకులు సరిహద్దు కొండజాతులను మంచి చేసి కొనవలెననియే ప్రయత్నించుచుండిరి. కొండజాతులను అదుపులో పెట్టుటకు బ్రిటిష్‌వారు కొంతసేనను పర్వతదుర్గములలో కాపుంచెడివారు. పాకిస్థాన్ ఏర్పడగానే ఆ సేనను ఉపసంహరించిరి. దీనితో కొండజాతులలో పాకిస్థాన్‌పట్ల సృహద్భావ మేర్పడునని వారు ఆశించిరి. అటుతర్వాత కొండజాతులను కాశ్మీర్‌పైకి పంపి దోపిడీ సాగించుకొననిచ్చినారు. ఆటంకము లేకుండా దోపిడీ లభించినన్నాళ్ళు కొండజాతులు పాకిస్థాన్‌కు అనుకూలముగానే వున్నారు. కాశ్మీర్‌లో తిరోగమనము ప్రారంభమై, దుండగులు ఎక్కువ నష్టపడుట ప్రారంభము కాగానే కొండజాతివారందరు తప్పుకొని, ఇండ్లకు చేరిరి. ఇన్నాళ్ళనుండి బ్రిటిష్‌వారు కొండజాతులకు డబ్బు పంచిపెడుతూ మంచి చేసుకుంటుండేవారు. ఆ ధనసహాయాన్ని పాకిస్థాన్ నిలిపివేసి, దోపిడీకి కాశ్మీర్‌ను చూపించి, తుపాకు లిచ్చిపంపింది. ఇప్పుడు కొండజాతులకు దోపిడీ దొరకటంలేదు. డబ్బు లేదు. తిండి లేదు. చేతులో తుపాకులు మాత్రం వున్నవి. వీటిని పుచ్చుకు పాకిస్థాన్ పైననే వారు తిరుగబడుతున్నారు. కొండజాతులకు కాశ్మీర్‌లో దోపిడీ దొరకినన్నాళ్ళు ఇపీఫకీర్‌ను వారు ఖాతరుచెయ్యలేదు. ఇప్పుడు మళ్ళీ ఆయనచుట్టూనే జేరుతున్నారు. ఇపీఫకీర్ పలుకుబడి నాశనం చేయాలని పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలు వృథా అయిపోవటమేగాక, ఆయన బలవంతుడై వజీర్‌స్థాన్ స్వతంత్ర రాజ్యంగా కూడా ప్రకటించాడట! కొండజాతుల నాయకుల 'జిర్గా' ఈ మధ్య ఇపీఫకీర్ ఇంట్లో సమావేశమై వజీర్‌స్థాన్ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి శత్రువులతో పోరాడటానికీ, వజీర్‌స్థాన్‌లో ముస్లింలీగ్ ప్రచారకుడు హబీబుల్లాఖాన్‌ను పట్టుకున్నవారికి 4 వేల రూపాయలు బహుమతి యివ్వటానికీ నిశ్చయించారట. కొండజాతులను అదుపులో పెట్టటానికి పాకిస్థాన్ సేనలు, విమానాలు పూనుకున్నవి. వజీర్‌స్థాన్‌పై పాకిస్థాన్ విమానాలు దాడులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇపీఫకీర్ ఇల్లు పాకిస్థాన్ సేనలు చుట్టుముట్టాయనీ, ఒక వజీర్‌స్థాన్ నాయకుడు పాకిస్థాన్ సేనలచే చంపివేయబడెననీ తెలుస్తున్నది. స్వతంత్రపఠాన్

(20 వ పేజీ చూడుడు)



కామరాజనాడారు, గాంధి స్మారకనిధి కార్యదర్శి కృపలానీ, ప్రధాని రామస్వామిరెడ్డిగారు.

వివాహము - ఏకపత్నీత్వము

శ్రీ వావిలాల సోమయాజులు

అనాది కాలంనుంచీ సంఘానికి మూలాధారాలైన స్త్రీపురుషుల పరస్పర శారీరక సంబంధం అనేక కారణాల మూలంగా మార్పులు పొందుతూ నేటి వివాహ సంస్థగా పరిణమించింది. స్త్రీ పురుషుల శారీరక సంబంధం వల్ల సంతానము కలగటమూ, తన్మూలంగా కుటుంబాలు ఏర్పడటమూ జరిగి ఉంటుంది. అదే క్రమక్రమంగా మానవ జాతుల్లో ఆచారంగా పరిణమించి ఆ యా కాలాలల్లో చట్టసమ్మతమైన వివాహంగా అంగీకృత మౌతూ వచ్చింది.

వివాహ సంస్థకు ఆదిమ రూపం స్త్రీ పురుషుల శారీరక సంబంధం. దాని స్వరూప స్వభావాదులను గురించి శాస్త్రజ్ఞులు భిన్నాభిప్రాయాలను వెల్లడించారు. కొందరు ఒక జాతిలోని స్త్రీ పురుషులు యావన్మందీ తల్లి, చెల్లెలు, అన్న, తమ్ముడు అనే వివక్షత లేకుండా కామోపభోగం నెరపుకున్నారని అభిప్రాయపడినారు. కొందరు అటువంటి వివక్షారహిత కామోపభోగం (Sexual Promiscuity) ఉన్నదని నిరూపించటానికి తగిన ఆధారాలు లేవనీ, అటువంటి స్థితి మానవునికి పూర్వరూపమైన వానర జాతిలోనే కనిపించదనీ పలుకుతున్నారు.

ఒక మాట మటుకు సత్యము. ఆదిమ మానవ జాతుల్లో నేటి సంఘంలో కనిపిస్తూ ఉన్న నీతి నియమాలూ, విధినిషేధాలూ లేవు. ఒకానొక స్థితిలో మానవ జాతిలో స్వీయ బంధు ప్రణయము (INCEST) ఉన్నదని అంగీకరించటానికి తగిన ఆధారాలు కనిపిస్తున్నవి. ఈ పద్ధతి ననుసరించి అన్నా చెల్లెళ్లూ; అక్కా తమ్ముళ్లూ, తల్లీ కుమాళ్లూ భార్యాభర్తలు కావచ్చును.

అనాది మానవ కుటుంబాలు (Famieies) ఇటువంటి వివక్షారహితమైన కామోపభోగస్థితి నుంచే ఉద్భవించినవని మోర్గన్ పండితుని అభిప్రాయము. నేడు ఇటువంటి శారీరక సంబంధాన్ని గానీ, వైవాహిక ధర్మాన్ని గానీ నిరూపించే జాతి ప్రపంచంలో ఎక్కడా కనిపించటం లేదు.

తరువాతి కాలంలో వివాహ సంస్థలో ఒక మార్పు వచ్చింది. ఏకగర్భజనితులైన సంతానం వివాహ మాడరా దనే నియమం ఏర్పడ్డది. తల్లి బిడ్డల మధ్య కామభోగం నిషిద్ధమైనది. ఇది వైవాహిక విధానంలో రెండో మెట్టు. అందు మూలంగా మానవ జాతులు వెనుక గుంపులుగా జీవిస్తూ గుంపు పెళ్లిళ్లు (Group-Marriages) చేసుకుంటూ ఉండేవారు. సహచరీ వివాహానికి (Punatiar Marriages) అలవాటుపడి, ప్రత్యేక కుటుంబాలుగా ఏర్పడవలసివచ్చింది. ఈ వివాహ విధానంలో అనేక రకాలైన మార్పులతో వివాహం జరగటానికి అవకాశం ఉన్నది. అయితే—ప్రధానాంశం ఒకటే. ఒక కుటుంబంలోని పురుషులందరికీ సమిష్టిగా ఆ కుటుంబంలోని స్త్రీలందరూ భార్యలై ఉంటారు—పుట్టుకతోనే. వారు మాత్రము తల్లి కుమాళ్లూ, అన్నా చెల్లెలూ, అక్కా తమ్ముడూ కాకూడదు.

ఈ వివాహ విధాన పరిణామ రూపంగా దంపతీ వివాహము (Pairing Marriage) ఏర్పడ్డది. ఒక పురుషుడు ఒక స్త్రీతో తాత్కాలికముగానో, లేక కొంతకాలమో వైవాహిక ధర్మాన్ని కలిగి ఉంటాడు. గుంపు పెళ్లిలో వివాహము వ్యక్తిపరము కాదు. ఈ రెండు విధానాలలోనూ అది వ్యక్తిగతము.

గుంపు పెళ్లిళ్లు క్రమంగా ప్రపంచంలో అంతరించి పోయినవి. దాంపత్య వివాహాలు (Pairing Marriages) ఆచారాలైనవి. ఈ విధానంలో బహు పత్నీత్వము ఉండకపోదు. ప్రతి మొగవాడికీ అనేకమంది భార్య లున్నా వారిలో ఒకతె మాత్రమే ప్రధాన భార్య అయి ఉంటుంది. బహుభర్తృత్వము ఉన్న జాతుల్లో అనేకమంది భర్త లున్నా ఆ స్త్రీకి ఒకడే ప్రధాన భర్తగా వ్యవహరిస్తాడు. ఇంతే కాదు--జాతుల్లోని స్త్రీ పురుషులు ఇద్దరూ అప్పుడప్పుడూ కామతృష్ణను తీర్చుకోటానికి ఈ దాంపత్య వివాహ బంధాన్ని అతిక్రమించి అన్యస్త్రీగమనమూ, స్త్రీ పరపురుషగమనమూ చేయటానికి అవకాశముండేది. కాని, స్త్రీ విషయంలో ఈ హక్కు ఎంతో కాలం నిలువలేదు. స్త్రీ ఒక పురుషునితో సహచరించటం ప్రారంభించింది మొదలు ఏజాతీ ఆమె పట్ల పరపురుషగమనాన్ని అంగీకరించలేదు. దానికి వ్యతిక్రమం జరిగితే కఠిన శిక్షకు పూనుకున్నవి కూడాను.

మాతృస్వామికాలైన కుటుంబాలలో (Matriarchical Families) బహు భర్తృత్వమూ (Polyandry), పితృస్వామికాలైన కుటుంబాలలో (Patriarchical Families) బహు భార్యాత్వమూ అన్ని కాలాలలోనూ కనిపించినా ఈ ద్వివిధ వివాహాలూ ఆర్థికంగా అనేకమైన అవస్థలను తెచ్చిపెట్టటంచేత ఏ నాడూ ఇవి ప్రబలంగా జాతి కంతటికీ వైవాహిక విధానాలుగా ఉన్నవని చెప్పటానికి అవకాశం లేదు.

దాంపత్య వివాహ విధానంలో వివాహ విచ్ఛేదానికి ఏ నిమిషాన పట్టినా అవకాశం ఉన్నది. అందులో కష్టమేమీ లేదు. నిబంధనలు లేవు. పూర్వంనుంచివలెనే పిల్లలు తల్లికి చెందుతారు.

రక్త సంబంధం ఉన్న బంధువులతో వివాహ బంధాలు దూరమవటం దాంపత్య వివాహంతో ప్రారంభం. అందుమూలంగా కన్యకకు సవ్యమైన వరుణ్ణీ, వరుడికి సవ్యమైన కన్యకనూ వెతకటం ఆచారమైంది. ఒక ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు "దాంపత్య వివాహం మూలంగా రక్త బంధువర్గంతో వివాహం జరగటానికి వీలు లేకపోయింది. ఇతఃపూర్వం బంధుత్వం లేనివారితో వైవాహిక సంబంధాలు నెరపవలసిన అగత్యం కలగటంచేత జాతుల్లోని వ్యక్తులు, మానసికంగానూ, శారీరికంగానూ బలవంతులు కావటం ప్రారంభించారు. శారీరకంగానూ, మానసికంగానూ బలం గల రెండు జాతులుగానీ, రెండు కుటుంబాలుగానీ వైవాహికబంధంతో ఏకమై ఒక జాతిగా గాని, ఒక కుటుంబంగా గానీ పరిణామాన్ని పొందేటప్పుడు వారికి కలిగే సంతానంలో మేధస్సు విస్తారమై, ఉంటుంది. రెండు జాతుల శక్తులూ, రెండు కుటుంబాల శక్తులూ ప్రత్యేకతలూ వారిలో ప్రతిఫలిస్తవి" అని అభిప్రాయ మిచ్చినాడు.

అంటే—క్రమక్రమంగా రక్త సంబంధం కలవారిని అధికం చేసుకుంటూ, వారితో వైవాహిక బంధాలను నిషేధిస్తూ ఉండటంవల్ల దాంపత్య వైవాహిక విధానం అమలులోకి వచ్చింది. మొదట జాతిని స్త్రీ పురుషులనే రెండు జాతులుగా విభజించటమూ, తరువాత ఆత్మబంధు ప్రణయాన్ని అరికట్టటమూ జరిగింది. దాంపత్య వివాహధర్మానికి పరిణామ రూపంగా ఏకపత్నీ వివాహము (Monogamy) వైవాహిక విధానంగా అవతరించింది.

దాంపత్య వివాహం అమలులో లేని కాలంలో పురుషులకు స్త్రీలు కోరుకున్నంత మంది దొరికేవారు. ఈ వివాహం వల్ల స్త్రీలు కొందరికి మాత్రమే భార్యలైనారు. పుట్టుకతోటే భార్య అనిపించుకునే స్త్రీ పురుషుడికి గుంపు పెళ్లి విధానంలో ఉన్న రీతిగా ఉండే అవకాశం పోయింది. అందుమూలంగా దాంపత్య వివాహంతోపాటు రాక్షసవివాహమూ (Marriage-by Capture) క్రయ వివాహమూ (Marri-ageby Purchase) వైవాహిక ధర్మాలుగా తోడతోడుగా ఉంటూ ఉండేవి. అయితే ఇవి భార్యలను పొందే మార్గాలలో భేదాలే గాని ప్రత్యేక వివాహ సంస్థలుగా పరిగణింపదగ్గవి కావు.

ఏక పత్నీత్వము (Monagamy) మిథున వివాహానికి (దాంపత్య వివాహానికి) పరిణామ రూపము. ఇది అనాగరక జాతి ప్రాథమిక ద్వితీయావస్థలలో అవతరించింది. ఈ విధానం ప్రపంచంలో అమలులోకి రావటం మూలాన క్రమ క్రమంగా నాగరికత అభివృద్ధి కావటం ప్రారంభించిన దన్న మాట.

ఈ వివాహ విధానాన్ని గురించి ప్రాన్సు శాస్త్రజ్ఞురాలు ఎలెన్‌కీ మహాశయురాలు ఇలా అన్నది:

"ఏక పత్నీ విధానము అనేక కారణాల వల్ల విజయవంతమైనది. ఇందు మూలంగా ఇతఃపూర్వము స్త్రీలకోసం పురుషులలో జరిగే అంతఃకలహాలు నశించినవి. పురుషులు వారి శక్తిని వైజ్ఞానిక ప్రపంచ పర్యవేక్షణవైపుకు త్రిప్పటానికి అవకాశం లభించింది. స్త్రీ పురుషుల దృష్టి సంతాన ప్రాప్తి వైపుకు మొగ్గింది. స్త్రీ పురుషుల కార్యక్రమ విభాగము (Division of work) ఏర్పడ్డది. నిలకడైన జీవితం ఏర్పడ్డది. సంతానం కారణంగా స్త్రీ వెనుకటివలె పురుషుని ఇష్టానిష్టాలకు లొంగిపోవలసిన అగత్యం తప్పిపోయింది. స్త్రీ పురుషుల సాంసారిక జీవనానికి ఒక ఉదాత్తత లభించింది. ఈ వివాహ విధానం మూలంగా స్త్రీ పురుషులలో సహకార భావం వృద్ధి పొందింది. ఆత్మ శిక్షణకు పదవకాశం లభించింది. వారి ఇరువురి మధ్యా అన్యోన్యానురాగాన్నీ, దయా దాక్షిణ్యాలనూ ఏర్పరిచింది. భర్తకు స్వామిత్వం లభించింది దానితో బాటు పోషణ భారం పైన బడ్డది. స్త్రీ పురుషునిమీద జీవనభృతికి ఆధారపడవలసివచ్చింది. నిజమే కాని "సత్సంతానవతి" నన్న ఆనందాన్ని పొందే సదవకాశం లభించింది."

మొట్టమొదట చరిత్రలో 'ఏక పత్నీత్వ విధానము' స్త్రీ పురుషుల సమానత్వం కోసం ఉద్భవించలేదు. ఎన్ని మాటలు చెప్పినా అనాది సంఘంలో స్త్రీ కున్న గౌరవం ఏకపత్నీ వైవాహిక ధర్మమైన సంఘంలో ఆమెకు లేదు. ఆమె ఒక విధంగా పురుషునికి బానిస ఐపోయినది అని చెప్పవచ్చును. ఏక పత్నీ వివాహ కాలానికి పూర్వము స్త్రీ పురుష జాతులు రెంటికీ పరస్పరాధిక్యతలకోసం అంతర్యుద్ధాలు జరుగుతూ వచ్చినవి. వాటి ఫలితంగా స్త్రీ జాతి ఓడిపోయింది. పురుషజాతి జయించింది.

అయితే—ఈ వివాహవిధానాన్ని కావాలెనని కోరుకున్నవారు స్త్రీలేనని జేచెఫెన్ వంటి శాస్త్రజ్ఞుల అభిప్రాయము. అనాది మానవజాతి ఆరణ్యక జీవనం నశించటం ప్రారంభించింది. వైవాహిక విధానాలు క్రమ క్రమంగా మార్పు పొందినవి. ప్రాచీన కాలంలో ఉన్న సామ్యగృహ జీవన విధానం నిలవటానికి తగిన అవకాశాలు తక్కువైపోవటం ప్రారంభించినవి. వారికి ఒక నూతనమైన ఆర్థిక విధానం, జీవిత లక్షణ లక్ష్యాలూ ఏర్పడుతూ వచ్చినవి. ఈ నూతన విధానంలో స్త్రీలకు బాధ కలగటం ప్రారంభించింది. అది కారణంగా వారు తాత్కాలికంగా గానీ, మరికొంత కాలం పాటు గాని ఒక పురుషునితోటే వైవాహిక జీవితం గడప నిశ్చయించుకున్నారు. అందుకు స్త్రీ పావిత్ర్యాన్నీ పాతివ్రత్యాన్నీ అభిలషింప ప్రారంభించింది. పురుషునికి తనను పోలింపను పట్టాభిషేకం కట్టించి.

వైవాహిక విధానంలో ఏకపత్నీత్వ మనే మార్పు పురుషజాతివల్ల కలగలేదని చెప్పటానికి శాస్త్రజ్ఞులు ఒక కారణం చూపిస్తున్నారు. అది స్వేచ్ఛా ప్రణయము. ఈ ప్రణయము అనాది కాలంలో స్త్రీ పురుషులకు సరిసమానంగా ఉంటూవచ్చింది. ఈ నాడు స్త్రీలకు లేదు. దీనిని పురుషులు అనుభవిస్తున్నారు. అటువంటి పురుషుల స్వేచ్ఛా ప్రణయాన్ని ఏ దేశమూ ఏజాతీ బహిష్కరించలేదు. చివరకు ఎక్కెట్టుగానైనా చూడటం మానివేసింది. స్త్రీలు అనుభవించటానికి ప్రయత్నిస్తే సంఘం వారిని బహిష్కరిస్తున్నది.

కామం మాట అటుంచినా, ఏకపత్నీత్వ విధానం మూలంగా దాంపత్య వివాహ కాలంలో ఉన్న స్త్రీజాతి సాంఘిక ప్రతిపత్తి (socia status) కూడా నశించింది. దాంపత్య వివాహ కాలంలో స్త్రీల ఆధిక్యాన్నీ, ప్రభుతనూ గురించిఒక యాత్రికుడు ఇరాక్వాజాతి సెనికాలలో తిరిగి పొందిన అనుభవంమూలంగా ఇలా వ్రాస్తున్నాడు:

"స్త్రీలు ఇతర కులాలల్లోని భర్తలను స్వీకరించి సామ్య జీవన విధాన మున్న గృహాలల్లో నివసిస్తారు. అందువల్ల ఆ ఇళ్లకు వచ్చే భర్తలకు యద్విధమైన ప్రాధాన్యతా లేదు. వారికి సంబంధించినధాన్యరాసులు అన్నీ ఒకచోటే ఉంటవి. వాటిలో నుంచే అందరూ సమిష్టిగా వాడుకుంటుంటారు. అదృష్టం లేని భర్త ఆ ఇంట్లో ఎవరైనా కాపురం చేస్తుంటే అతడు కావలసినది సంపాదించ లేక పోతే అతణ్ని గొంగళీ చుట్టుకొని ఏనాడు బయిటికి పొమ్మంటే ఆనాడు బయటికి నడవ వలసిందే. అటువంటి సందర్భాలల్లో పిల్లలుగానీ, ఇంట్లో ఆస్తి పాస్తులుగానీ అడ్డురావు. అతడు కట్టి చేతులలో తిరిగి తన కులానికి వెళ్లి పోవలసివస్తుంది. ఈ జాతుల్లో స్త్రీలు శక్తి సంపన్నలు. అవసరమైతే వాళ్లు కులపెద్దని నెత్తిమీద కొమ్ము లూడగొట్టి కూర్చోపెట్ట గలరు." ఇటువంటి ఆధిక్యత ఏకపత్నీవివాహం ఆచరణలోకి వచ్చిన తరువాత తారుమారైంది. పూర్వకాలంలో పురుషుని న్యూనభావం స్త్రీ పరంగా మారిపోయింది.


ఏక పత్నీత్వ వివాహ విధానం కారణంగా సాంఘిక స్థితిలో అనంతమైన మార్పు వచ్చింది. ఇతఃపూర్వ మున్న వైవాహిక విధానాలలో సంతానం తల్లిని తప్ప తండ్రిని గుర్తింపలేవు. ఇప్పుడు వారిని పాలించి పోషించటంలో తండ్రికి సమాన ప్రతిపత్తి లభించింది. అతడు వారికి నిజమైన తండ్రి—భార్య మోసగించని సందర్భాలలో. వెనకటి సామాజిక వివాహ విధానంలోని తండ్రుల కంటే ఈ తండ్రికి బిడ్డలమీద మమకారమూ, తహతహా అధికము. అంతే కాదు. సంతానం పురుషునిది. ఆస్తి పాస్తులన్నీ అతనివి. అతని ఆస్తికి ఉత్తరాధికారులు సంతానము. ఈ సంతానం కారణంగా పురుషుడు ఆస్తి పాస్తులను సంపాదించటమూ, వాటిని అభివృద్ధి పొందించటమూ జరుగుతున్నది. ఈ వ్యక్తిగతమైన సంపత్తి (Private wealth) కారణంగా లోకంలో పాలితులు, పాలకులుగా మానవ జాతి విభజితమై పోయింది. ఇతరులను దోచుకొని ఒక జాతి, ఒక వ్యక్తి బాగుపడటం నేటి ఆర్థిక విధానము. దీనికి మూలకారణము—వ్యక్తిగత సంపత్తి; భంగ్యంతరముగా సంతానము. ఇవి రెండూ ఏక పత్నీ వివాహ విధానం వల్ల ఏర్పడ్డవి.

దాంపత్య వివాహ విధానంలో తండ్రి తిండి తెచ్చేవాడు. తల్లినీ పిల్లలనూ పోషించేవాడు. వారిరువురి మధ్యా కలహ కారణాలు పొడకట్టినప్పుడు తండ్రి వెళ్లి పోతూ అతని సామగ్రి అతను పుచ్చుకొని వెళ్లేవాడు. తల్లి ఆమె సామగ్రిని పెట్టుకొని ఇట్లో ఉండి, మరో తాత్కాలిక భర్తను చూచుకునేది. అంటే—విచ్ఛేదానికి ఇబ్బందిగానీ అంతు గానీ లేదన్నమాట! ఏక పత్నీ వివాహంలో ఒక పక్షం అంగీకరించినా, ఇరువురూ అంగీకరించినా సంతానం కారణంగా సంఘమూ, ప్రభుత్వమూ, మతమూ భార్యాభర్తల మధ్య వివాహవిచ్ఛేదము అంగీకృతము కాదు.

ఏక పత్నీత్వ విధానంలో ఆదర్శం ఒకదారి తీసింది. ఆచారం మరొక దారి తీసింది. ఏక పత్నీత్వం ఆచారంలో ఉన్న ఏ దేశంలోని మత గ్రంథాలనూ, పురాణాలనూ పరిశీలించినా స్త్రీకి విశేష గౌరవం కనిపిస్తుంది. కాని ఆచారంలో ఆ రీతిగా ఉండదు. స్త్రీని అతి ఉదాసీన భావంతో చూడటం సమస్త దేశాల్లోనూ పొడకట్టుతున్నది. స్త్రీలను సంతానాన్ని ఇచ్చే యంత్రాలుగా పరిగణించటమూ, యుద్ధఖైదీల క్రింద మార్చుకోవటమూ, నిర్జీవ పదార్థాలక్రింద భావించి, వారి ఇష్టానిష్టాలతో ఈమాత్రమైనా ప్రమేయంలేకుండా అతిథి తర్పణలకూ, మిత్రకోటి ఆనందానుభవాలకూ ఉపయోగించారు. అన్యదేశాలను జయించి తెచ్చిన బానిసకన్యకల కిచ్చిన గౌరవంకూడా ధర్మపత్నుల

(18 వ పేజీ చూడుడు)

కథానిక :



ఆదిశేషయ్య తోళ్ళఫాక్టరీలో మేనేజరుగా ఉంటున్నాడు. ఆస్తిపాస్తీ లేదు. పెద్ద సంసారం, బాదరబందీ లేదు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. భార్య వెంకమ్మగారు దేవాంతకురాలు. నోరెత్తిందంటే ఆవిడతో ఎవరూ చాలరు. చీటికీ మాటికీ నోరు చేసుకుంటూనే ఉంటుంది. కూతురు శారద ఇంటరుమీడియట్ పరీక్షకి ఆరోసారి వెళుతోంది. బోలెడంత గర్వం. నిలువెల్లా రోషం.

ఆదిశేషయ్య చెల్లెలు, నరసమ్మ, భర్త పోయిన దగ్గరనుంచి అన్నగారి ఇంట్లోనే ఉంటోంది. నరసమ్మ కొడుకు రామం స్కూల్ ఫైనలు చదువుతున్నాడు. కూతురు, పార్వతికి పద్నాలుగేళ్లు. పెద్దపిల్లయి కూర్చుంది.

నరసమ్మకుటుంబం చాలా బీదకుటుంబం. పయివాళ్ల ఇంట్లో తిండికి చేరిందని రోజూ వెంకమ్మగారూ, శారదా, నానామాటలూ అడుతూంటారు. నరసమ్మ ఆ ఇంట్లో దాసీ దానికంటే కనాకష్టం. శారద పిల్లలని కొడుతుంది. వెంకమ్మగారు తిడుతుంది. కాని ఎవ్వరూ నోరెత్తడానికి వీలులేదు. ఈ కష్టాలకి నరసమ్మ చిక్కి శల్యమైపోయింది. బెంగపెట్టుకుని ఎప్పుడూ సరిగ్గా భోజనం చెయ్యదు; నిద్రపోదు. కొడుకు పరీక్షపేసయి ఉద్యోగం చేసుకోవాలి. కూతురికి పెళ్లికావాలి. పాపం, కూతురికి గుండెజబ్బు. మందూ మాకూ లేదు. ఆదిశేషయ్య మందిప్పిద్దామని డాక్టర్ని పిలిస్తే వెంకమ్మ నానా తిట్లు తిట్టి మానిపించింది. నిజానికి పార్వతి ఎంతో చక్కటి పిల్ల. తెల్లగా చిక్కటి పాలలాంటి శరీరం. పెద్దకళ్లు. ఎంతో అందంగా ఉండేది. అలాంటిది. పాపం, సన్నంగా బల్లెంలా తయారయింది.

రామం స్కూలుఫైనలు పరీక్షకి రాత్రి ఒంటిగంటవరకూ చదువుకున్నాడు. వాడికి వయస్సు తక్కువైనా తమ కష్టసుఖాలు బాగా తెలిసేయి. తను శీఘ్రం ప్యాసయి ఉద్యోగం చేసుకొని, తనూ తల్లీ చెల్లెలూ, వేరే ఉండాలని కలలుకనేవాడు. పిల్లవాడి మనస్సు చెడిపోతుందని తల్లి ఈ విషయాలు వాడితో అనేదికాదు. కాని, రామానికి, చదువుకుంటున్నప్పుడూ అదే ఆలోచన. పరీక్షల్లోనైనా తనకి మనశ్శాంతి లేదు. వేరే చదువుకోడానికి గదిలేదు. పిల్లలు అల్లరి పెట్టేవారు. వెంకమ్మ కూర్లబజారుకి వెళ్లమనేది. శారద ఇంకో పని పురమాయించేది.

ఆదిశేషయ్యగారి పిల్లలు, దాసుగాడు, సత్యంకూడా తిన్నెంతో చులకన చేసేవారు. అత్తయ్య వీళ్లకి ట్యూషను చెప్పమంటుంది. వాళ్లు చెప్పినమాట వినరు సరికదా మిక్కిలి తిరగబడతారు. దాసుగాడు తన పెన్ను దాచీశాడు. సత్యం తన పుస్తకంలో బొమ్మలన్నీ చింపేశాడు. పెంకి వెధవలు. సరియైన అదుపు ఆజ్ఞలు లేక పూర్తిగ చెడిపోయారు. దాసుగాడికి ఆరో క్లాసు రెండేళ్లయి పోతోంది. ఎప్పుడూ బడికి వెళ్లడు. ఏ మామిడితోటలో కాయలు కోడుతూనో, లేకపోతే జాలారీ గుంటలతో కలసి చెరువులో చేపలు పడుతూనో, కాలక్షేపం చేస్తాడు. బీడీలకి, సినీమాలకీ, డబ్బులు లేకపోతే కాటువేస్తాడు. ఒకసారి కోమట్ల పిల్లడితో కలసి వాళ్లింట్లో ఒక బంగారపు గొలుసు కాజేసి, మిఠాయి దుకాణపాడికి అమ్మేశాడు. కోమటాడు నాలుగు అంటించాడు. వీడిని అంతా తిడతారు, తంతారు. తనుమాత్రం, ఏమీ అనకూడదు.

"పెన్ను ఏదిరా, ఏం చేశావు?" అన్నాడు రామం.

"ఏమో ఎవడికి తెలుసు?" అంటూ నవ్వేడు దాసుగాడు.

"నవ్వుతావేం? చెప్పకపోతే తంతాను".

ఎంత అడిగినా చెప్పలేదు. కాని సత్యాన్ని భయపెడితే చెప్పేశాడు—అర్ధరూపాయి కమ్మేశాడని. సత్యం చిన్నవాడు. దాసుగాడి దగ్గర ఇంకా ట్రయినింగు అవుతున్నాడు. రామానికి పట్టరాని కోపం వచ్చింది. ఫెడీమని ఒక లెంపకాయ కొట్టేశాడు.

ఇంకేముంది రాద్ధాంత సిద్ధాంత మయింది. అత్తయ్య తోకతొక్కిన పాములా ఘర్రున లేచింది. తన కొడుకుల్ని కొట్టేస్తున్నావని నానా మాటలూ అడింది. మామయ్యా, శారదా, అంతా చేరేరు. ఎవరి నోటి కొచ్చినట్లు వాళ్లన్నారు.

"కుర్రనాగమ్మ పరదాకి పెన్ను తీస్తే కొట్టేసి చంపేశాడు. నిష్కారణంగా చచ్చిపోను పిల్లడు" అని ముక్కుమీద వేలేసుకుంది అత్తయ్య

"పరదాకి తియ్యడం కాదు. కాటువేసి, పదిరూపాయల పెన్ను, అర్ధరూపాయి కమ్మేశాడు"

పదిరోజుల్లో పరీక్షలున్నాయి. రామానికి కళ్లంట నీళ్లు తిరిగాయి.

"పోనీ వెధవ పెన్ను." అన్నాడు మామయ్య

"పెన్నుగురించి కాదు. పిల్లవాడు పూర్తిగా చెడిపోతున్నాడు" అన్నాది అమ్మ.

"ఓస్, ఏంబుద్ధి—అమాత్రం మాకు తెలీకు కాబోలు." అంటూ ఎత్తిపొడిచింది శారద.

"ఏదో ఇంత తిని ఇంట్లో పడిఉండడం మానేసి, ఎందుకా వెధవల్లరి." అత్తయ్య నోరు మంచిది కాదు.

"చచ్చినట్టూ పడిఉండక ఏ చేస్తున్నామమ్మా," అన్నది నరసమ్మ.

"పడిఉండకపోతే వెళ్లవమ్మా. నిన్నెవ్వరూ ఇక్కడ పట్టుకుని కూర్చోలేదు."

"ఊరుకో అమ్మా దానితో ఎందుకా గొడవ-" అన్నది పార్వతి. చెల్లికూడా జ్ఞానమొచ్చిన పిల్లాయెను.

"అవునే, ఇంట్లో మెక్కుతూ కూర్చుంటే అంతా గొడవగానే ఉంటుంది. సంసారం చేసేవాళ్లకి తెలుస్తాయి ఆ కష్టసుఖాలు." అంటూ లేచింది అత్తయ్య.

"అవునత్తా. తిండికి లేక మీ ఇంట్లో చేరాక మీ కేమన్నా చెల్లుతుంది."

"ఓహో, ఈ గుంటముండకూడా మాటలు నేర్చింది. పిట్ట కొంచెం కూత ఘనమూను-" అన్నాది శారద.

"పెళ్లికావలసిన పిల్ల. దాన్నలా తిట్టకే" అన్నాది నరసమ్మ.

"ఊరుకో అమ్మా; అది ముద్దులగుమ్మ - దాన్నేమైనా అంటే అమ్మగారికి కోపమొస్తుంది" అత్తయ్య చేతిలో చీపురు వాకిట్లోకి విసిరేసింది.

రామానికి, పట్టరాని కోపం, దుఃఖం, పౌరుషమూ వచ్చాయి.

"అవునత్తయ్యా, అది అన్నదాంట్లో తప్పేముంది. తిండికిలేక మీ ఇంట్లో చేరేమంది. అంతేనా - పరీక్ష లయిపోతే వేరే పోతాంలే - కూలో నాలో చేసుకుని బతగ్గలం."

"వెళ్లరా. ఎవర్ని జడిపిసావు - వెధవవేషం".

"ఊరుకో నాయనా. ఎందుకనవసరంగా తిట్లు తినడం -"

రాత్రయి పోయింది. ఎవరిమానాన్ని వారు భోంచేసి పడుకున్నారు. వంటింట్లో దీపం పెట్టుకుని, రామం, దీక్షగా చదువుతున్నాడు. కాని, పాపం, మనస్సు చెదిరిపోయింది. బెంగతో తల్లి కుష్కించిపోయింది. తమ ఇద్దరికోసం బతికిఉండి ఇన్ని కష్టాలు పడుతోంది. చెల్లిమాత్రం - వయస్సులో ఉండే పిల్ల ఎలా ఉండవలసింది! నీరసించిపోయింది. కళ్లు లోతుకు పోయాయి. సంతోషం లేదు. సమంగా తిండిలేదు. విశ్రాంతి లేదు. ఇంట్లో సర్వ చాకిరీ వీళ్లిద్దరే చేస్తారు. రాత్రి పన్నెండయింది. గోడకి జారబడి కళ్లల్లోంచి జారిన నీళ్లు తుడుచుకున్నాడు. నరసమ్మ వంటింట్లోకి వచ్చి చూసింది. "చాలా రాత్రయింది. నాయనా, వెళ్లి పడుకోరాదూ. ఇంకా మేలుకుంటే జబ్బు చేస్తుంది." అని చెయ్యి పట్టి లేవదీసింది. చెయ్యి వేడిగా ఉందేంరా? జ్వరంగాని రాలేదుకదా!" ఒంటిమీద చెయ్యివేసి చూసింది. చిన్న జ్వరం తగిలింది. రామాన్ని మంచంమీద పడుకోబెటి, ప్రక్కని కూర్చుని విసనకర్రతో విసురుతోంది నరసమ్మ.

"నువ్వెళ్లి పడుకో అమ్మా-విసరక్కర్లేదు."

"అలాగే, నువ్వు నిద్దరపో-" అంటూ రామం ప్రాఫింగు నుదురుమీద పడుతోంటే చేత్తోటి వెనక్కి తీసింది నరసమ్మ. వీ డొక్కడి ఆశమీద తను బతుకుతోంది. వీడు పెద్దవాడై బతికి బాగుంటే అంతే చాలు. తన కాళ్లమీద తను నిలబడగలిగితే, చెల్లెలికి పెళ్లిచేస్తాడు. తరువాత వీడికి పెళ్లిచేసి, కోడల్ని తన ఇంటికి తెచ్చుకుంటుంది. తన కొడుకూ, కోడలూ నట్టింట్లో తిరిగితే తన కళ్లార చూడగలదు. ఆ ఆశమీదే తను బతుకుతోంది.

'తండ్రీ, నా కొడుకు బతికి బాగుంటే అంతేచాలు - "అని మనసులో భగవంతుడిని ప్రార్థించుకుంది. ఆమె కళ్లంట జలజల నీళ్లు రాలేయి. చీరకొంగుతో వొత్తుకుని ముక్కు తుడుచుకుంది.

"అమ్మా, ఏమిటది?"

"ఏమీ లేదు, ఇంకా నిద్దర పట్టలేదురా - వాకేం దారిరా - జబ్బు చేస్తుంది - " అన్నాది నరసమ్మ.

"నిద్ర పట్టకపోతే నన్నేం చెయ్యమన్నావు".

"బెంగ పెట్టుకుంటున్నావేమిట్రా - బెంగెందుకు. ఎలాగయేగ. అలా అవుతుంది."

"బెంగలేదుకాని - చదువు తిన్నగా సాగకుండా ఉంది. పరీక్ష ఏమవుతుందో అని బెంగగా ఉంది."

"ఏదో కానీ - ఏం చేస్తాం - అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు." రామం కళ్లు అలసి, నిద్రపోయాడు. కాని తెల్లవార్లూ నరసమ్మకి నిద్రే లేదు.

* * * *

రామానికి పరీక్ష లయిపోయి రెండునెల లయిపోయింది ఒకరోజు సాయింత్రం, వాకిట్లో ఆదిశేషయ్యగారు, ఈజీచైరుమీద కూర్చుని పేపరు చూస్తున్నారు. నరసమ్మ వీధిలోంచి తొందరగా వచ్చి "అన్నయ్యా, పరీక్షలగురించి పేపర్లో వచ్చిందట-పేసయాడేమో చూడ్రా"- అన్నాది.

"వాడి నెంబరు నాకు తెలీదు - ఏమో, పోయే ఉంటుంది. వెధవ - ఎప్పుడేనా చదివితేనా? వాడొచ్చేక కనుక్కోవచ్చులే. తొందరేమిటి?" అని చిరాకుగా - కాలుస్తున్న పైపులోంచి పొగ మేఘంలా వదిలాడు - ఈ రోజు అతని మనస్సేం బాగులేదు. మార్కెట్టులో తోళ్లఖరీదులు గద్దల్లా ఆకాశానికి ఎగిరాయి. సమయానికి, తోళ్లు సప్లయి చెయ్యలేకపోయింది వాళ్ల కంపెనీ - అదీ సొద.

నరసమ్మ మన సుండబట్టక వీధిలోకి వెళ్లి దారినిపోయే కుర్రవాళ్ల నడిగింది:

"నాయనా, పరీక్షలగురించి పేపర్లోవచ్చిందట, మా రామం పేసయాడా -" అనిఅడిగింది.

వాళ్లు నవ్వుతున్నారు - అందులో ఒకడు మీవాడి పరీక్ష పోయింది. ఇంటికొస్తే, ఇంట్లో వాళ్లు తిడతారని ఎక్కడికో వెళ్లిపోయాడు." అని చెప్పి వెళ్లిపోయారు. నరసమ్మ నిలువునా కూలిపోయింది. ఏడిచింది.

"తెగించి, వాడేదేనా సాహసం చెయ్యలేదుకదా!" అని నెత్తీ నోరూ కొట్టుకుంది. పార్వతి తల్లి నోదార్చింది. "వాడెప్పుడూ, అలాంటి పనిచెయ్యడమ్మా. మనగురించేనా వాడు ఆ లాంటి పని చెయ్యడు-" అని, పార్వతి కళ్ళు తుడుచుకుంది.


ఆదిశేషయ్య కబుర్లుపెట్టించి కనుక్కుంటే ఇద్దరు స్టూడెంట్లు వచ్చి చెప్పేరు. రామం పరీక్షపోయిన తరువాత చెరువులో పడబోతే స్నేహితులు కనిపెట్టి "నీతల్లినీ, చెల్లెల్నీ గంగలో దింపి, పోతావా?" అని చీవాట్లు వేశారట. అప్పుడు తను ఏదోబతుకుతెరువు చూసుకున్నవరకూ ఈ ఇంటిగుమ్మం తొక్కనని, రైలెక్కి, ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిపోయాడని" చెప్పేరు.

"నే చెప్పలేదమ్మా, నువ్వు బెంగపెట్టకోకు- అన్నయ్య తప్పక ఉద్యోగం సంపాదించుకుని వస్తాడు-" అన్నాది పార్వతి.


"కంటికి కనబడకుండా దూరమయేడు. ఎటు వెళ్లేడో - వాడి తిండితిప్పలు ఎలాగ? - చిన్నవాడు - వాడికెవరు దిక్కు -" అని తల్లి కుమిలి కుమిలి ఏడిచింది.

"ఏమీ భయం లేదమ్మా-అన్నయ్య చాలా ధైర్యవంతుడు" అని తల్లిని ఓదారుద్దామని ప్రయత్నించింది - పార్వతి.

"వాడిని రక్షించి, కాపాడు తండ్రీ" అని భగవంతుడికి మనసులో నమస్కరించింది నరసమ్మ.




వేనాడు [illegible] దిగిన బృందము




ఎదురుగాలిని లెక్కచేయకుండా.



సరస్సులో డోలాయమాన స్థితిలో నున్న బోటు.



తాటిచెట్ల తోపుల దాపులనున్న నీలిమందు చేలు.



చెలియలికట్ట పరిశీలించుచుండుట.

ఆంధ్రుల సుందర్

పులికోట సరస్సులోని, వే

ప్రాచీనకాలంలో అతివైభవ
ప్రదేశములు వేనాడు, శ్రీహరి
జీర్ణ కళేబర సంకలితములుగా
దోనా తెన్నూ లేక ఏ దిక్కు
ఏనాటికో వారినీ, ఆ

'రా

ఒకనాడు దూరదేశాలకు ఓడల బంపి వర్తక వాణిజ్య వ్యాపారముల సాగించి సౌభాగ్య సంపదల తేలియాడిన వేనాడు శ్రీహరికోట దీవులు నేడు పాడుపడి, దారిద్ర్యమూ, అనారోగ్యమూ ఎక్కడ వున్న వంటే 'ఇక్కడ' అంటూ 'ఓ' అని ప్రతిధ్వనించుచున్నవి. ఇంగువకట్టిన బట్టమాదిరి ఇప్పటికినీ వాటి పూర్వపు ఔన్నత్యాన్ని దిగ్భ్రాంతముగా స్మరింపచేస్తున్నవి. పువ్వులమ్మినచోటనే జనము కట్టెలుకొట్టి జీవించ వలసివచ్చినది.

చక్కని ప్రకృతి సౌందర్యమునకు నిలయములై, రమణీయవృక్ష తతికి ఆటపట్టులై ఎవరు ఆలించి పాలించకున్నను సూర్య చంద్రాదులచే నిత్యప్రకాశములై, వాయువరుణ కటాక్షవీక్షణముల కొలువాలముచూ దర్శనీయములైన ఈ సుందర దీవుల ఉనికి, పూర్వ చరిత్ర, వర్తమానస్థితి తెలుసుకొనవలెను.

పులికాట్ సరస్సులో ప్రయాణం


ఇటీవల ఈ దీవుల రెండురోజులు దర్శించి వచ్చే భాగ్యం నా కబ్బింది. చిల్కా సముద్రము, కొల్లేరు, పులికాట్ సరస్సులు ఆంధ్రులు పరిపాటిగా విన్నట్టి పెద్దసరస్సులు. చెన్నపట్నానికి 50 మైళ్లలో ఉన్నతడ గ్రామందగ్గరే ఈ పులికాట్ సరస్సు ప్రారంభమవుతుంది. శుక్రవారం తడవద్ద లాంచి నెక్కాము. ఆ సరస్సులో నీరు తక్కువగా నున్నందున మాలాంచి మెషిన్ ఆపుచేసి, లాంచిని బోటుకు త్రాళ్లు పోనికట్టి తెరచాప ఎత్తి 'జాః పరమేశ్వరా' అని ఉదయాన్నే తడ వదిలాము. పవమానుని పావని దృక్కులమాపై అంతగా ప్రసరించనందున మళ్లీ యంత్రమును శరణుజొచ్చాము. సరస్సులో నీరు లోతులేదు. అందువల్ల మా ఆట సాగలేదు. మళ్లీ ఆ చిన్న నావనే నమ్ముకొనక తప్పలేదు.

వేనాడు ద్వీపం

పదిగంటలకల్లా మా 'హంసనావ' హంసగమనముతో వేనాడు చేరింది. వేనాడు పొడవు 5 మైళ్లు. వెడల్పు $2\frac{1}{2}$ - 3 మైళ్ళ మధ్య. జనాభా 1500. ఊరికి దూరంగా 500 మంది గుడిసెల్లో ఉన్నారు. వాళ్ళ ఇళ్ళసమీపంలోనే ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్లు సరుగుచెట్లు నాటగా అనారోగ్యం ఎక్కువైంది. మశ్చకముల బాధ మిక్కుటమై బోదవ్యాధి ప్రబలింది. ద్వీప పరిసర ప్రాంతాన్ని చెలియలికట్టనూ మధ్యాహ్నం చూశాము. ద్వీప వాసులు వానలులేక ఎండిపోవుచున్న స్వర్ణవరుల చూపించారు. దానికి నివారణగా కాలువేసుకు పోయి అప్పోయిస్తే లేకున్న దొర్యులమరమ్మతు చేయించిన మంచి పంట పండుతుంది. అల్లాంటి కుంటలు వేనాడులో 170 ఉన్నయ్. వేనాడు, ఇరకం, శ్రీహరికోట దీవుల్లో మొత్తం 500దాక ఉన్నయ్. క్రింద టేడు రెవెన్యూ, మరమ్మతు ఇలాకా అమాత్యులు వేనాడు వెంచేయగా వాటినిబాగు చెయ్యాలని ప్రజలు కోరారట. వా క్రిందివాళ్ల రిపోర్టు అడిగారనీ, ఇంకా వాటికి దర్శాస్త్రగండము తప్పలేదని తెలుస్తో

చెలియలికట్ట

పొలిమేరలోని తాటిబొత్తలు దాటి కొంత దవ్వుపోతే చెలియలికట్ట చులాగ్గా అందుకోవచ్చు. అది గట్టిగాలేదు. ఉప్పుకెరటాలువచ్చి పొలాలు చవిటివైనవి. కట్టుదిట్టంగా వేస్తే కొన్ని వేల ఎకరాలు పంట దక్కుతుంది. నీటిదరిన కొంత దూరం ఉత్తరంగా పోతే మళ్ళీ చిన్న అడవి దాటాలి. దాటినమీదట మనోజ్ఞమైన నీలి పొలాలుఉన్నయ్. అక్కడక్కడ చెరుకు, జీడి మామిడిచెట్లు, దుంపదుకాయల చెట్లు ఉన్నవి. అడవిపందులు వచ్చి పంటలు పాడుచేస్తూ ఉంటయ్. మద్యపాననిషేధం వచ్చినందున తాళ వృక్షాలు గళమున కుండలు లేక అలంకార రహితంగా ఉండ టంకశంకయుత మేమో అనిపించింది. ప్రజలు మద్యనిషేధం తమకు ఆశీర్వాదంగా వచ్చిందని అనుకుంటున్నా, అను



...తెడ్డు వేయుచున్న సరంగు.

...ద్వాన ద్వీపములు

...నాడు, శ్రీహరికోట దీవులు

...వైభవముల ననుభవించిన సుందర
...కోట దీవులు ఈనాడు వ్యాధిగ్రస్త
...నున్నవి. అచటి ప్రజలకు ఒక
... కనిపించని స్థితిలో ఉన్నారు.
...ప్రదేశాన్ని ఉద్ధరించడము ?

...మ శర్మ'

దినమూ ఆదలకించే ఈ రోగుల సన్నిధిని లేనందున కొంత సల్లింపు ఉన్నట్టు తెలిసింది అడవుల్లోంచి అడవిపందులకు తోడు వేగోలాలు కూడా దర్శనమిస్తూ ఉంటవి.

గ్రామస్థుల కష్టాలు


ఊళ్లో ఒక చిన్న పోస్టాఫీసు ఉంది. దానిని ఎత్తివేస్తారని భయపడుతున్నారు. బహిః ప్రపంచంతో సంబంధం కల్గించడానికి ఆప్త బంధువుగా ఉన్న దాన్ని కాస్తా ఎత్తేస్తే తమకు కాంతి ఎక్కడనుంచి గాగల దంటున్నారు.

జబ్బుచేస్తే దూరాన ఉన్న శ్రీహరికోటనుంచి వైద్యుడు వచ్చిందాకా దిక్కులేదు. అందువల్ల ఇక్కడే ఒక ఆసుపత్రి పెట్టమంటున్నారు. గ్రామస్థులు చెమటోడ్చి కష్టపడేవాళ్ళు. ఎంత కష్టపడ్డా రెండొన్నులు మించి అన్నం వాళ్లకు దొరక్కుండా ఉంది. నెల్లూరు జిల్లాలో ఒక తాలూకానుంచి మరొక తాలూకాకు ఆహార ధాన్యం ఎగుమతి నిషేధం ఉంది. అక్టోబరులో లేపను ఎత్తివేస్తే ఈ ఆటంకాలుపోయి కడుపు నిండగలదని ప్రజల ఆశ.

శ్రీహరికోట

తొలిరోజు రాత్రి కేవాడులో నిద్రచేసి, మరివాడు తూర్పారుతూండగా లేచి స్నానాది కాలు ముగించుకొని శ్రీహరికోటకు బయలు

(1వ పేజీ చూడుడు)



శ్రీ హరికోటనుంచి సూళూరుపేటకు కాల్వ, రోడ్డు వెయ్యగోరిన స్థలమును మంత్రిగారు, కలెక్టరు, బకింగ్ హాం కెనాల్ ఇంజనీరు, బకింగ్ హాం కాల్వ గట్టుననుంచుని తిలకించుచున్నారు.




శ్రీ హరికోట అడవులనుంచి చెన్నపట్నానికి ఎగుమతికోసం నిల్వచేసిన వంట చెరకు.



వానలులేక ఎండిపోతూన్న స్వర్ణవరులు.



ఆర్తులూ, అనారోగ్య సంకలితులూ అయిన శ్రీహరికోట జనము.



శ్రీహరికోట బహిరంగసభలో చంద్రమౌళిగారు ఉపన్యసించుచుండుట.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయికథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు' రచన: **లూయీ కెరోల్**

౧౪

అనుకరణం : "ఆప్లవాన్"

"ఇక్కడ చాలా బాగుంది కాదూ?" అంటూ సన్నగొంతుకతో ఎవళ్ళో పాప పక్కనే పల్కరించారు. పాప, పక్కకు చూసేటప్పటికి, తెల్లకుందేలు పక్కనే నడుస్తూ పాపమొహంలోకి అతి వినయంగా చూస్తూ, అతి భయ భక్తులతో నెమ్మదిగా పాప నడుగుతూంది.

"చాలా బాగానే ఉంది. అయితే జమీందారిణి ఏదీ?" అని పాప అడిగింది.

తెల్లకుందేలు అడావుడిగా నోటి మీద వేలు వేసుకొంటూ, అతి నెమ్మదిగా, "ఉష్ ఉష్" అంటూ పాపతో ఆ మాట ఎత్తవద్దన్నట్లు తెలిపింది. అని, వెనక్కి ఇటూ అటూ మెడ త్రిప్పి ఎవళ్ళూ లేరుకదా అన్నట్లు చూసి, మునివేళ్ళమీద నిలబడి, పాప చెవి దగ్గిరగా నోరు పెట్టి, రహస్యంగా, "జమీందారిణితల కొట్టేయమని ఆజ్ఞ అయింది" అని చెవిలో చెప్పింది.

"ఎందుకనీ?" అని పాప అడిగింది.

"ఎందుకు పాపం, అనా అంటున్నావు?" అంది కుందేలు.

"నేనేం అల్లా అనలే; పాపం ఏముంది, పాపమేం లేదు. ఊర్కే ఎందుకని అడిగాను, అంతే."

"రాణీగారిని లెంపకాయ కొట్టింది." అంటూ కుందేలు మొదలుపెట్టింది.

పాపకు సంతోషం ఆగక, పకపకా నవ్వింది. కుందేలు భయంతో పాప చెవులో "ఉష్! నవ్వకు! రాణీగారు వింటుంది. అసలు ఏమైందంటే - జమీందారిణి ఆలస్యంగా వచ్చిందిగా మరి. అందుకని రాణీగారు అన్నది..." అంటూ చెప్తూంది.

"ఎవళ్ళ జాగాల్లో వాళ్లు నిల్చోండి" అంటూ రాణి ఉరుములాంటి కేక వెయ్యటంతో, అంతా కంగారుగా ఒకళ్ళనొకళ్ళు తోసుకొంటూ ఒకళ్ళ మీద ఒకళ్ళు పడుతూ లేస్తూ జాగాల్లో నిల్చోటానికి పోతూన్నారు.

అసలు అల్లాంటి పచ్చీసు ఆట పాప మును పెక్కడా చూడలేదు. చాలామంది వరుసలు వరుసలుగా కాళ్ళు చేతులు నేలమీద ఆనుకొని వంగుతూ, పచ్చీసుగళ్ళుగా తయారయారు. డైమను చుక్కలున్న పిల్లలు పచ్చీసు పావుల్లాగా మొదటి పంటగడిలో కూర్చున్నారు. ఇందాకటి తోటమాలుల లాగా, ఇస్పేటుచుక్కలున్న వాళ్ళు మరి ఏడుగురు ఒక చోట నిలబడ్డారు. కళావరుచుక్కలున్న సైనికులు ఇద్దరిద్దరు రొక్కొక్కణ్ణి పట్టుకొని గాలిలోకి తిప్పుతూంటే కళావరుజాకీ ఒక గదె పుచ్చుకొని, వాళ్ళను గాలిలోకి పైకి విసురుగా ఎగురగొట్టున్నాడు. వాళ్ళు క్రిందపడ్డాక ఎల్లా పడ్డవాళ్ళు అల్లాగే పడిఉండాలి. రాణీ ఒకొక్కడి దగ్గిరికీ వచ్చి "ఉల్టా", "సీదా" అంటూ లెఖ్ఖపెట్టుతూ, చివరికి ఏదో అంకె కేకవేసేది. పంటగడిలో ఉన్న ఒక డైమనుచుక్క కుఱ్ఱాడిని నల్గురూ పట్టుకొని కూర్చున్నవాణ్ణి అల్లాగే మోసుకెళ్ళి ఎన్ని అంకెలు చెప్పిందో అన్ని గళ్ళూ దాటాక గడిలో దభీమని కూలబడేసేవాళ్ళు. మధ్య మధ్య రాణి "పావు" చచ్చింది; తల కొట్టేయ్" అని కేకేసేది. ఆ డైమను చుక్క కుఱ్ఱాడు ఏడుస్తూంటే నల్గురు కాళ్లూ చేతులూ బట్టుకొని బడబడా

బాల

పల్లెటూరువాడు: భూతం

పిల్లల కథలు **బి. వరలక్ష్మి**

ఒక పల్లెటూరువాడు ప్రయాణం చేస్తూ ఊసుపోకకు వేరుశనగ కాయలు తింటున్నాడు. వాటిలో ఒక డొల్లకాయ వచ్చింది. అదే సమయంలో వానికి ఒక భూతం కూడా ఎదురయింది.

పల్లెటూరివాడు భయపడలేదు.

"భూతాలు ఎంత చిన్నవయినా అవుతాయని, సూదిబెజ్జంలోకూడ దూరిపోగలవని విన్నాను.నిజమేనా?" అన్నాడు.

"ఆమాట నిజమే!" అంది భూతం.

"అయితే ఈ వేరుశనగకన్నం లోకి నువ్వెలా ప్రవేశించగలవో చూస్తాను." అన్నాడు ప్రయాణికుడు.

వెంటనే భూతం ఆ కన్నంకన్నా చిన్న ఆకారంతో వేరుశనగ కాయలో ప్రవేశించింది. బాటసారి కన్నాన్ని అగ్గిపుల్లతో మూసి జేబులో వేసుకున్నాడు.

కొంచెము దూరం పోగానే ఒక వడ్రంగి కొట్టు కనబడింది. అక్కడికి వెళ్లి బాటసారి వేరుశనగకాయ చూపించి దానిని బద్దలగొట్టమని వడ్రంగికి ఇచ్చాడు. వడ్రంగి అది చాలా సులభమైన పని అనుకొన్నాడు. చిన్న సుత్తి తెచ్చి చిన్న దెబ్బ కొట్టాడు. కాయ బద్దలు కాలేదు. మరి కొంచెం పెద్ద సుత్తితో కొట్టాడు. లాభం లేకపోయింది. వడ్రంగికి కోపం వచ్చింది. అన్నిటికన్న పెద్ద సుత్తితో తన బలమంతా ఉపయోగించి దెబ్బ వేసాడు. కాయ బద్దలయింది కాని, ఆ చప్పుడుకి ఇంటి పైకప్పు సగం ఎగిరిపోయింది.

"ఇందులో భూతంగాని దూరిందేమో?" అన్నాడు వడ్రంగి.

"అవును. అందులో భూతమే దూరింది!" అన్నాడు బాటసారి నవ్వుతూ.

[నార్వేదేశపు పిట్టకథ]



బైటికి లాక్కుపోతూండే వాళ్ళు. ఇప్పేటు చుక్కలవాళ్ళ వీపులు, రొమ్ములు పగిలేటట్టు అల్లాగే ఎగ రేస్తూ ఆట సాగిస్తూన్నారు. రాణీ ఊర్కే కేకలేస్తూ అరుస్తూ, కోపం వచ్చిన చోటల్లా తల కొట్టేయమని ఉరుముతూ అంతటా కలయ తిరుగు తూంది.

పాపకు ఆట అంతా వికృతంగానే తోచింది. "రాణీకోపంతో, చివరి కిక్క డెవ్వరూ మిగిలేట్లే తోచదు. అందరితలలూ కొట్టెయ్యమంటుంది. ఎల్లాగో ఈ ఆటలోంచి తప్పించుకొని బైట పడితే బాగుండును" అను కొంటూ, ఎవళ్ళూ చూడకుండా ఇవతలికి రావటం ఎల్లాగా అని పాప ఆలోచించటం మొదలుపెట్టింది.

అటూ ఇటూ చూస్తుంటే పాపకు ఆకాశంలో ఏదో గమ్మత్తు రూపం ఒకటి కనబడింది. ఏమిటా అని పర కాయించి చూసేటప్పటికి, ఇందాకటి దేవరపిల్లి నవ్వు— "పోనీలే, పిల్లైనా కనబడితే కాస్సేపు కబుర్లాడుకో వచ్చు" అనుకొంది పాప.

"ఆట ఎల్లా ఉంది?" అని పిల్లినోరు అడిగింది. (అంటే, అప్పటికి అంత మాత్రమే కనబడుతోంది.)

కళ్ళు కనబడేదాకా ఆగి పాప తల ఊచింది. "చెవులుకూడా రాందే, మాట్లాడితే ఏం లాభం; వినబడు తుందా ఏమైనానా" అని ఊర్కుంది. ఒక నిముషానికి పిల్లి ముక్కూ, చెవులూ, తలా, అంతా కనబడింది.

"ఇక్కడ ఓ న్యాయంగా ఆడ టమూ, పాడూ ఏమీ లేనట్లుంది" అంటూ పాప మొదలు పెట్టింది. "అదీ కాకుండా, బ్రతికున్న పావులూ బ్రతికున్న గవ్వలూనూ; వాట్లను ఇష్ట మొచ్చినట్లు చావగొట్టున్నారు. ప్రతీ వాళ్ళూ తగాదాలే - అందరి తలలూ కొట్టేయటమే - అందరికన్నా రాణీయే మరీ అన్యాయం ఆట ఆడుతూంది—"

"రాణి ఎల్లాంటి దంటావు ? నీ కేమైనా నచ్చిందా?" అని పిల్లి అడిగింది.

"ఊహూ!" అని పాప దీర్ఘం దీసి - "రాణీ..." అని ఏదో చెప్పబోయే టప్పటికి తన వెనుకగానే రాణి నిల్చున్నట్లు చూసి మాట తిప్పేస్తూ—

"రాణీగారు అందరికంటే చాలా బాగా ఆడుతోంది. తప్పకుండా ఆవిడే నెగ్గుతుంది. తక్కినవాళ్ళాడటం దండగే" అంది.

రాణి పాపవంక చూసి స్నేహంగా, చిరునవ్వు నవ్వి మళ్ళీ తన ఆటలోకి వెళ్ళిపోయింది.

రాజు పాప ప్రక్కకు వచ్చి నుల్చుని— "ఎవరితోటీ - మాట్లాడు తున్నావు?" అని అడిగాడు.

"దేవరపిల్లితోటి-దేవరపిల్లికి నాకూ సావాసము - నీకుకూడా సావాసం కలపనా?" అని అడిగింది పాప.

"అదేమిటి? మరీ అల్లా చూస్తుంది- నాకేం బావుల్లేదు. పోనీలే, కావా లంటే నా చెయ్యి ముద్దెట్టుకోమను-"

"ఛాత్! నేనేం ముద్దెట్టుకోను" అంది పిల్లి.

"ఏమిటా ధిక్కారము! అసలు అల్లా చూడొద్దని చెప్పలా" అని పిల్లితో అంటూ రాజు, పాప వెనక్కు నక్కాడు.

"చూస్తే ఏమయిందేమిటీ? పిల్లి మాత్రం రాజుగార్ని చూడకూడదా?" అంటూ పాప సద్దటం మొదలు పెట్టింది.

"ఏమైనా ముందు ఆ పిల్లి నిక్కడి నించి తీసెయ్యాలి" అన్నాడు రాజు, అప్పుడే రాణీ ఆ ప్రక్కనుంచి వెళు తూంటే, "ప్రియా! ఈ పిల్లి నిక్కడ నుంచి తీయించెయ్యవూ?" అని బ్రతి మాలాడు. రాణి ఇటు తిరిగన్నా

(20 వ పేజీ చూడుడు)





కథా గేయం :



ఆణిముత్యం

'ప్రసాదరావు'

౧3

పతిత భూగత సర్వకృపీటయోని
తతి, సంగహీనమాగతి, తనలోన
జీర్ణించుకొనుచు, బాడబవహ్ని ప్రోచు,
అర్ణవస్వామియు, ఆయమహృదయ, 1

మానసరోవరమందుండి పొగిలి
నేత్రాభ్ర జలద ఘనీభావ మంది
కరిగి కురిసిన ప్రేమ కన్నీటివారి,
తనలోని వారి సంతతి చేర్చికొనియె. 2

సంద్రుండు, చంద్రుండు, సర్వభూతములు,
నిశయును, దిశలును, నింగి చుక్కలును,
సాక్షిత్వమున నిల్చు చక్కటి దక్క,
అర్చెడి తీర్చెడి అనువున బోరు. 3

ఆ రీతి సైకతస్థలి నటు కూలి
మూర్ఛిలి ఏడ్చెడు ముత్యమ్ముదరికి,
తొలిచూలిబిడ్డ ఐదేండ్లదా పసిది,
నెలలగుడ్డౌ తమ్ము నెత్తుకువచ్చి— 4

తల్లికై తీరాన తచ్చటలాడు
చకట పడిపోయిన అమ్మను చూచి,
"అమ్మ! పాలకునై అందాకనుండి
అబ్బి ఏడ్చుచునుండె", అనుచు లేపంగ— 5

లేచి బిడ్డకు కష్టలేశంబు కూడ,
తోపంగబోనీక, తుడుచుక కనులు
"ఈనాడు రాకున్న నేమాయె ఆణి,
రే, పెల్లి, రాడొ, ఈ రీతి బేలనుగ,— 6

గానేల"నని యాశ గల్పించుకొనుచు,
దిటవుగ శిశుల సందిట చేర్చుకొనుచు,
కడగుచు నింటిది క్కొచును కదలి,
కదలని పాదముల్ కదిలించుకొనుచు— 7

వెనుక వెన్కగ, సంద్రము వెన్క నేమైన
కను బడునోయంచు, కను బొడ్చుకొనుచు,
చీకట్ల, చూపుల, చీలుచుకొనుచు
మాటికి చూచుచు, మరలె ముత్యమ్ము. 8

సినిమా పుట :

చలనచిత్రాలద్వారా విద్యాబోధ

జోన్ లిటిల్ ఫీల్డు

చలన చిత్ర ప్రదర్శనరూపంలో, విషయాలను పిల్లలకు తెలపటంవలన, విద్యాబోధనా ప్రణాళికలకు మంచి పుష్టి కలుగుతూందనీ, విషయ పరిజ్ఞానము సులభంగా అలవడుతుందనీ, బ్రిటిష్ విద్యావేత్తలు చాలా నాళ్ళ క్రిందట గ్రహించి, క్రొత్త పోకడలకై ప్రయత్నిస్తూ వచ్చారు. ద్వితీయ ప్రపంచయుద్ధం అయిపోయి నప్పటినుంచీ, స్థానిక విద్యాధికారులు, విద్యాశాఖమంత్రి వర్గమూ, ప్రభుత్వ కేంద్ర వార్తా కార్యాలయము వారూ, డాక్యుమెంటరీ చిత్రాలుతీసే, ప్రయివేటు ఫిల్మునిర్మాతలూ, అందరూ సహకరించి, బ్రిటనులోని 30,000 విద్యాశాలలలోనూ, ఫిలిం ప్రదర్శనయంత్రాలు (Projection) స్థాపించేందుకూ, తగినన్ని క్రొత్త విద్యాబోధక చిత్రాలు తీసేందుకూ ఎడతెగక కృషి చేస్తూనే వచ్చారు.

నవంబరు 1946 లో, విద్యాబోధనలో దృశ్యప్రదర్శన విధానాల, జాతీయ సంఘమొకటి "నేషనల్ కమిటీ ఫర్ విజువల్ ఎయిడ్స్ ఇన్ ఎడ్యుకేషన్" అంటూ స్థాపించబడింది. అదొక స్వతంత్ర సంస్థ. ఆ సంస్థలో, ఉపాధ్యాయులూ, విద్యాశాఖాధికారులూ, పరిసమానంగా సభ్యులుగా ఉన్నారు. ఉపాధ్యాయుల్లోనుంచి, ఐదు పట్టికలవారిగా, ఉపాధ్యాయ కార్యవర్గ సంఘాలున్నాయి. పిల్లలను వయస్సువారిగా ఐదు వర్గాలుగా విభజించి, ఆ ఐదు వర్గాలకూ తగినట్టుగా ఏయే విషయాలు చిత్రాలు తీయవలసి ఉంటుందో, పై ఐదు ఉపాధ్యాయ సంఘాలూ సూచిస్తూ ఉంటాయి. 5-7 ఏండ్ల బాలురు మొదటివర్గము. 7 నుంచి 11 దాకా రెండోవర్గము. 11 నుంచి 13 ఏండ్ల బాలురు మూడో వర్గము. 13-15 ఏండ్ల వారు నాలుగో వర్గము. 15 ఏండ్ల పైబడ్డ బాలురు ఐదోవర్గము. ఈ విధంగా ఐదు వర్గాలుగా ఈడు వారిగా, పిల్లల విద్యాబోధన విషయాలను విభజించి, ఆయా వర్గాలతో పరిచయమున్న ఉపాధ్యాయుల నాయా సంఘాలలో సలహాలకు సభ్యులుగా ఉంచారు.

ఈ జాతీయ సంఘానికి, ఆరంభంలో 130,000, పౌనులు (17,30,0000 రూ.) ధనం, ప్రభుత్వం ఇచ్చింది. ఈ వివిధ ఐదు, వయో వర్గాలకూ తగినరీతిగా, 20 సెట్లు ఫిల్ములు తీయవలసిందని, ప్రభుత్వ కేంద్ర ప్రచురణశాఖలోని ఫిలింశాఖవారినీ, కొన్ని ప్రత్యేక ఫిలిం సంస్థల వారినీ ప్రభుత్వం నియమించింది. ఈ ఫిలింల తోపాటు, విపులంగా తెలిపే, పటాలూ, ఒక్కొక్కటే ప్రదర్శించగల చిన్నచిన్న ఫిలిం బొమ్మ ముక్కలు, ఉపాధ్యాయుల టీకా వివరణాలూ, ఇవికూడా తయారుచేసి, అన్నీ ఒక "దృశ్యబోధా విధానపు సెట్టుగా" తయారు చేస్తారు.



విక్రమ ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి తమిళ 'భక్త తులసీదాస్'లో కుమారి లక్ష్మీశంకర్

పీటిలో—

ఐదునుంచి ఏడేండ్ల పిల్లల వర్గానికి : త్రివర్ణ చిత్రాలుగా తీసిన పొలం పశువుల చిత్రాలు— వీటితో, గోడపై వేలాడేసే పెద్దపటాల్లోపశువుల చిత్రాలు—ఉపాధ్యాయుని వివరణాలూ, —పిల్లలు చిత్రంచూసి తమ దగ్గరఉంచుకొని నేర్చుకొనేందుకు ఆ విషయాల పై రంగురంగుల బొమ్మలకరపత్రాలు ఇవన్నీ ఒక సెట్టుగా తయారు చేస్తారు.

ఏడునుంచీ పదకొండేండ్ల పిల్లలకు :—

"ప్రజలూ వాళ్లవాళ్ళ పనులూ—" అనే శీర్షికల క్రింద చిత్రాలుంటాయి. రొట్టెలు తయారుచేసేవాడు, ఇంజను డ్రైవరు - విమానం పైలట్- మొదలైన జీవితాలూ పనులూ, క్లుప్తంగా చూపిస్తారు.

పదకొండునుంచి పదమూడేండ్ల పిల్లలకు :

చేతిపనులూ, నానావిధములైన, పనుల్లోనూ, ఆటల్లోనూ, కుశలంగా చెయ్యగల విధానాలూ- ఉలి, చేబాడీత మొదలైనవి వాడటం ఎల్లాగో, చిత్రిక పట్టడం ఎల్లాగో, లేదా ఆటలవిషయాల్లో క్రికెట్ బాటు సరిగ్గా ఎల్లా పట్టుకొని ఆడాలో, ఇల్లాంటి విషయాలు చిత్రవస్తువులుగా ఉంటాయి.

పదమూడునుంచీ - పదిహేనేళ్ళ పిల్లలకు : వ్యావసాయిక విషయాలు. ఉదాహరణకు. "ఈస్టు ఆంగ్లియాలో గోధుమ పండించు విధానము"; గృహనిర్మాణ విధానాలు; వృత్తి విద్యాబోధక విషయాలు; ఇల్లాంటివి చిత్రవస్తువులుగా ఉంటాయి.

పదిహేనేళ్ళ పైవారికి :— ప్రాదేశిక తారతమ్యాల బోధ, ఉదా: 'రోండా' - లోయ, 'వై'-లోయల తారతమ్యాలను చూపించే చిత్రాలు-ఇళ్లల్లో చేసుకోవలసిన మరమ్మతులు మొదలైనవి. ఇవి చిత్రాల్లో బోధనా విషయాలుగా ఉంటాయి.

ఏ చిత్రమైనా తీయటానికి ముందు, ఆ చిత్రదర్శకుడు, ఆ యూనిట్ చిత్రాలకు సంబంధించినవిద్యాశాఖ సలహాదారుతో చిత్రం విషయం పూర్తిగా సంప్రదింపులు జరుపుతాడు.

తర్వాత ఒక్కొక్క చిత్రానికి చాలా ఎక్కువ 'కాపీ' లు కావలసిఉంటుంది కాబట్టి, చిత్రనిర్మాణ వ్యాపార సంస్థలు కూడా, నష్టమొస్తుందనే భయం ఏమాత్రమూ లేకుండా, చిత్రనిర్మాణానికి పూనుకోటానికి సిద్ధమయ్యే ఆస్కారం చాల ఉంది. అందుచేత ముందు ముందు ప్రభుత్వ ధనసహాయం లేకుండానే, ఈ జాతీయసంఘం చిత్రాలను తయారు చేసుకోగలుగుతుంది. అయితే ప్రభుత్వ విద్యాశ్రమం త్రివర్గ సహకారంతోటి, సంఘం పనిచేస్తూ ఉంటుంది. వీరుతీసిన చిత్రాలను ఒక కేంద్ర గ్రంథాలయంలో భద్రపరుస్తూ ఉంటారు. రానురాను స్థానిక గ్రంథాలయాలు కూడా ఈ చిత్రాల కాపీలను భద్రపరుస్తాయని ఆశించవచ్చును.

ఈ ప్రణాళికకు తోడ్పాటుగా, ఈ లోపుగానే, ప్రభుత్వ ప్రచురణ కేంద్ర కార్యాలయపు, ఫిలింశాఖవారు, విద్యాశాఖవారి కోరికపై, ఇల్లాంటి విద్యాబోధకచిత్రాలు తీయటంలో చాలా ప్రయోగాలు చేసి చూచారు. అల్లా తీసిన చిత్రాలలోకల్లా, "ఆర్కెస్ట్రాలోని జంత్రవాయిద్యాలు" అనే చిత్రం అన్నిటికన్నా మిన్నయైనదనే చెప్పవచ్చును. అసలీ చిత్రం తీయటంలో ఉద్దేశం పిల్లలకోసమనే అయినా, ఈ చిత్రాన్ని అమెరికాలోనూ, యూరపియన్ దేశాలలోనూ, చాలామంది వయోజనులే అధికంగా ఆనందించి వీటిపట్ల కుతూహలం చూపించగలిగారు. చిత్రం తీయటంలో కూడా, బెంజమిన్ బ్రిట్టెన్ అనే సంగీతకారుడు రచించిన రాగమాలికలో, ఒక్కొక్క జంత్రంతో వరుసగా వాద్యము నడుపుతూ, సమిష్టిగా అన్ని వాయిద్యాలలోనూ ఈ జంత్రవాయిద్యం ఎల్లా మేళవిస్తుందీ, చూపిస్తూ, మొత్తమంతా ఒక పాట కచ్చేరీలాగా, చక్కగా ఆనందించేందుకు వీలుగా చిత్రాన్ని చాలా చక్కగా తీశారు. చక్కని ఛాయాగ్రహణము, శబ్దగ్రహణమూ, తోడై, మేలిరకపు చిత్రంగా ఈ డాక్యుమెంటరీ చిత్రానికి స్థానమిచ్చాయి.



సువర్ణలతా పిక్చర్స్‌వారి 'సువర్ణమాల'లో నాయిక బాలసరస్వతి

"మనం ఎల్లా వినగలుగుతున్నాం అనే ఒక చిత్రంలో, చెవి చేసే పని, శబ్దగ్రహణవిధానము విపులీకరించి చూపారు. "జంత్రవాయిద్యాలు, వివిధ స్వరాలనూ ఏ విధంగా పలుకుతాయో" ఇంకో చిత్రం విశదీకరించింది.

ఈ మాదిరిగా తీసిన చిత్రాలలో, "చరిత్ర ప్రసిద్ధమైన ఇళ్ళు" అని ఒక ఇన్ఫర్మేషన్ చిత్రం తీశారు. ఇంగ్లండులోని శిల్పప్రాశస్త్యము - ఇంగ్లండులోని అందమైన గృహశిల్పాలు, అన్నీ బహుచక్కని ఛాయాగ్రహణ విధానంలో తీయటంవలన, ఈ చిత్రం కూడా ప్రశస్తికి వచ్చింది.

"చరిత్ర మొదలు" అన్న చిత్రంలో, రోమనులు బ్రిటను జయించటానికి పూర్వపు బ్రిటను స్వరూపము, కార్న్‌వాల్‌లోని, రాతి, ఇనుపయుగాలనాటి, కోటకట్టలు, స్టోన్ హెంజ్ లోని డ్రూయిడ్ ప్రాచీన శిథిలాలు, రాతియుగంనాటి, మనుజుడు రాతిపనిముట్లు చేసిన విధానాలూ, అన్నీ చక్కగా చూపించారు.

ఇంగ్లండులో నానావిధ పరిశ్రమల పుట్టుపూర్వోత్తరాలు, భాష, లిపి, వీటి ప్రథమ స్వరూపాలు, అచ్చాఫీసు ఎల్లావచ్చిందీ-ఇత్యాదులన్నీ చిత్రవిషయాలుగా తీసికొని, విద్యాబోధక చిత్రాలు తీశారు.

ఈ ఫిల్ములు ఒక్కొక్కదానితోపాటు, ఉపాధ్యాయుని వివరణలూ, కావలసిన చిత్రపటాలూ, బొమ్మమోడలులూ, అన్నీ కలిపి ఒక్కొక్కయూనిట్‌గా ఫిల్మువిడుదల చేస్తారు.

ఇల్లాంటి పూర్తియూనిట్ల ఫిల్ముసెట్లు, ఒక్కొక్క ఫిల్ముకు ఇరవై చొప్పున తీసి, ఇరవై విద్యాకేంద్రాలను ఏరి అక్కడి విద్యార్థులపై ఈ చిత్రాల ప్రభావమెల్లా ఉందో, పరిశుగా గమనిస్తారు. దాన్ని బట్టి, ఏమన్నా మార్పులు చేసుకోవలసి ఉంటుందో, చిత్రాలకు తీసుకొనే విషయాలు అవే ఉండాలో, వేరే ఏదైనా ఉండాలో అన్న విషయాలు గమనించుకొంటూ, మార్పులవసరమైనచోట మారుస్తూ ఉంటారు.

ఇవన్నీ, ఈ కృషి అంతా, ఇంకా చాలా ప్రాథమికస్థితిలోనే ఉంది. పరిపుష్టంగా ఇవి తయారయి సంపూర్ణ అవకాశం గల్గించుకొనేందుకు ఇంకా పది ఏళ్ళయినా పట్టవచ్చు. ఉపాధ్యాయులు కూడా, ఈ విధానంలో బోధించటానికి అలవాటుపడాల్సి ఉంటుంది. పిల్లలూ, ఉపాధ్యాయులూ కూడా ఈ పద్ధతికి చాలా ఉత్సాహమే చూపిస్తున్నారు.

ఇల్లాంటి ప్రదర్శన విద్యాబోధక యూనిట్లను ప్రతిస్కూలులోనూ ప్రవేశపెట్టవలెనని జాతీయ సంఘము సిఫార్సు చేసింది. ఈ యూనిట్‌లో సౌండు ఫిలిం ప్రొజెక్టరు, సైలెంటు ఫిలిం ప్రొజెక్టరు, ఫిలిం ముక్కలను ప్రదర్శించు యంత్రము, మాజిక్ లాంతరు, ఎపిడైయాస్కోప్ మైక్రో ప్రొజెక్టరు—ఇత్యాది యంత్ర పరికరాలన్నీ ఉంటాయి.

ఆధునిక జీవితంలో సినిమాల కున్న అమిత ప్రచార ప్రభావాన్ని సద్వినియోగం చేసుకొని విద్యాప్రచారానికి, విషయ విజ్ఞానానికీ ఉపయోగిస్తే, విద్యాబోధ సుకర మౌతుం దన్న విషయం ప్రభుత్వాలు గుర్తిస్తున్నాయి.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

మన దేశములో నీటి పారుదల సౌకర్యముల అభివృద్ధి

అధికాహారోత్పత్తి జయప్రదముగా సాగుటకు నీటి పారుదల సౌకర్యములు త్వరలో అభివృద్ధి చేయవలసిన అవసరమును భారత ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వములు గుర్తించినవి. దీర్ఘ కాలములో, నీటిపారుదల సౌకర్యములను వృద్ధిచేయు పెద్ద ప్రాజెక్టు లనేకములు తలపెట్టబడి యున్నవి. వానివలన వెంటనే ఫలితమేమియు కనిపించదు. స్వల్పకాలములో, ఒకటి రెండు సంవత్సరములలో, పూర్తియగు ప్రాజెక్టులే మనకు వెంటనే ఫలితములను చూపించగలుగును. మన దేశములో ఆహారపు కొరతను తగ్గించుటకు, విదేశములనుండి ఆహారపదార్థముల దిగుమతి తగ్గించుటకు, వెంటనే అధికాహారోత్పత్తి జరుగవలెను. అందుకు వెంటనే ఫలితముల చూపించు నిర్మాణ కార్యక్రమమే అవసరము. గొట్టపు బావులు మైనర్ ప్రాజెక్టులు త్వరలో నిర్మాణమయి, వెంటనే అదనపు భూమిని సాగులోనికి తీసుకొనివచ్చుటకు ఉపకరించును. ఈ కార్యక్రమమును ప్రోత్సహించుటే మనప్రభుత్వముల ప్రస్తుత విధానము. దేశములోని వివిధ ప్రాంతములలో వీలైనంత త్వరలో 6 వేల గొట్టపు బావులను త్రవ్వించవలెనని భారత ప్రభుత్వము సంకల్పించినది. ఈ బావులు త్రవ్వుటకు కావలసిన (బోరింగ్) సామగ్రి, ఆపైన నీరు తోడుటకు కావలసిన విద్యుచ్ఛక్తి, సరఫరా చేయటమే ప్రస్తుతము సమస్యగా యున్నవి. ఇవి ఎంత ఎక్కువగా, ఎంత త్వరగా లభించిన పని అంతచురుకుగా సాగును. నీటిపారుదల సౌకర్యముల అభివృద్ధికి వివిధ రాష్ట్రములలోను ఇప్పుడు జరుగుచున్న నిర్మాణాత్మక కృషి, స్థూలముగా ఈ క్రింద వివరింపబడినది.

బీహార్

బీహార్‌లో ప్రస్తుతము 134 గొట్టపు బావులున్నవి; మరి 250 గొట్టపు బావులు త్రవ్వుటకు 'ప్లాను' లు సిద్ధముగానున్నవి. దామోదర్ లోయ కార్పొరేషన్ స్కీముప్రకారము దామోదర్ నది, దాని ఉపనదులపై 8 డాములను కట్టుటకు నిర్ణయమైనది. ఈడాములన్నియు బీహార్ రాష్ట్రములోనే వుండును. దామోదర్ లోయ కార్పొరేషన్ అధ్యక్షుడుగా శ్రీ యస్. ఎన్. మజుందార్ గారిని, సభ్యులుగా ప్రొఫెసర్ గుహా, శ్రీ పూర్ణచంద్రా గారలను, కార్యదర్శిగా డా. సుధీర్ సేన్ గారిని కేంద్రప్రభుత్వం నియమించెను. డా. సేన్ గారు అమెరికా వెళ్ళి, టెనెస్సీలోయ కార్పొరేషన్ కార్యకలాపములను పరిశీలించి వచ్చిరి. ఈ స్కీము ప్రకారము నిర్మింపబడు 8 డాములలో, తిలయా, కోనార్ డాములు ఈ సంవత్సరం నిర్మాణంలో వున్నవి. పంచత్, మైదన్ డాములు వచ్చే సంవత్సరం ప్రారంభిస్తారు. తిలయా డాము నిర్మాణానికి 'టెండర్లు' కోరబడినవి. సెప్టెంబరు నెలలో పని ప్రారంభమగునని ఆశిస్తున్నారు. బర్లాారానది కట్టవలసిన మైదన్ డాము, దామోదర్ నదిపై కట్టవలసిన పంచత్ డాము ఈ స్కీములో కెల్ల పెద్దవి. వీని నిర్మాణము ఒక ప్రఖ్యాత అమెరికన్ కంపెనీకి అప్పజెప్పబడును. బైసలోతన్‌కు 10 మైళ్ళ దూరములో, నేపాల్ భూభాగములో గండకనదిపై ఒక ఆనకట్టకట్టి, చంపారన్, శరణ్ జిల్లాలకు నీరు పారుదల చేయవలెనని బీహార్ ప్రభుత్వము ఆలోచించుచున్నది. ఈ ఆనకట్ట నిర్మాణ విషయమున నేపాల్ ప్రభుత్వముతో సంప్రదింపులు జరుపుటకు ఒక ప్రతినిధి వర్గము త్వరలో నేపాల్ వెళ్ళును. సాకరేనదిపైనపారావద్ద ఒక కాలువను త్రవ్వి, మాంఘీర్ జిల్లాలో 50 వేల ఎకరములకు జలాధారము కల్పించవలెనని కూడా ప్రభుత్వము ఆలోచించుచున్నది.

యు. పి.

యు. పి. లో ఇప్పుడు 2100 గొట్టపు బావులున్నవి. విద్యుచ్ఛక్తి సరఫరా అగునని తోచినంతనే మరొక 750 గొట్టపు బావులు త్రవ్వుటకు అంతయు సిద్ధముగానున్నది. బొంబాయి నుండి గొట్టపు సామానులను ముందుగా జేరవేయుటకు ఏర్పాట్లు చేసిరి. దాదాపు ఒక కోటి రూపాయలు ఖరీదగు విద్యుచ్ఛక్తి-ఉత్పత్తి యంత్రములకు ఆర్డర్లు ఇచ్చినారు.

క్రొత్తడాములు, ఆనకట్టలు కట్టుటద్వారా గాక, ఇప్పుడున్న, వాటివద్ద క్రొత్త కాలువలు త్రవ్వుట వలన అదనపు భూమికి నీటిని సరఫరా చేయవలెనని తలంచుచున్నారు 750 మైళ్ళ నిడివిగల క్రొత్తకాలువలను త్రవ్వి, ఐదేండ్లలో, దాదాపు 17 లక్షల ఎకరములకు నీటిని సరఫరా చేయుటకు ప్రణాళిక ఏర్పాటు చేయబడెను. ప్రస్తుతము యు. పి. లో 18 వేల మైళ్ళపొడుగు కాలువలున్నవి. వీనిద్వారా దాదాపు 61 లక్షల ఎకరములు సాగుబడి జరుగుచున్నవి. యు. పి. తూర్పు జిల్లాలలో చెరువులే జలాధారములు. ఈ ప్రాంతములో చెరువులకు కట్టలు వేయించుట, లోతు త్రవ్వించుట మొదలగు కార్యక్రమము ప్రారంభించిరి.

సి. పి., బీరార్

నర్మ, తపతీనదులు వర్షాకాలమున మంచి వడిగా ప్రవహించుచుండును. ఆ నదులపై ఆనకట్టలు కట్టినచో వ్యవసాయమునకు, విద్యుచ్ఛక్తి-ఉత్పత్తికి కూడా ఉపయోగపడగలవు ఈ ఆనకట్టలు సి. పి ప్రభుత్వము, బొంబాయి ప్రభుత్వము కలసి నిర్వహించవలసి యుండును. ఇక్కడ తలపెట్టబడిన ప్రాజెక్టులలో ముఖ్యమైనది వైనగంగ ప్రాజెక్టు ఈ ప్రాజెక్టు స్కీము ఈమధ్యనే కేంద్రప్రభుత్వము ఆమోదించెను. నాగపూర్‌కు 90 మైళ్ళ దూరముననున్న దేవల్‌గాం వద్ద, 50 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఒక ఆనకట్ట కట్టుటకు నిర్ణయమైనది. ఇక్కడ డాము 154 అడుగుల ఎత్తు వుండునట. ఈ ప్రాజెక్టు నిర్మాణము పూర్తి అయిన తర్వాత గోదావరినదిపై నున్న ఇంచనపల్లివద్ద రెండున్నర లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయ వీలగును.

బావులు త్రవ్వుటకు, బావికొక్కంటికి వెయ్యిరూపాయల చొప్పున ఋణమిచ్చి, రెండు సంవత్సరముల తరువాతనుండి, సంవత్సరమునకు 200 రూపాయలచొప్పున దానిని రాబట్టుకొనుటకు ఒక స్కీమును తయారు చేసిరి. ఈ స్కీము ప్రకారం త్రవ్విన ప్రతిబావికి రెండువందల రూపాయలు సబ్సిడీ యివ్వబడును.

మద్రాసు

తుంగభద్రాప్రాజెక్టు నిర్మాణము సాగుచున్నది. హైదరాబాదు ప్రభుత్వము నిర్వహించవలసిన కార్యక్రమము వెనుకపడి వున్నది. మద్రాసుప్రభుత్వపు వంతు డాము 1951 వ సం. నాటికి పూర్తియగును. ఈ ప్రాజెక్టుకు కావలసిన యంత్రసామగ్రికి అమెరికాలో ఆర్డర్లు ఇవ్వబడెను. ఓవర్ సీర్లు మొదలగు నిపుణులు కావలసినంతమంది ఇక్కడకు పంపబడుచున్నారు.

రామపాదసాగర ప్రాజెక్టును గురించి ప్రథమ విచారణ ఇంకా పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణము దాదాపు 10 సంవత్సరములు పట్టును. ఇందుకు నిపుణులు, యంత్రములు కూడ అమెరికానుండి తెప్పించుకొనవలసి యుండును.

అధికాహారోత్పత్తి కార్యక్రమములో బావులకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయుట చురుకుగా జరుగుచున్నది. ఇప్పటికి దాదాపు 6 వేల నూతులకు విద్యుచ్ఛక్తి పంప్ సెట్లు అమర్చబడినవి. మరొక 450 నూతులకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయుటకుతగు ఏర్పాట్లన్నియు విద్యుచ్ఛక్తి శాఖవారు పూర్తిచేసిరి. ఒక పంచవర్ష ప్రణాళిక పూర్వము వ్యవసాయమునకు విద్యుచ్ఛక్తి సరఫరాచేయుటకు 15 కోట్ల రూపాయలు ఖర్చు చేయుటకు ప్రభుత్వము నిశ్చయించెను. బావులకు సబ్సిడీనిచ్చు విధానము మరొక సంవత్సర కాలమువరకు పొడిగించిరి. ఈ స్కీము ప్రకారం బావికి 300-500 రూపాయలవరకు సబ్సిడీ ఇచ్చెదరు.

మద్రాసు ప్రభుత్వ నీటిపారుదల స్కీములన్నియు మూడు విభాగములుగా విభజింపవచ్చును. 1. స్వల్పకాలపు స్కీములు. వీనిద్వారా 3 లక్షల 70 వేల ఎకరముల భూమి సాగగును. వీనికి ఖర్చు 5 కోట్ల రూపాయలగును. 2. మధ్యకాలపు స్కీములు. వీనిద్వారా 4 లక్షల 90 వేల ఎకరములు సాగగును. వీనికి ఖర్చు 30 కోట్ల రూపాలగును. 3 దీర్ఘకాలపు స్కీములు. వీనిద్వారా 30 లక్షల ఎకరములు సాగగును. వీనికి ఖర్చు 78 కోట్ల రూపాయలగును.

మైసూర్

హెగ్గదేవనకోట తాలూకాలో సార్గార్‌కు 27 మైళ్ళదూరములో 71 లక్షల రూపాయలు ఖర్చుతో ఒక ప్రాజెక్టు కట్టనున్నారు. దీనిద్వారా నంజన్‌గూడ్ తాలూకాలో 20 వేల ఎకరములు సాగగును. నూగు నదిపై నిర్మింపబడనున్న ఈ ప్రాజెక్టు మూడేండ్లలో పూర్తియగును. దీని నిర్మాణము అప్పుడే ప్రారంభమైనది.

దేశ ఆహారపరిస్థితి

ఆహార పదార్థాలపై కంట్రోలు తొలగించిన తర్వాత అన్నిరాష్ట్రాలలోను ధాన్యాలధరలు పెరిగినవి. ఈమధ్య నూర్పిడి అయిన రెండవ పంట ధాన్యం అనుకున్నంతగా మార్కెట్‌లో అమ్మకానికి రాలేదు. అయినా అన్నిరాష్ట్రాలలోను ఆహారధాన్యాల నిలువలు తగినంతగా వున్నవి; రాష్ట్ర ప్రభుత్వాలు చౌక డిపోలు స్థాపిస్తున్నవి. ధరల సంగతి మినహాయిస్తే, దేశ ఆహారపరిస్థితి బాగానే వుందని చెప్పాలి.

తూర్పు పంజాబులో రెండవపంట కొంచెం ఆలస్యంగా కోతకు వచ్చింది. పంట బాగానే వుంది కాని ధాన్యం ఎక్కువగా రాష్ట్రంనుంచి బయటకు దొంగరవాణా జరిగిపోయింది. మార్కెట్‌లో అమ్మకానికి ధాన్యం అనుకున్నంతగా రాలేదు. ఇతర వస్తువులన్నిటికి ధరలు పెరిగినవి కాబట్టి ఇంకా కొంతకాలం వేచివుంటే ధాన్యంధర కూడా పెరగవచ్చుననే ఆశతో చాలమంది రైతులు ధాన్యం అమ్మటం లేదు. యు. పి. రాష్ట్రంలో కూడా పరిస్థితి ఇదే విధంగా వుంది. అందువలన, ఈ రెండు రాష్ట్రాలలోను, రెండ పంట నూర్పిడి అయినప్పటికి ధాన్యాల ధరలు తగ్గలేదు సరిగదా, పెరుగుతున్నాయి. తూర్పు పంజాబ్‌లో ఉలవలు మణుగు రూ 7-8-0 నుంచి రూ 8-4-0 వరకు అమ్ముతున్నాయి. బార్లీ ధర మణుగు ఒకటికి ఏడు రూపాయలు, గోధుమల ధర మణుగు ఒకటికి రూ 12-0-0 నుంచి 13-8-0 వరకు వున్నది. యు. పి. లో ధరలు ఇంతకన్న కొంచెం హెచ్చుగానే వున్నాయి. దేశంలో కల్లా తూర్పు పంజాబులోనే ధరలు తక్కువ.


పశ్చిమ బెంగాలులో బియ్యం మణుగు ఒకటికి రూ 14 నుండి, రూ 22 వరకు అమ్ముతున్నది. ఇక్కడ సేకరణ సంతృప్తికరంగానే జరుగుచున్నది. 1948 వ సం. ప్రారంభమైనప్పటి నుండి జూన్ నెల వరకు దాదాపు 3 లక్షల టన్నుల బియ్యం సేకరింపబడెను. ఒరిస్సాలో బియ్యం ధర మణుగు ఒకటికి రూ 9-8-0 నుండి రూ 13-8-0 వరకు వున్నది. ఈ రాష్ట్రంలో కూడా సేకరణ సంతృప్తికరంగానే వుంది. బీహార్‌లో బియ్యం ధర మణుగు ఒకటికి. రూ 16 నుండి 24 వరకు వున్నది. సేకరణ సంతృప్తికరంగా లేనందువలన, కేంద్ర ప్రభుత్వం 20 వేలటన్నుల బియ్యం పంపించి, రేషనింగ్ ఏర్పాట్లు కొనసాగిస్తున్నది.

మనదేశములో మిగులుబడి రాష్ట్రాలలో సి. పి. ముఖ్యమైనది. ఇచ్చట ఈ సంవత్సరం పంటలు బాగానే పండినవి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి నిషేధాలను తొలగిస్తే, ధాన్యం ధర పెరగవచ్చునను ఆశతో రైతులు, వ్యాపారస్థులు ధాన్యం అమ్మకుండా వున్నారు. రవాణా నిషేధాలు తొలగించ బోవటం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యనే ప్రకటించింది. వ్యాపారస్థుల వద్దనున్న నిలువలలో నూటికి 40 వంతులు అడిగినప్పుడు ప్రభుత్వానికి వశపరచవలెనన్న నిబంధన ఈ మధ్య సి. పి. లో జేరిన సంస్థానాలకు కూడా వర్తింపజేశారు. రాష్ట్రంలో చాలా చోట్ల చౌకడిపోలు ఏర్పాటుచేశారు.

దక్షిణ భారతదేశము, బొంబాయిలలో ధాన్యం ధర పెరగడం తప్ప, ఆహారపరిస్థితిలో చెప్పదగ్గ మార్పేమీ లేదు. బొంబాయిలో బియ్యం మణుగు ఒకటికి 30-40 రూపాయలు అమ్ముతున్నవి. మద్రాసు రాష్ట్రంలోని కొరత జిల్లాలలో బియ్యం మణుగు 20, 30 రూపాయలకు దొరుకుతున్నవి. ఈ కొరత ప్రాంతాలలో సప్లయిలు తగ్గిపోయి, ధరలు అదుపు తప్పిపోకుండా కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం 'కోటాదిగుమతి' ధాన్యాన్ని ముందుగానే అందజేస్తున్నది. ఈ సంవత్సరం మద్రాసు రాష్ట్రానికి మొత్తం 5 లక్షల టన్నులు సరఫరా చేయాలని మొదట్లో నిర్ణయమైంది. మే నెలాఖరుకే 3 లక్షల టన్నులు కేంద్ర ప్రభుత్వం నుండి సరఫరా అయినవి. అలాగే బొంబాయి రాష్ట్రానికి కూడా, సంవత్సరమునకు యివ్వవలెనని మొదట అనుకున్న $5\frac{1}{2}$ లక్షల టన్నులలో నూటికి 72 వంతులు అప్పుడే సరఫరా చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వాలు చౌకడిపోలు అవుసరమైన చోట్లల్లా ఏర్పాటు చేస్తున్నవి. ఇదివరకు రేషనింగు వున్న అన్నిప్రాంతాలలోను ప్రజలు, అడిగేవరకు వూరుకోక, ముందుగానే చౌక డిపోలు స్థాపించవలసిందని మద్రాసు ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. మద్రాసురాష్ట్రములో ఇప్పుడు 3710 చౌక డిపోలున్నాయి. వీటిలో 10 ఔన్సుల చొప్పున రేషన్ ఇస్తారు. వీలైతే ఇతరత్రా కూడా కొనుక్కోవటానికి ఏ అభ్యంతరమూ లేదు. బొంబాయి రాష్ట్రములో ఇప్పటికి 500 చౌకడిపోలు పనిచేస్తున్నవి. సౌరాష్ట్రంలో ఈ మధ్యనే 150 చౌక డిపోలు ఏర్పాటు చేశారు.

వివిధ రాష్ట్రాలలోను ధాన్యం నిలువలు మే మాసాంతంలో ఈ సంవత్సరారంభంలోకన్నా చాల సంతృప్తికరంగా వున్న సంగతి ఈ క్రింది పట్టిక వల్ల ధ్రువపడుతున్నది.

రాష్ట్రం.	1948 జనవరి ఆరంభంలో ఆహారనిలువలు.	1948 మే నెల మూడవవారంలో ఆహారనిలువలు.
	టన్నులు	టన్నులు
బొంబాయి	107,668	242,525
బీహార్	17,991	35,104
పశ్చిమ బెంగాల్	55,400	167,800
మద్రాసు	199,631	512,827
తిరువాన్కూరు	8,411	50,843
కొచ్చిన్	11,009	20,955



పులికోట సరస్సు

(13-వ పేజీ తరువాయి)

మయ్యాము. ఈ సారి లాంచికి పడవను కట్టి నీళ్లు లోతుగా ఉన్నందున లాంచిని పనిచేయించి శ్రీహరికోట చేరాం. బకింగ్‌హాం కాల్వలో డింగీలోకి మారి 11 గం.లకు కొత్తచేను, చేరుకున్నాము. అది అడవిప్రాంతం. ప్రస్తుతం చెన్నపట్నానికి కావలసిన వంటచెరుకులో నెలకు వెయ్యిటన్నుల చొప్పున శ్రీహరికోటే సప్లయిచేస్తోంది. ఇక్కడ అరకోటి లింగాలు సముద్రగర్భంలోనూ, పైకూడా కనిపిస్తూన్నందున అరకోటి భ్రష్టమై క్రమేణా కోటి కోటగా మారింది. ఈ ప్రాంతానికి వెలసిన రెడ్లు కొండవీటినుంచి వచ్చారట. ముష్కరులైన ఆనాటి తురుష్కుల ధాటి కోర్వలేక కులదేవత ఓంకారేశ్వరి ప్రేరణపై రక్షణప్రాంతాల నన్వేషించుకుంటూ వచ్చారు.

పూర్వోత్తరాలు

ఆ కొండవీటి పెద్దరెడ్డిగారికి స్వప్నంలో దేవి కనిపించి తనను బండిమీద దక్షిణంగా తీసుకుపోవలసిందనీ, బండి ఎక్కడ కుంటుబడి నిలిచిపోతే ఆ ప్రదేశాన తన్ను ప్రతిష్ఠించి వసతి ఏర్పరచుకోవలసిందనీ సెలవిచ్చిందట. ఆమేరకే ఆ రెడ్లు రాగారాగా శ్రీహరికోట చేరేసరికి బండి కుంటువడ్డది. అక్కడ దేవిని ప్రతిష్ఠించి, కోట కట్టుకొని ఆ ప్రభువులు చిరకాలం వాసం చేశారని ప్రాంతీయులు చెప్పారు. కోటదిబ్బలు, లింగాలు అక్కడక్కడ ఇప్పటికీ గోచరిస్తున్నాయి. శ్రీహరికోటదీవులు 40 మైళ్ల పొడవు, అయిదారు మైళ్ల వెడల్పుగా ప్రళయకావేరికి, సముద్రానికిమధ్య ఉన్నవి. బకింగ్‌హాం కాల్వ ఈ దీవితక్కనుంచే పోతూ, ఇక్కడ అడవుల్లోని కట్టెల్ని పట్నానికి చేరవెయ్యటానికి ఉపకరిస్తోంది. ఇప్పుడు సరుకుతోటలున్న భూములు ఒకప్పుడు సుక్షేత్రములై, సస్యశ్యామలములై విలసిల్లినవి. ఇప్పుడు ఉన్న సరుకుతోటలు కూడా వానలు సరిగా లేక 8 ఏండ్లు పెరగవలసినవి మూడేళ్ళు పెరిగేసరికే నరికేస్తున్నారు.

ప్రస్తుత స్థితి

శ్రీహరికోట సూళూరుపేట తాలూకా హెడ్‌క్వార్టర్సుగా ఉండేది. ంరెడు పాఠశాలలూ. ఆసుపత్రీ ఉండేవి. దండిగా జనం ఉండేవాళ్ళు. ఇప్పుడు పైవేరియా మలేరియా వ్యాధులకు భయావహములై జనం లేచిపోయినందున ఊరు నిర్మానుష్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైద్యుడికిగూడా రోగభయమేనా అన్న సామెత ఇక్కడ సార్థకమైనది. వైద్యుడు ఒక్కడూకూడా కాలు నిలదొక్కుకొని ఉండనందున చాలకాలం ఈ ఆసుపత్రి మూతపడే ఉంటోంది.

నివారణ మార్గం

ఈ ప్రాంతాన 16 పేటలు ఉన్నవి. రెండు ప్రదేశాల్లో తప్ప మిగతా చోట్ల వ్యాధులు హెచ్చు. అందువల్ల మంచి నీళ్ళు ఉన్న రెండు చోట్ల ఈ ద్వీపంపై ఉన్న అయిదారు వేల జనాభాను పంచితే ద్వీపం బాగుపడుతుందని అనుభవజ్ఞుల సలహా. అడవిలోకి 13 మైళ్ళు ట్రక్కులు వెళ్లటానికి ఇనుప పట్టాలు వేశారు. దివిటీ వేసి వెతికినా మచ్చుకుకూడా ఒక్క ఆరోగ్యవంతమైన ముఖమూ కనిపించదు. రెండు కాళ్ళూ రెండు చేతులూ బోద ఉన్నవాళ్ళు ఉన్నారంటే వ్యాధుల తీవ్రత ఊహించుకోవచ్చు. కొత్తచేనుకు ఒకవైపు పొట్టలు పెరిగినవాళ్లు, మరోవైపు బోదలుఉన్నవాళ్లు ఉన్నారు. అడవుల కంట్రాక్టర్లు కార్మికులకు ఏదో స్వప్రయోజనార్థం కొన్ని సౌకర్యాలు చేశారు.

సౌకర్యాలు

ఇక్కడ జనానికి కావలసింది మంచినీరు, అన్నం, వైద్యం, రహదార్లు. చక్కని భూముల సాగుచేసుకుంటే అన్నానికి కరువు ఉండదు. ఇక వైద్యము సంగతి భారత ప్రభుత్వ పరిశోధనా ప్రవీణులు మశ్చికముల పట్టి మలేరియాకుశప్రక్రియనన్వేషిస్తున్నారు. నిజంగా ఇది కనిపెడితే ఈ దీవుల నందనవనములుగా చేయవచ్చు కాని అది ఎన్నటికో!

“ఇక స్వరాజ్యం వచ్చింది. మన కష్టాలు తీరగలవు” అని ప్రజలునోరు తెరచుకుని చూస్తున్నారు. ఫలికాట్ సరస్సులో నీళ్లమట్టం హెచ్చించి లాంచీలు, పెద్ద రహదారిబోట్లు నడిపించవచ్చు. పంటలు పెంచి స్వయంపోషకం చెయ్యవచ్చు. ఆసుపత్రి బాగా పని చేయించి ఆరోగ్యాన్ని బాగు చెయ్యవచ్చు. శ్రీహరికోటనుంచి ఆటకాని తిప్పమీదుగా సూళూరుపేటకు 7 మైళ్ళ కాలువ, 7 మైళ్ళ రోడ్డు కావాలని ప్రజలు కోరుతున్నారు. ఇంజనీర్లు సాధ్యము కాదంటున్నారు. రాకపోకల సౌకర్యము కల్గించి ద్వీపాలను బాగుచేస్తే చెన్నపట్నానికి సమీపంలో చక్కని విశ్రాంతి ద్వీపములు మూడు ఏర్పడగలవు. పెరటిచెట్టు మందుకు కొరగాదన్న సామెత మనకు ఈ ద్వీపాల సందర్భంలో కనిపించుచున్నది. ప్రభుత్వం, ప్రజలు పూనుకుని పనిచేస్తే ఈ మూడు ద్వీపాలు సుందరోద్యానవనాలు కాగలవు.

ఉద్ధరించాలి

ఈ ద్వీపములు ప్రాచీన కాలంలో ఎంత ప్రాభవమూ, ప్రాముఖ్యమూ కల్గివున్నప్పటికీ ఇవ్వాళ్లగా నిస్తేజంగా, నిర్వీర్యంగానూ ఉండిపోయి యించుమించు పరశురామ క్షేత్రాలుగా, అంతకన్న మిన్నగా వ్యాధిగ్రస్తాలుగాను ఉన్నా, మనవారెవ్వరూ వాటివంక కన్నెత్తిచూసిన పాపాన పోలేదు. ఈనాటి పాలనలో అయినా ప్రస్తుత ప్రభుత్వం కనువిప్పి కేవలము లోకోపకారబుద్ధితో అయినా ఈ ప్రాంతాన్ని ఉద్ధరించడం అతి అవసరం.

ప్రపంచంలో సర్వసాధారణంగా ఏదన్నా సుందరప్రదేశాన్ని సర్వజన విహార ప్రదేశంగా రమణీయంగా తయారుచేయాలంటే అందుకు సంబంధించిన మున్సిపాలిటీ దానికి పూనుకుంటుంది. ఆర్థికంగా ప్రభుత్వము ఆసరా ఇస్తుంది.

ఈ పరగణా విషయంలో గూడా ఇల్లా చెయ్యవచ్చు. ఇది నెల్లూరు జిల్లాలో భాగమే గనుక బాధ్యత నెల్లూరుజిల్లా బోర్డుది. జిల్లా బోర్డు తన బాధ్యతను విధిగా నిర్వర్తించేట్లు చూసే బాధ్యత ప్రభుత్వానిది. ఎవరు విస్మరించినా ఈ విషయంలో ప్రజానీకానికి, ప్రజాక్షేమ ఆరోగ్యాలకు భంగకారి అయినటువంటి మహాపరాధం చేసినవాళ్ళవుతారు. రాష్ట్రంలో ఇల్లా సముద్ధరించవలసిన ప్రదేశాలు ఇంకా ఎన్నో ఉండవచ్చును. కాని అల్లాగని చెప్పి ఇది తన తలకు మించిన పని అని నైరాశ్యంతో ప్రభుత్వం ఉపేక్షించదని నమ్మిన ప్రజల విశ్వాసం. ఈ దీవులను దర్శించివచ్చిన స్థానిక శాఖామంత్రులు, చంద్రమౌళిగారు ద్వీపముల విస్మరించలేదని, దీక్షతో పనిచేస్తారని ఆశించడములో ఆశ్చర్యం లేదు.

ఏకపత్నీత్వం

(10 వ పేజీ తరువాయి)

కీయని రారాజులు చరిత్రలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తున్నారు. ఎప్పుడైనా పురుషులు భార్యను గౌరవించినట్లు కనిపిస్తే అతనికి వారసులైన పుత్రులను ఉత్పత్తిచేసే యంత్రమనే భావంతో తప్ప వ్యక్తిగత ప్రణయం మూలకంగా గానీ, తన అర్థాంగి అనిగానీ కాదు. ఆడదాని పలమీద అధికారాన్ని ఆమెపరం చేసి భార్యను తృప్తి పరచినారు. అయితే ఆమె కంటి ముందే రాజవంశాలలోని పురుషులు వారిని ఉపపత్నులనుగా స్వీకరించి భోగిస్తుంటే ఆమెకు కిక్కురుమనే అధికారం లేదు. ప్రపంచంలో అన్ని జాతుల్లోనూ ఏకగామిత్వం (Monogam) ఇకే రీతిగా నడిచింది.

అంటే ఏకగామిత్వమనేది కేవలమూ స్త్రీజాతివిషయంలోనే నన్న మాట. పురుషునికి ఈ వైవాహిక విధానంలో అనంతమైన కామస్వేచ్ఛ ఉన్నదన్నమాట. అందుకనే ఒక తాత్వికుడు దీనిని ఏకపత్నీత్వమనటం కంటే ఏక పతిత్వమనటం యోగ్యమయినదన్నాడు. ఇది కారణంగా ‘జనానా’లు బయలు దేరినవి. వాటితో పురుష సంబంధాన్ని అరికట్టారు. అందు మూలంగా ఆత్మలింగ ప్రణయము (Homo-sexual Love) అభివృద్ధి అయినది. ఎన్ని విధాల నిర్బంధాలు కల్పించినా స్త్రీలు భర్తలను మోసగించి కామేచ్ఛ తీర్చుకోవటమూ, వ్యభిచరించటమూ జరుగుతూనే వస్తున్నది.

అందు మూలంగా ఏకపత్నీ వివాహానికిబానిసత్వము, వ్యభిచారమూ అనే రెండూ తప్పనిసరి ఐన ఉపాంగాలుగా ఉంటూ వచ్చినవి. ఈ విధానంలో సహజమైన అనురాగానికి స్థానం లేదు. ఆస్తి పాస్తులమీద ఆధారపడి ఉన్నది. ఏకపత్నీ వివాహానికీ మూలమైన అభిప్రాయములు—పురుషుని ఆధిక్యత, పురుష సంతానానికి వారసత్వపు హక్కు కలిగించటము, దేశాన్నీ, దేవతలనూ, పితరులనూ తరింపజేయుటమూ.

కార్మిక విధానాన ఆలోచిస్తే స్త్రీ పురుషుల సంతాన ఉత్పత్తి పోషణలకేవే మొదటి కర్మవిభాగాలు (Divisions of Labour). ఇవి ఏకపత్నీత్వ విధానం వల్ల ఏర్పడ్డవని మార్క్సు మహాశయుడు. జాతి వ్యతిరేక భావాలు (Class opposition) మొదట ఏక పత్నీత్వ విధానంలో స్త్రీ పురుష జాతులకు రెంటికీ జరిగిందని, అందులో స్త్రీ జాతి ఓడిపోయి బానిస జాతిగా పరిణమించిందని ఏంజల్సు మహాశయుడన్నాడు.

ఏక పత్నీ వివాహ విధానం అమలులోకి వచ్చిన తరువాత సంఘంలో అంతకు పూర్వం కనుపించని మరి రెండుజాతులు బయలు దేరినవి. ఏక పత్నీ విధానాన్ని అనుసరించి ఆర్థిక సంపత్తిని చూచిగాని, లేక ఇతర కారణాల మూలానగాని వివాహమాడి, ఆ భర్తలతో సుఖాన్ని అనుభవించలేక నిరంతరమూ హృదయమిచ్చి మోహించిన ప్రియులు ఒక జాతి. నిష్ప్రయోజకులూ నిరర్థకులూ దద్దమ్మలూ అయిన భర్తలు (Cuckold Husbanso) రెండవజాతివారు.

కన్యకా ప్రణయము (Pre-marital Love), వ్యభిచారము (Prostitutions) నాగరక జాతుల్లో తప్పని సరి ఐపోయినది. దీనికి కారణము నేటి ఏక పత్నీ వివాహ విధానము. వ్యభిచారమును ఎంత అరికట్టటానికి యత్నించినా నిష్ప్రయోజనమైంది. అయితే ప్రభుత్వాలు ఒక విషయం మాత్రం తేల్చి చెప్ప గలిగినవి. ఒక విషయము మాత్రమే. అది ‘వైవాహిక బంధం వల్ల కలిగిన సంతానానికి (బిడ్డకు) తండ్రి అయినవాడు మాత్రమే భర్త’ అని. మూడువేల సంవత్సరాలనుంచీ వస్తూ ఉన్న ఏక పత్నీ వివాహానికి తేలిన ఫలితాంశమిది.

కులాసా కబుర్లు

'పెళ్ళి-పెటాకులూ..'

శ్రీ జి. యన్. సూరి

రెండవ ప్రపంచ యుద్ధం అయినతరువాత ఇటీవల వేసిన జనాభా లెక్కల ప్రకారం జర్మనీలో ఇప్పుడు పురుషులకంటె స్త్రీలు అధికంగా ఉన్నారని తేలింది. దాదాపు ఒక మగవాడికి ముగ్గురు ఆడవాళ్ళు ఉన్నారట. అంటే ఒక మగవాడు ముగ్గురు ఆడవాళ్ళను కట్టుకున్నాడని అనుకోగూడదు. ఆ దేశంలో అవివాహితులంటూ లేకుండా ఉండాలంటే మగ జనాభా ఎక్కువగా ఉన్న దేశాలనుంచి కొంత సరకును దిగుమతి చేసుకోవాలి. లేదా, మిగులుసరకును ఇతర దేశాలకు ఎగుమతి చేయాలి. ఇవి రెండూ వీలుకాకపోతే ఒక్కొక్క పెళ్ళికొడుకుకు ముగ్గురేసి పెళ్ళికూతుళ్ళను అంటగట్టాలి. ఇంతకంటె వేరేమార్గం కనబడదు.

అయితే జర్మనీవాళ్ళు అనాదినుంచి జాతి కల్తీ కావటం సహించరు. పాట్లకు పారుగు గిట్టదన్నట్లు ఈ జాతివాళ్ళకు మరొక జాతివాళ్ళకు అసలే పొత్తు కుదరదు. అందువల్ల జనాభా ఎగుమతి దిగుమతులకు అవకాశం ఉండేటట్లు తోచదు. ఇక పోతే మూడవమార్గం ఒకటి మిగులుతుంది. అవివాహితలైన స్త్రీలు లేకుండా ఉండాలంటే ప్రస్తుతం బహుపత్నీత్వాన్ని జర్మనీ అవలంబించక తప్పేట్లు లేదు. కాని వారిమతం అందుకు అంగీకరించదు.

క్రైస్తవ న్యాయవిధానం ప్రకారం ఒకే సమయంలో ఒక భర్తకు ఒక్క భార్యకంటే ఉండేందుకు వీలులేదు. విడాకులు పుచ్చుకుంటే తప్ప దంపతులు ఫిరాయింపు చేసుకోటానికి చట్టం ఒప్పుకోదు. అందువల్ల ఆ దేశంలో ప్రతి స్త్రీకి పెండ్లి చేసుకునే అవకాశం దొరకాలంటే జంటలు శాశ్వతంగా ఉండిపోకుండా, ఏదో నిర్ణయించిన గడువు ప్రకారం విడిపోతూ, కొత్తజంటలు తయారుకావాలి. అట్లా కాగానే చీట్లపేక ముక్కలను కలిపివేసి పంచినట్లు స్త్రీ పురుషులను సర్దుబాటు చేయాలి. ఇందుకు సంఘం అంగీకరించదు.

క్రైస్తవుకు న్యాయబద్ధంగా ఒక్క భార్యను తప్ప ఏలుకోటానికి వీలులేదన్నాము. ఆవిధంగానే ముస్లిమయినవాడు నలుగురు భార్యల వరకూ శాస్త్రబద్ధంగా నిఖా చేసుకోవచ్చును. అదృష్టవశాత్తూ ఇప్పటివరకూ హిందువుడికి ఇల్లాంటిపరిమితి అంటూ లేదు. తాహతును బట్టి ఎందరినైనా చేసుకోవచ్చు. ఈ విషయంలో రికార్డు హోల్డరు శ్రీకృష్ణుడు. చేసుకుంటేనేమి, కట్టుకుంటేనేమి, పెట్టుకుంటేనేమి పదహారు వేల సంఖ్యను అందుకున్నాడు. సాధారణమైన వ్యక్తి ఈయనతో ఎంతమాత్రం పోటీ చేయలేడు. పోటీ చేయలేకపోగా సున్నాలు కొట్టివేసినా ఆ సంఖ్యను అందుకోలేడు. అందువల్లనే శ్రీకృష్ణుడిని భగవంతుడి అవతారమన్నారు. పదహారువేలమందికి భర్తకాగలిగినవాడు భగవంతుడు తప్ప మరెవ్వరుంటాడు!

మన పూర్వులు అసాధ్యులు. యుద్ధాలవల్ల, జర్మనీదేశంలో ఉన్న పరిస్థితి మనకు సంభవించకుండా ఎంతో దూరదృష్టితో బహుభార్యాత్వం ఒప్పుకున్నారు. భార్యలు ఒకటికి మించినందువల్ల వచ్చే కష్టాలను అనుభవించేవాడు భర్త తయారై యుండగా తక్కిన వాళ్లకు ఎందుకులే అని ఊరుకున్నారు ఆకాలపు చట్టనిర్మాణ ఋషులు. ఈ కాలపు శాసనాలను తయారుచేసేవాళ్ళు ఋషులు కాకపోవటంవల్ల దివ్యదృష్టి గాని, దూరదృష్టిగాని ఉంటుందనుకోటానికి వీలులేదు. అందువల్లనే వీరు ముందువెనుకలు ఆలోచించకుండా బహుపత్నీత్వాన్ని నిషేధించటానికి ప్రయత్నిస్తున్నారు. ఆఖరుకు, మనతో భాగాలు పంచుకుని విడిపోయిన ముస్లిం సోదరులకులాగే నలుగురివరకైనా ఉండవచ్చునంటే కొంతవరకు బాగుండేది. ఇదేదీ కాకుండా క్రైస్తవ న్యాయవిధానాన్ని అనుకరించబోతున్నారు. ఇంతకంటే అన్యాయం మరొకటి ఉంటుందా?

ఈమధ్య తయారుచేసిన జనాభాలెక్కలను పరిశీలించితే జర్మనీదేశానికి పట్టిన పరిస్థితి మన మద్రాసురాష్ట్రానికికూడ పట్టబోతున్నట్లు తెలియక మానదు. 1941 వ సంవత్సరాంతపు లెక్కల ప్రకారం ఈ రాజధాని మొత్తం జనాభా 4,93,41,810. వీరిలో పురుషులు 2,45,57,143; స్త్రీలు 2,47,84,667. ఇది ఇట్లా ఉండగా 1946 వ సంవత్సరపు మరణలెక్కల ప్రకారం పురుషుల మరణాలు 4,99 305; స్త్రీల మరణాలు 4,79,737. దీనినిబట్టి ఒక్క విషయం తేలుతుంది. ఇప్పటికే అధికంగా ఉన్న స్త్రీల సంఖ్య కొంతకాలానికి పురుషుల సంఖ్యకు రెట్టింపు అయ్యేట్లు కనబడుతుంది. ఈలోగా బహుపత్నీత్వ నిషేధశాసనం అమలులోకి వచ్చిందాంటే ఈవిషయంలో జర్మనీనికూడ మనం మించిపోవచ్చు. అయితే బహుభార్యాత్వంమాత్రం ఇందుకు ఇప్పుడు ఉపకరించేట్లు తోచదు.

అసలు ఒకరికి మించి భార్యలను కట్టుకున్నవారి సంఖ్య క్రమంగా ఆంధ్రదేశంలో తగ్గిపోతున్నది. శాసనం ఏమీ లేకుండానే పెళ్లిమీద పెళ్లి చేసుకోటానికి ఎవడో ఒక ఘటికుడు తప్ప సాహసించేవాళ్ళు అరుదైపోయినారు. ఒక సంసారాన్నే తిన్నగా నిభాయించలేని పరిస్థితులలో జములు కుటుంబాలను ఆడుకోటం అందరికీ అందుబాటులో ఉండే విషయం కాదు. నైజాములను, గయక్వార్లనూ తప్ప జనానాలు కుంగదీసిపారేస్తాయి. ఇన్నాళ్ళూ ఎక్కడైనా ఓడు సంతానంకోసం రెండోసారి పల్లకీ ఎక్కేవాడు. ఇప్పుడు సరదాకు ఎక్కుతున్నాడు. ఈలాంటివారిలో ముఖ్యులు సినిమా తారలను అంటగట్టుకున్నవాళ్ళు ఈ సందర్భంలో ఒక వింత గమనించాలి. ఇటీవల బహుపత్నీత్వ చట్టానికి మూలకారణమైన వివాహాలను పరీక్షించి చూస్తే రెండవభార్యగా ఉండేందుకు సిద్ధపడిన యువతులందరూ పెద్ద చదువులు చదివిన విదుషీమణులే అని తెలుస్తుంది. దీనికి ఆశ్చర్యపడవక్కరలేదు.

వరాన్వేషణ అంతకంతకూ కష్టసాధ్యం కావటమే ఈ వైపరీత్యానికి దారి తీసింది. ఒక పుష్కరం క్రిందటివరకూ ఈ అన్వేషణ విషయంలో తలిదండ్రులు అట్టే బాధపడవలసిన అగత్యం ఉండేదికాదు. కట్నం పైకం చేతిలో పుచ్చుకుని బయలుదేరితే ఏ హైస్కూలులోనో ఏ కాలేజీలోనో పిల్లవాడు దొరికేవాడు. వధూవరులకు ఇద్దరికీ బుద్ధి తెలియని వయసు కాబట్టి తల్లిదండ్రుల ఏర్పాట్లు నిర్విఘ్నంగా సాగిపోయేవి. బాధ్యత యావత్తూ పెద్దవాళ్ళమీదే ఉండేది. ఆ రోజులలో పెళ్ళికూతుళ్ళకు స్కూలు ఫైనలు చదివే కుఱ్ఱవాళ్లు సరిపోయేవాళ్లు. కాలేజీలో చదువుతున్న పెళ్ళికొడుకు దొరికితే ఘనంగా చెప్పుకునేవాళ్లు. అమ్మాయికి పన్నెండేళ్లు నిండకుండా మూడుముళ్ళూ పడేట్లు చూసి "అమ్మయ్య! బెడద వదలిందిరా" అని సంతోషించేవాళ్ళు తల్లిదండ్రులు. ఆ పైన కష్టసుఖాలు అమ్మాయివీ, అబ్బాయివీ.

ఆకాలం గతించిపోయింది. స్కూలుఫైనలు ప్యాసయిన తరువాతనేగాని పిల్లపెండ్లి సంగతి ఇప్పుడు ఎవరూ పట్టించుకోటంలేదు. అమ్మాయి స్కూలుఫైనలంటే అబ్బాయి కాలేజిచదువు ముగించిఉండవలసివచ్చింది. ఇక పెండ్లికూతురే కాలేజీలో చదవటం జరిగితే పెండ్లికొడుకు ఉద్యోగస్థుడు గావలసివచ్చింది. ఉద్యోగాలు, పెళ్ళికొడుకుల సంఖ్యకు సరిపోయేటట్లు పెరగకపోవటాన పెద్దచదువు చదివిన పిల్లలకు వరుళ్ళు దొరకటం కష్టమయింది. పెండ్లి అయేదాకా చదివించక తప్పటంలేదు. చదువు ఎక్కువైన కొద్దీ సంబంధాలకు కరువయింది.

అటు పూర్తిగా పూర్వాచారపరాయణులైనా ఇబ్బంది లేక; ఇటు నవనాగరికులైనా నష్టంలేదు. అటూ ఇటూ కాకపోవటాన ఎటూ కాకుండాపోతున్నది. యుక్తవయసు వచ్చిందాకా పెళ్లి చేయటం లేదుగాని ఎంత చదువుకున్న యువతులకైనా స్వయంగా వరుణ్ణి కుదుర్చుకునే అవకాశాన్నిమాత్రం పెద్దవాళ్ళు ఇప్పటికీ ఇవ్వటంలేదు. పూర్వం తుడుచుకోని రోజులలో పెళ్లిళ్లు జరిగినప్పుడు ఎటువంటి బాధ్యత వహించేవాళ్ళో, బుద్ధి తెలిసిన యువతుల పెండ్లి సందర్భంలోకూడ తల్లిదండ్రులు అదే బాధ్యతను నెత్తిమీద పెట్టుకుంటున్నారు. దీనివల్ల ఎవరికీ సుఖకరంగా ఉంటంలేదు.

ఆనాడు ఎంతో ఈనాడూ అంతే. వరుణ్ణి గురించి ఎవరో కవీశ్వరుడు చెప్పినట్లు, ఇప్పటికీ తండ్రి చదువు కావాలని, తల్లి భాగ్యం వుండాలని, పిల్ల అందం కావాలని, తదితరులు మంచి భోజనాలు కావాలని కోరుకుంటున్నారు. ఒకటి కుదిరితే ఒకటి కుదరదు. ఏది కుదిరినా కుదరకపోయినా డబ్బు విషయంమాత్రం తప్పనిసరి అవుతున్నది. అందువల్ల ఉన్న సందర్భాలలో అవకాశం కలుగచేసుకుని అమ్మాయి ఒక అబ్బాయిని వరించినా, తల్లిదండ్రులు 'వీటో' చేస్తారు. పోనీ దీటైన సంబంధం కుదర్చగలరా అంటే అదీ సులభంగా సాధ్యపడదు. ఈ విధంగా రోజులు గడిచిపోతాయి. చిట్టచివరకు ఏదో ఒక అతకతవక సంబంధం ముడిపెట్టటమో, పెట్టుకోటమో జరుగుతుంది.

అయితే ఈ గొడవను యావత్తూ సాధించేందుకు మార్గం ఏమైనా ఉన్నదా అనేది మరో విషయం. దానికి సమాధానం భగవంతుడికే తెలియాలి. ప్రపంచం ఎల్లకాలం ఒకే విధంగా నడవదు. పూర్వం ప్రతి చదువుకున్నవాడికీ ఉద్యోగం దొరికినట్లు ప్రతి పెళ్లికూతురికీ వరుడు దొరికేవాడు. ఇప్పుడు ఆవిధంగా ఉద్యోగాలూ దొరకటంలేదు! వరుళ్లూ ముడిబడటం లేదు. చదువుకున్న నిరుద్యోగులు, అవివాహిత యువతీ యువకులు ఈ కాలానికి తప్పని సరిఅయిన లక్షణాలు అని అనుకోవాలి. నాగరికత, ఆర్థి



వేనాడు గ్రామానికి వెంచేసిన స్థానికశాఖా మాత్యులగు గౌ॥ శ్రీకల్లూరి చంద్రమౌళిగారికి గ్రామస్థుల స్వాగతం.

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

"కాథెరీనా సర్గీవ్నా," ఆర్కాడీ చటుక్కున ప్రారంభించాడు, "నేను చెప్పే విషయాలు నీకు ఎల్లాతోచినా తోచవచ్చు. కాని నీతో చెప్పేస్తున్నాను. విన్నా నేను, మీ అక్కకంటేనే కాదు, ఈలోకంలో అందరువ్యక్తుల కంటేకూడా ఎక్కువగా భావిస్తున్నాను."

అతను లేచి తొందరగావెళ్లిపోయాడు—తను అన్నమాటలకు భయపడి పారిపోతున్నట్టుగా.

కాట్యా తన రెండుచేతుల్నీ బుట్టతోకూడా ఒడిలోకి జారవిడిచింది. ఆర్కాడీ వెళ్లిపోయిన వేపు తల వంచి చాలాసేపు చూస్తూకూర్చుంది. క్రమంగా ఆమెముఖంమీదికి రక్తవర్ణం పాకింది. కాని ఆమె పెదవులమీద చిరునవ్వు లేదు. చీకటిలాగ లోతయిన ఆమె కళ్లలో ఏదో ఆందోళనమాత్రం కనబడుతోంది. ఇంకేదో అస్పష్టమయిన భావంకూడా ఆ చూపుల్లో తళుక్కుమంది.

"నువ్వు ఒక్కతెవూ ఉన్నావే!" అనా సర్గీవ్నాగొంతుక ఆమెకు దగ్గరగా వినిపించింది. "ఆర్కాడీతోకూడా నువ్వు తోటలోకి వచ్చావనుకున్నాను."

కాట్యా మెల్లగా కళ్లు పైకెత్తి అక్కగారిని చూసింది. (ఆమె నాజూకుగా గొప్పగా అలంకరించుకుని, ఎత్తుగా ఉదాత్తంగా దారిలో నిలబడి, తెరిచిఉన్న గొడుగు కొసతో ఫిక్కీ చెవుల్లో కిచకిచలు పెడుతోంది.) కాట్యా మెల్లగా ఇంది. "మరే. నేను ఒక్కతెనే ఉన్నాను."

"అదే అంటున్నాను," ఆమె చిరునవ్వు నవ్వుతూ అంది, "అతను తన గదిలోకి వెళ్లాడనుకుంటాను."

"మరే."

"ఇద్దరూ కలసి ఏదన్నా చదువుతున్నారా?"

"మరే."

అనాసర్గీవ్నా కాట్యా చిరుగడ్డాన్ని చేత్తో పట్టుకుని పైకెత్తిచూసింది.

"మీ రిద్దరూ దెబ్బలాడుకోడంలేదుగదా?"

"లేదు," కాట్యా మెల్లగా అక్కగారి చెయ్యి తొలగించివేసింది.


"అంత మరీ గంభీరంగా సమాధానాలు చెపుతావేం? ఆతను ఇక్కడ ఉంటాడనుకున్నాను. నాతో షికారుకి రమ్మందామనుకున్నాను. అతను అస్తమానం నన్నడుగుతున్నాడు. పట్టణన్నించి నీకు జోళ్లు పట్టుకొచ్చారు. వెళ్లిచూసుకో. నిన్ననేచూశాను. నీ పాతజోళ్లు పూర్తిగా పాడయిపోయాయి. నీ కసలు శ్రద్ధలేదు. చక్కని పాదాలు నీవి. నీచేతులుకూడా చక్కనివే ......కొంచెం పొడుగ్గా ఉన్నాగాని. నీపాదాలకి సరిపడే చక్కని జోళ్లు ఏరుకోవాలి నువ్వు. కాని నీకెక్కడా అందంగా అలంకరించుకోవాలన్న కోరికే లేదు."

అనాసర్గీవ్నా దారివెంట కొంతదూరం నడిచి వెళ్లింది. అతిసుందరమయిన ఆమె పట్టు దుస్తు బిరబిరలాడింది. కాట్యా పచ్చికమీదినించి లేచింది, హేన్ పుస్తకాన్ని చేత్తో పట్టుకుని ఆమెకూడా వెళ్లిపోయింది - కాని జోళ్లు తొడుక్కుని చూసుకోడానికి కాదు.

"చక్కని చిన్నపాదాలు," అనుకుంది ఆమె

(22 వ పేజీ చూడుడు)

సాంఘికవ్యవస్థలు ఇప్పటిమాదిరి ఉన్నప్పుడు ఈ పరిస్థితిని తప్పించుకోటానికి వీలు లేదు. అందువల్ల పుట్టినమగవాడల్లా పుస్తెగట్టాలని, పుట్టిన ఆడదల్లా పురుడు పోసుకోవాలని భావించకూడదు. ఈ విషయంలో తల్లిదండ్రులు వృథాగా ప్రయాసపడి, అనవసరంగా జోక్యం కలుగజేసికొని, ఎవ్వరికీ సంతోషం లేకుండా చేసేకంటె, పిల్లలకు సంతవరకు పైదొలిగి, బాధ్యత తయారయ్యే విద్యార్జనలైన కట్నకారణమీదే వదలివేస్తే మంచిది. లేదా సంఘాన్ని వెనుకకైనా నడిపించాలి. అయితే వెనక్కు నడిచే సంఘము, వెనక్కు నడిచే కుటుంబం ఒక్కచోటికే తీసుకుని వెళ్ళగలవనే విషయంమాత్రం మరచి పోగూడదు.



స్వాతంత్ర్యోత్సవ సందర్భములో ఆగస్టు 15న గాంధి స్మారక చిహ్నంగా విడుదలయే తపాలాబిళ్లలు. 'పదిరూపాయల' తపాలాబిళ్ల మూల చిత్రాన్ని "లైఫ్" అనే పత్రికవారి వద్ద నుంచీ, తక్కిన మూడూ శ్రీమతి రాజకుమారి అమృతకౌర్ సేకరించిన మూల చిత్రాలనుంచీ తీసికొన్నవి.

భారత రాజకీయాలు

(9-వ పేజీ తరువాయి)

స్థాన్ స్థాపనకు పాకిస్థాన్ అంగీకరించక పోవటం వలన, ఆఫ్ఘనిస్థాన్ కొండజాతులను రేకెత్తించి ఈ విధంగా పాకిస్థాన్ వ్యతిరేక చర్యలు జరిపిస్తున్నదని ముస్లిం లీగర్ల అనుమానం. ఈమధ్య కలత్ నుండి ఆఫ్ఘనిస్థాన్ పారిపోయిన కలత్ సంస్థానాధీశ్వరుని తమ్ముడు ఆఫ్ఘన్ల సహాయంతో ఇప్పుడు తిరిగివచ్చాడనీ, కలత్ సంస్థానమంతా పాకిస్థాన్‌పై తిరుగుబాటు జరపటానికి సిద్ధంగావుందనీ, కలత్ సంస్థానం ఇప్పుడు అరాజకంగా వుందనీ, బెలూచిస్థాన్ నుండి పాకిస్థాన్ సేనలు కలత్ వెళ్ళనున్నవనికూడ వార్తలు వస్తున్నవి. కలత్ అల్లరులకు కూడ ఆఫ్ఘనిస్థాన్ కారణమని పాకిస్థాన్ అనుమానం.

ఈ అనుమానాలన్నింటికి ఆఫ్ఘనిస్థాన్‌పై కసితీర్చుకోటానికి, ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వాన్ని కూలదోయాలని పాకిస్థాన్ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇదివరకు ఆఫ్ఘనిస్థాన్ రాజుగా వున్న అమనుల్లాను కరాచీకి పిలిపించారట. త్వరలోనే పెషావర్ లో ఇతడి ప్రభుత్వం ఏర్పడి, ఆఫ్ఘన్ ప్రభుత్వంపై దెబ్బ తీస్తుందట. ఈ చర్యలలో బ్రిటన్, అమెరికాలు పాకిస్థాన్‌కు సహాయపడుతున్నవి. ఈ విధంగానైనా ఆఫ్ఘనిస్థాన్‌ను తమ చేతిలోకి తెచ్చుకోవలెనని వారు ప్రయత్నిస్తున్నారు. సరిహద్దు కొండజాతుల సమస్యను పాకిస్థాన్ శాంతియుతంగా పరిష్కరించలేనట్లే కనిపిస్తున్నది.

తూర్పుపంజాబ్ సంస్థానకూటమి

సంస్థానకూటములలో చిట్టచివరిదగు తూర్పు పంజాబ్ సంస్థానకూటమి ఈ వారంలో నే స్థాపింపబడినది. దీనికి ప్రారంభోత్సవం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జరిపాడు. ఈ కూటమిలో పాటియాల, కపుర్థల, నాభా, జింద్, ఫరీద్‌కోట, మలేర్‌కోట, మరిరెండు చిన్న సంస్థానాలు చేరినవి. ఈ కూటమికి పాటియాలా మహారాజా రాజప్రముఖ్ గాను, కపుర్థలమహారాజా ఉపరాజప్రముఖ్ గాను ఎన్నుకోబడిరి.

పాకిస్థాన్ సరిహద్దులో నుండుటవలన ఈ సంస్థానకూటమికి చాల కీలకప్రాముఖ్యత వున్నది. పైగా ఇవన్నియు సిక్కుసంస్థానములు. భారత సైన్యములో సిక్కులు ఎక్కువ ఈప్రాంతము నుండియే వచ్చెదరు. కాబట్టి సైన్యాభివృద్ధికి సరిహద్దు రక్షణకు ఈ సంస్థానకూటమి శ్రేయస్సు అవుసరము.

తూర్పుపంజాబ్ సంస్థానకూటమి మంత్రివర్గ మేర్పరచు విషయములో ఉత్పన్నమగుతున్న సమస్యలను గతవారము కొంతవరకు వివరించితిమి. లోకసేవక సంఘము, అకాలీదళము, సంస్థాన ప్రజామండలి మంత్రివర్గములో స్థానములకొరకు ప్రాకులాడుచున్నవి. ప్రజలు సిక్కులు కాబట్టి అకాలీదళము అధికసంఖ్యాకుల పార్టీలోని గుర్తించవలెనని వారు కోరిరి. కాని అది కేవలము మత సంస్థ యగుటవలన అది నిరాకరింపబడినది. ప్రధానిగాక 8 మంది మంత్రులను నియమించవలెననీ. అందులో సగముమంది సంస్థాన ప్రజామండలివా రుండవలెననీ, తక్కిన 4 స్థానములను 2 అకాలీదళమునకు, 2 లోకసేవక సంఘమునకు యివ్వవలెనని సంస్థానశాఖ కార్యదర్శి వి. పి. మీనన్, పాటియాలమహారాజులు నిశ్చయించిరి. కాని అత్యధిక ప్రజలకు సంబంధించిన తమను, మూడు నెలలక్రితం పోటీగా స్థాపింపబడిన లోకసేవక సంఘముతో సమానమొనర్చుటకు అకాలీదళము అంగీకరించలేదు. ప్రజామండలితో సమానప్రాతినిధ్యము తమకు వుండవలెనని వారు కోరుచున్నారు. లోకసేవక సంఘమునకు ప్రాతినిధ్యము లేకుండ మంత్రివర్గ మేర్పరచుట పాటియాలామహారాజుకు ఇష్టము లేదు. ఈ వివాదము పరిష్కారము కాకుండానే, మంత్రివర్గము ఏర్పడకుండానే సంస్థానకూటమి ఏర్పడినది. మంత్రివర్గమును ఏర్పరచుటకు వి. పి. మీనన్, పాటియాలామహారాజులు ఇంకను ప్రయత్నించుచునే యున్నారు.

బాలానందం

(15 వ పేజీ తరువాయి)

చూడకుండానే, "తల తీసెయ్" అని ఒక్క గావు కేక పెట్టి తన దోవను తను మళ్ళీ ఆటలోకి పరుగెత్తుకుపోయింది.

"తలకొట్టేసేందుకు, తలారిగాడిని నేనే పిలుచుకొస్తాను" అంటూ రాజు తొందరతొందరగా అక్కడినుంచి కదిలిపోయాడు.

కాసేపు ఆట చూద్దామని పాప కదిలింది. రాణీగారు అప్పుడే ముగ్గురు నల్గురు తలకాయలు కొట్టేయమని ఆజ్ఞ యిచ్చేసింది. అక్కడినుంచి కదిలి అటూ ఇటూ తిరిగి పాప మళ్ళీ పిల్లిని చూద్దామని వెనక్కి వచ్చేటప్పటికి, అక్కడ పిల్లితల చూస్తూ ఒక గుంపు చేరారు. రాణీ రాజు, తలారి మాత్రం ఏదో బిగ్గరగా వాదించుకొంటున్నారు. తక్కిన వాళ్ళంతా నిశ్శబ్దంగా వింటూన్నారు.

పాప కనబడేటప్పటికి ముగ్గురూ పాప చుట్టూ చేరి గందరగోళంగా మాట్లాడుతూ "తగవు తీర్చమంటూ" ఎవళ్ళమాట వాళ్ళు పాపతో చెప్పటం మొదలు పెట్టారు. అందరూ ఒక్కసారి మాట్లాడటంతో పాప కసలు సంగతేమిటో అర్థం కాలేదు.

తలారి పిల్లితల చూపించి, "దేహం లేనిదే, తలను దేన్నుంచి కొట్టేయటం?" అంటాడు.

"తల అన్నదున్నాక కొట్టేయటానికేం?" అంటాడు రాజు.

"ఏదో ఒకటి రెండు క్షణాల్లో చెయ్యక పోయారా, ఇక్కడ అందరి తలకాయలూ కొట్టేయిస్తా"నంటుంది రాణీ.

పాప కేమి చెప్పడానికీ తోచలేదు.

"అసలా పిల్లి జమీందారిణిది. ఆవిడను పిలుచుకొస్తే ఏం చెయ్యాల్సిందీ చెప్తుంది" అంది పాప.

"జమీందారిణి, తలకొట్టేయిద్దామని జైలులో పెట్టి ఉంచాంగా. ఒరే తలారీ, పోయి జైలులోంచి 'జమీందారిణీని తీసుకురా" అని రాణి ఆజ్ఞ యిచ్చింది. తలారి తూరీగలాగ పరుగెత్తిపోయాడు. రాణీ మళ్ళీ ఆటలోకి పరుగెత్తింది.

తలారి జమీందారిణీ చెయ్యి పట్టుకొని వగుర్చుకొంటూ పరుగెత్తుకొచ్చాడు. వాళ్ళిద్దరూ వచ్చేటప్పటికి పిల్లితల మళ్ళీ మాయమయిపోయింది. పిల్లితలకోసం వెదకుతూ రాజూ, తలారీ కలిసి అడావిడిగా, నాల్గు మూలలకూ పరుగెత్తటం మొదలు పెట్టారు.

స్టర్లింగునిలువల విడుదల ఒడంబడిక

(8 వ పేజీ తరువాయి)

మతి చేసికొనెడి ఆహారపదార్థములు ఇప్పుడు ఆస్ట్రేలియానుండి—స్టర్లింగు ప్రాంతమునుండి—దిగుమతి చేసుకొనుచున్నాము. మనకు కావలసిన యంత్రసామగ్రి త్వరగా సరఫరా అగునట్లు ఏర్పాటుచేయుటకు బ్రిటిష్‌ప్రభుత్వము అంగీకరించినది. చెకొస్లవేకియా, ఫ్రాన్సు మొదలగు దేశములు మనకు యంత్రసామగ్రి సరఫరా చేయుటకు ముందుకు వస్తున్నది. కాబట్టి ఈ 15 మిలియన్ స్టర్లింగు మొత్తము ఒకసంవత్సరమునకు సరిపోవునని ఆశింపవచ్చును. ఒకవేళ సరిపోనిచో, అంతర్జాతీయ ద్రవ్యనిధినుండి అప్పు తీసుకుని, మరుసంవత్సరము సంప్రదింపులు జరుగునప్పుడు ఎక్కువ మొత్తమిమ్మని కోరవచ్చును. చాలదని నోటిమాటలతో చెప్పటకన్న చేతలతో రుజావు చేయుట మంచిది కదా!

ఇప్పుడు జరిగిన స్టర్లింగు ఒడంబడిక శాశ్వత ఒడంబడిక కాదు. ఈ ఒడంబడిక 1951 వ సం. నాటికి రద్దయిపోవును. అప్పటి కింకను దాదాపు 800 కోట్ల రూ.ల స్టర్లింగు మనకు నిలువ వుండును. ఇందు కొంత మొత్తము తగ్గించమని అప్పుడధికారములో నున్న బ్రిటిష్ ప్రభుత్వము కోరవచ్చును. పార్లమెంటులో చర్చిల్ ప్రశ్నల ధోరణి గమనించినచో, ఈ పర్యాయము ఎన్నికలలో తాను జయము పొంది, స్టర్లింగునిలువలను తగ్గించివేసెదనని ఆయన ఆశించుచున్నాడు!

1951 వ సం.లో తిరిగి సంప్రదింపులు జరిపి, శాశ్వత ఒడంబడిక కుదుర్చుకొనవలసియుండును. మన స్టర్లింగునిలువలనుండి విడుదలనుగూర్చి అనుమానము నిప్పుడు తీరిపోయినది కాబట్టి, పారిశ్రామికవేత్తలందరు పారిశ్రామికాభివృద్ధికి చురుకుగా పూనుకొనగల రని ఆశించవచ్చును.

ఎరుగని ఊరుప్రయాణము

శ్రీ క. గోపాలకృష్ణమూర్తి

ఇంతవరకు చూడని ఒక క్రొత్త ప్రదేశానికి పోదామని పదిరోజులక్రిందట దొరా నిశ్చయించా తాబేదార్లకు తెలిపాము. 50 మైళ్ళ ప్రయాణం, జనసంచారం చాలా తక్కువగా వుండే మార్గాన. వాహనవిచారం చేయగా క్లిష్టసమస్యలు బయలుదేరినవి. చిట్టచివరకు ప్రయాణోదయమునకు ఒక ప్రాత మోటారుకారు ప్రాప్తించినది. సరి, ఈ కంట్రోలు దినాలలో పెట్రోలు దొరకుటెట్లు! మనుష్యులకు ఆశవలెనే ముసలితనము ముదిరినకొలదియు కార్లకు దాహము హెచ్చు. కడుగ్రాసము దొరుకని యీ పాపిష్టి రోజులలో బానెడు పాలైనా సంపాదింపవచ్చును గాని పిడితెడు పెట్రోలు దొరకుట లేదే. ఉద్యోగావసరమును పురస్కరించుకొని ప్రయత్నిస్తే ప్రయోజన ముండునని సలహా వచ్చినది. సరేనని సంతక మొకటి చేయడంతో యెనిమిది గాలన్ల పెట్రోలు మంజూరయినది. భయం తగ్గింది— బండి సాగుతుంది కదా అని.

వేరొక తలనొప్పి. ఉదయంనుంచి వర్షపు జల్లులు అడపదడప వస్తూవున్నవి. మధ్యాహ్నం తిరిగినతర్వాత వాటి సందడి క్రమేణ హెచ్చుచున్నట్లున్నది. మార్గం తప్పకుండా చీకాకుగా ఉంటుంది. త్రోవలో వర్షం హెచ్చితే మోకాలవరకు తడిసిపోతాము! అప్ఫకులము! శరీరం అల్పంగా వున్నా, చర్మం చల్లగావున్నా అనుకొన్న ప్రకారం పని చూద్దామన్న ఉత్సాహాగ్ని ప్రజ్వరిల్లుతోంది. ఏమైనసరే, బయలుదేరవలసిందే.

బయలుదేరాము. మూడు గంటలయింది. కారు ముందు వరుసలో నడిపేవాని ప్రక్కనే కూర్చున్నాను. పెద్ద కారగుటవలన రోడ్డుపై సగభాగం ఆక్రమించుకొంటున్నది. రోడ్డుపై యేర్పడిన వాననీటి గుంటలగుండా చక్రములు దొర్లిపోతూ వుంటే బురదనీళ్లు కొన్నిగజాల దూరంవరకు చిందుతున్నవి. మా సారథి యీ గుంటలను లక్ష్యపెట్టడంలేదు. బండిని బర్రున పోనిస్తున్నాడు. వాన హెచ్చుతూ వున్నట్లున్నది. జల్లు యెదురుగా కొడుతూ ముఖానికి చురుకు చూపిస్తున్నది. అంగీ చాలాభాగం తడిసినది. వర్షం యింకా హెచ్చుచున్నట్లు స్పష్టమవుతోంది. ఏమిది అనుకొన్నాడు......"పృథుశక్తిన్ గజము జలగ్రహముతో పెక్కేండ్లు పోరాడి..." అని పఠించడం ప్రారంభించాను. "అల వైకుంఠపురంబు..." దగ్గరకు వచ్చేసరికి వాన తగ్గుచున్నదా అనిపించింది. "గజరాజవరదు డిచ్చును గజతురగ స్యందనములు......" అనేసరికి వర్షం పూర్తిగా ఆగిపోయింది. కారు దడదడమని నిల్చిపోయింది.

పెట్రోలు కొంత పోశారు. కొంచెముసేపు మరమ్మతు చేశారు. త్రోవనే వచ్చిన కుర్రవాళ్లు నిలిచి "పాపము. ఆగి పోయింది" అనడం సాగించారు. కాని ఇంతలోనే కారు యంత్రమునకు చైతన్యం కలిగింది. ప్రయాణం సాగింది. మబ్బులన్నీ తెల్లబడిపోయాయి. వాటిగుండా వడిలిపోతూవున్న సూర్యుని కిరణాలు చెట్ల సందులలోనుండి మామీద పడుతూ వున్నవి. ఈ నాటికి వర్షబాధ తొలగిపోయిందికదా అనుకున్నాము. ఎనుబోతులబండ్లు, యెడ్లబండ్లు మాకు వెనుకబడిపోతున్నవి. వానతో తడిసిన బట్టను ఒక చెంగున తల్లి, రెండవచెంగునీ కూతురు పట్టుకొని ఆరవేసుకొంటూ దారివెంట నడిచిపోతూవున్న కుటుంబముకూడా మాకు వెనుకబడినది. మా కారు జోరుగా తూరుపుకు వెళ్ళుతూ వున్నది. ఏడెనిమిది క్రోసులు వచ్చాము. మిర్రుగావున్న ప్రదేశమునకు ఆరోహిస్తూ కారు తిరిగి తటాలున ఆగిపోయింది.

సారథి చులకనగా మరమ్మతు చేయడానికి ప్రయత్నించాడు లాభం కలుగలేదు. మరల పెట్టె తెరిచాడు. ఒకటొకటే విప్పడం మొదలుచేశాడు. బండిలోనే కూర్చోవడం బాధాకరం అయింది. దిగిశాను. రోడ్డుమీద పచారులు చేయడం ప్రారంభించాను. చేతికందిన మర్రిపూడలను కొన్నిటిని త్రుంచి పారవేశాను. రుయ్‌రుయ్‌మంటూ ఆకాశాన విమానం వెళ్ళుతూ వున్నది. దానిని గమనించడానికి ప్రయత్నించాను. కాని నా దృష్టిపథాన్ని మబ్బులు ఆక్రమించడంవల్లనో నా మనఃపథాన్ని మార్గమధ్యమున నిలిచిపోయిన శకటం ఆక్రమించడంవల్లనో ఆ విమానం నాకు గోచరించలేదు. బట్టను ఆరవేసుకొంటూ నడచివస్తున్న తల్లి, కూతురు నన్ను నా కారును చూచుకొంటూ తప్పుకొని ముందునకు సాగిపోయినారు. మా వెనుకబడిన యెనుబోతులబండ్లు నిదానంగా సమీపించినవి. నిర్లక్ష్యంగా మమ్ము దాటినవి. ముందునకు తరలిపోయినవి. ఈ విధంగా గడియకు పైగా కాలం గడిచింది. కారు యంత్రానికి తిరిగి కాతరత్వం పోయింది. విలక్షణమైన దాని విజయతూర్యం మమ్ములను ఆహ్వానించింది. తిరిగి అధిరోహించాము. మా పరుగులో చెట్లు, పుట్టలు, మమ్మల్ని తప్పించుకొనివచ్చిన యెనుబోతుబండ్లు తల్లీ బిడ్డలు, వెనుకబడెను. తుదకు తిరిగి మా కారు ద్విపాదచారులను బహుపాదశకటములను జయించినది!

సాయంకాలమున ఆరు గంటలకు పది క్రోసులు గడిచితిమి. త్రోవలోని మొదటి పట్టణమును చేరితిమి. ఇచటనిలుచుటయే యీరాత్రికి? గమ్యస్థానము ఇంకా పదునైదు క్రోసు లున్నది. చీకటి రానున్నది. కారును నమ్మవచ్చునా? సారథి అభయమిచ్చుచున్నాడు. కానిండు. చూతము. ముందునకు పోదము! వలయువారు అల్పాహారము లందుకొనవచ్చును. ఈ రాత్రికి 'పరివ్రాజకులము కాగలము. "ఎచ్చోనైనను నిల్చు, నాకటికి నేమేని న్దినున్, రాత్రియైనచో నెమ్మి శయించు......"

చొరవఫలితము చూపినది. మార్గము నిర్మలమై నిరాఘాటముగ నున్నది. దట్టములగు చెట్లు రెండు ప్రక్కల మూగి కన్నుల పండువ చేయుచున్నవి. నేలపై ఇసుకపాలెక్కువయుండుటచే మా కారు చక్రములు హాయిగా దొరలిపోవుచున్నవి. వాగులపై వంతెనలు వెనుకబడిపోయినవి. ఏడుగంటలగు సరికి పదునేడు క్రోసులలోని పట్టణమును చేరితిమి.

చీకటి మీరి వచ్చుచున్నది. ఇంకను ఎనిమిది క్రోసులు గడువవలసి యున్నది. త్రోవలో రెండు వాగులు మార్గము నడ్డియున్నవి. ఈ వాటి వర్షమున కవి పొంగివచ్చియున్న మా కారు దాటలేక పోవచ్చును. ఈ రెంటిని గడిచినను గోదావరి వరద హెచ్చినయెడల గమ్యస్థానమున కొక క్రోసెడు దూరము నందే కారు నిలిచిపోవలసి వచ్చును. ఈ యిబ్బందు లేల! ఈ రాత్రి ఈ పట్టణములో నిలిచి తెల్లవారగానే పోకూడదా? ...పిరికి మాటలు వలదు. పోదము! ముందునకు పోదము!

ఇచ్చటినుండి మార్గ మసాధారణమైనది. రెండు మూడు చోట్ల కొండలను చుట్టి మిర్రునుండి పల్లమునకు క్రమముగా జాలువారు బాట యిది. నాలుగేసి గుడిసెల కుగ్రామములు యిరుప్రక్కల తోచుచున్నవి. బాటకడ్డువచ్చిన యేటి వాగులో నీరు పారుచున్నది. మా సారథి వెనుకాడలేదు. వాగు నట్టనడిమికి చేరి కారు తటాలున నిలిచిపోయింది. ఏమిది!

సారథికి కొంచెమైన అలజడి కలుగలేదు. యంత్రములో పెట్రో లుంచినాడు. మరల యంత్రము పనిచేయు టారంభించినది. వాగు గడచితిమి. రెండవవాగుకూడ దాటితిమి. కొండలెన్నో గడచితిమి. ఈ మార్గమున మేముచూచిన మనుష్యులకంటె కొండలే హెచ్చు. గోదావరి తీరమును చేరితిమి. చీకటి యంతట నలమికొన్నది. గంగమ్మ తెల్లని పంచ పరచినట్లు కనుచూపు మేర విస్తరించి యున్నది. మా మార్గముయొక్క తుది క్రోశమును ముంచివేసిన దేమో? ఒక కుందేటి పిల్ల మా కారు ముందునకు వచ్చి దీపముల వెలుగులో దుముకుచు పదిబారలు పందెపు పరుగు చూపి ప్రక్కకు తప్పుకొన్నది మార్గమున కిరుప్రక్కల నీరు డాసియున్నది. ఒక్కచోట నీరొకప్రక్కనుండి వేరొక ప్రక్కకు స్వల్పముగా పారుచున్నది. మా కారాభాగమును గడచినది. ఇంతలోనే యూరిలో ప్రవేశించినది. సరిగా యెనిమిది గంటలగుసరికి గమ్యస్థానము చేరితిమి.

మరునాడు కారుపోవుచున్న శబ్దము విని మేల్కొంటిని. మా విడిదియందు వసారాలోనికి రాగానే పొంగిపొరలి పోవుచున్న గంగా భవాని ముంగిట తోచినది. ఆవలి మేరను పాపికొండల వరుసలు. దివ్యదృశ్యములు!! ...... "గోదావరి వెల్లువ హెచ్చుచున్నది. గడచినరాత్రి దాటివచ్చిన మార్గమునందొక క్రోసెడు దూరము వరకు నీరు పొడముచున్నది. ఇపుడు కారును మెట్టకు చేర్పనిచో మరల వరద తరుగువరకును కారు యిచటనే నిలచిపోవచ్చును. అందువలన కారును మెట్టపైకి పంపివేయుచున్నా"మనిరి. మంచిది. కానిండు! జీవితాదర్శమగు గమ్యస్థానమును చేరినపిదప అచ్చటనుండి మరలిపోవుటకు వీలులేకుండునట్లు దాటిన తెప్పలను ముంచివేయుట మహనీయులగువారి పాలగుచో నా యథాస్థానమును చేరుటకు తరణోపాయము లూహించుట నా పాలైనది.

రేపటి తిరిగి యీ యిరువదియైదు క్రోసుల దూరము పరువెత్తవలసి యున్నదికదా!

మా విడిదిముంగల 'తాండవించుచు దుముకు గోదాప్రవంతి'ని చూచుచునే కూర్చుంటిని. వేరొకవిషయముపై మనసు ప్రసరించుటయేలేదు! గ్రామసులు వచ్చిరి. 'స్థలమాహాత్మ్యము' ను యెవరికి తెలిసినది వారు చెప్పిరి. చోళరాజుల కాలమున యీ పట్టణమును పట్టపుదేవికి అరణమిచ్చి యన్వర్థమైన పేరును పెట్టినారట. శివారున రాజుల యేనుగులు విడియు ప్రదేశమును కలదు. మా నివాసమును చేరి పడమరను చోడేశ్వరుని కొండ కలదు. ఆ కొండపై "మిగుల నున్నతముంగాక, తగని లోతుగాని పరిశుద్ధమగు ప్రదేశాన" చోడేశ్వరాలయ ముండెడిదట. ఇపుడాలయము శిథిలమైనది. మూడు లింగము లచట నున్నవి. దేవాలయపు జాడలే లేవు. శాంకరి విగ్రహ మొకటియూ విఘ్నేశ్వర ప్రతిమ యొకటియు కలవు అనట ఇపుడొక చిన్నగుడి యున్నది. అందొక రాజయోగి యున్నాడు. నేను పోవుసరికి జొన్నకూడు తినుచున్నాడు. నాకొక చాపనిచ్చి కూర్చుండుమన్నాడు. సంభాషించితిమి. అతని చరిత మిది: "గుండేపల్లి జమీందారిమాది. సోదరులందు కలహము పుట్టగా తమ్ముడన్నను ఈటెతో పొడిచి చంపి పరారియయ్యెను. ఆ తమ్ముడు నా ముత్తాత. నేను దేశమునల్దిక్కుల తిరిగినాను. శాస్త్రములు చదివినాను. ధర్మశాస్త్రములోని యొక సూత్రము ప్రకారము జమీందారి నాకు సంక్రమించవలసి యున్నది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొని నేనే ఒక పత్రము వ్రాసి జడ్జీ వద్ద దాఖలు చేసినాను. దాని పర్యవసానం తేలేవరకు యిచట చోడేశ్వరుని సన్నిధిని వుంటాను. గాంధీ అహింసా తత్వమును బోధిస్తున్నాడుకదా. నేను దానివల్ల కట్టుబడి పోయినాను. యింకేమి చేస్తాను..." ఆ తెనెకళ్ళు కొంచెముగా చెమ్మగిలినవో! గోదావరిలో రోజునకు ముమ్మారు స్నానము. నిర్మానుష్యమైన కొండపై యీ గుడిసెలోని మంచెపై నివాసము. వయస్సు సుమారు 68 సంవత్సరములు. దేహమం దింకను దార్ఢ్యము తప్పలేదు. ఈ వ్యక్తియొక్క యథార్థతత్వ మేమో!

ఉద్యోగ సంబంధమైన కార్యాలాపము నడిచినది. అది మమ్ము చోడేశ్వరుని కొండ చుట్టును త్రిప్పినది. ఒకచోట సుమారు ముప్పది గజాల యెత్తు గల తెల్లరాయి ఒకటి కొండపై నుండి దొరలివచ్చి మార్గముప్రక్కనే నిలిచినట్లున్నది. ఆ రాతి పైమూలను బాటపైకి తూగివచ్చుచు గుండ్రని రాయి ఒకటి యిరికియున్నది. ఈ గుండ్రాయి తప్పెటవలె నున్నది కావున కాపోలు దీనిని తప్పెటరాయి అనుచున్నారు.

మరల గోదావరీ దృశ్యము. ప్రవాహమునం దురవడి హెచ్చుచున్నది. నురువులు తేలి పరువులెత్తుచున్నవి. అటనట మ్రోళ్ళు మ్రానులు కొట్టుకొని పోవుచున్నవి. ప్రాణాలను లక్ష్యము సేయక తెప్పలపై తిరిగెడు జాలరులు వానివెంట తిరిమి పట్టుకొని గట్టునకు జేర్ప యత్నించుచున్నారు. వారి జీవనోపాధికి ఇది యొక మార్గము. ఇచట యీ మహానదికి యిప్పుడు కొండలే హద్దులు. పోతగట్లు లేవు. పది సంవత్సరాలలో యీ ప్రదేశ మెట్లు మారిపోనున్నదో! ప్రస్తుతము జరిగే ప్రయత్నాలు సమాలోచనాలు కార్యరూపం ధరించే యెడల మానవకృషి వలన యీచటి నైసర్గిక సామ్రాజ్యంలో ఒక మహా విప్లవం కలుగుతుంది. ఉద్దండులైన శిల్పులు విజ్ఞానోపలబ్ధములైన యంత్ర తంత్రాల సహాయంతో యీ కొండలకు దీటైన గోడనొకదానిని యీ మహాప్రవాహానికి అడ్డుగా కట్టగలరు. నిరర్థకంగా సముద్రంలో లీనమైపోతూ వున్న యీ అమృతవారి మూడు జిల్లాలలోని మేడు ప్రదేశాలకు పారి సస్యఫలశోభితంగా చేయగలదు. మేఘాలలో మెలగుతూవుండే మెరుపును జలపాతమువలన సృష్టించి పరిసర ప్రాంతీయుల గృహ పారిశ్రామికావసరములకు కావలసినంత పంచిపెట్టగలరు. ఈ మహానిర్మాణమువలన దేశమున దుర్భిక్షము తొలగిపోగలదు. చీకటి చిక్కిపోగలదు. బీజమును నాటుటకు అదనగు తొలకరి వచ్చినది. వ్యవసాయ ప్రయత్నములు సాగుచున్నవి అందేస్వల్పముగానైనను చేయూత నొసగు భాగ్యము మనకు కల్గునేమో! రామునకుగాను సముద్రమునకు అడ్డు కట్టినవారిలో ఉడుత యొకటి లేదా? ఇందు మనము పాల్గొందము. సంపూర్ణఫలితములను మన సంతతు లనుభవింపగలరు. భద్రాచల రాముడీ మహారంభతమును పర్యవేక్షించుచుండగా భయ మేమి?

ప్రజలలో ప్రస్తావించితిమి. ఇచటను కలహములు లేకపోలేదు. ఈ కొండకు యిరువురు యజమానులు. ఆ యిరువురు తగవులాడుచున్నారు. వెదురుగు, కట్టె, కలప పంచుకొనుటలో యీ పగలు బయలుదేరినవి. హెచ్చు లాభము తనకు రావలెనని ప్రతివానియొక్కయు ప్రయత్నము. ఇరువురును సమాన భాగస్వాములైనపుడు ఒకరికంటె యింకొకరికి హెచ్చు లాభము యేలరావలెనో! ఇరువురి పాలములందును ఒకేవిధమగు శ్రద్ధతో వెదురును, కట్టెను, కలపను ప్రకృతి పెంచుచున్నది. మానవుడు దానిని సమముగ పంచుకొని యనుభవింపలేడా! ఈ కార్పణ్యములు యేల పుట్టినవో! మానవుడు కాలప్రవాహమున తన జీవితబుద్బుదముయొక్క అంతర మెంతో తెలిసికొన్నాడా!... అదిగో! గోదావరీ ప్రవాహము ప్రశాంతముగ తరలిపోవుచున్నది. వరద హెచ్చుచున్నది కాష్ఠములు కొన్ని కలసి తెప్పగా కొంత దూరము సాగినవి. ఒక సుడిలో చిక్కికొని విడిపోయి యీ చిదుగులు వేరువేరు మార్గములను పట్టి సాగరాభిముఖములై పోవుచున్నవి. వాటి పొందు, పొచ్చెములలో గోదావరీ జలములకు పనియేమి?

యుగసంధి

(19 వ పేజీ తరువాయి)

మెల్లగా డాబాకి కట్టిన రాతిమెట్లు ఎక్కుతూ. ఆ మెట్లు ఎండకి వేడెక్కిపోయాయి, "చక్కని చిన్న పాదాలన్నావు కాదూ!... సరే అయితే అతను ఆ పాదాలకు దాసు డవుతాడు."

కాని ఇంతలో సిగ్గు ఆమెను ఆవరించింది. గబగబ ఆమె మెట్లు ఎక్కి మేడమీదికి వెళ్లిపోయింది.

ఆర్కాడీ వసారాలో నడిచి తన గదికి వెడుతుండగా ఒక సేవకుడు వచ్చి, అతని గదిలో బజరోవ్ కూర్చునిఉన్నట్టు చెప్పాడు.

"యవ్‌గనీ!" అన్నాడు ఆర్కాడీ ఏదో నిస్పృహ అతన్ని ఆవరించింది "చాలా సేపయిందా అతను వచ్చి?"

"బజరోవ్ గారు ఇప్పుడే వచ్చారు. వారు వచ్చినట్టుగా అనాసర్గీవ్నాతో చెప్పవద్దన్నారు. తిన్నగా మీ గదికి తీసుకుపొమ్మన్నారు."

"ఇంటి దగ్గర ఏమన్నా అపాయం జరుగలేదు గదా? అనుకున్నాడు ఆర్కాడీ. గబగబ మెట్లెక్కి తలుపు తెరిచాడు బజరోవ్‌ని చూడ్డంతోటి అతనిమనస్సు కుదుటపడింది. కాని అతని దృష్టి కొంచెం నిశితమయిన దయితే, కొంచెం వాడిపోయినా చైతన్యం తగ్గిపోని అతని ముఖంలో ఏదో అడగిఉన్న అశాంతి అతనికి కనిపించి ఉండును. దుమ్ముపడిన పైకోటుతో నెత్తిమీద టోపీ తియ్యకుండానే అతను కిటికీలో కూర్చుని ఉన్నాడు, ఆర్కాడీ అతనిమీద ఆడంబరంగా వాలి కౌగలించు కున్నప్పుడుకూడా అతను లేవలేదు.

"అనుకోలేదుసుమా! ఎంత అదృష్టం నువ్వు రావడం!" అని ఆర్కాడీ మళ్లీ మళ్లీ అనుకున్నాడు. తనుఆనందిస్తున్నట్టు నిశ్చయించుకుని, ఆ ఆనందాన్ని ప్రదర్శించాలని కుతూహల పడుతున్న వాడిలాగ అతను గదిలో ఇటూఅటూ హడావిడిగా తిరిగాడు. ఇంటిదగ్గర అంతా సవ్యంగా ఉందా? అందరూ కులాసాగా ఉన్నారా?"

"అంతా సవ్యంగానే ఉంది, గాని అందరూ కులాసాగాలేరు," బజరోవ్ అన్నాడు. "ఊరికే అతిగా మాట్లాడకు నాకు కాస్త ద్రావకం తెప్పించు. కూర్చో. విను. జరిగిన విషయాన్ని క్లుప్తంగా ఘాటయిన వాక్యాలలో చెపుతాను."

బజరోవ్ తనకీ పావెల్ పెట్రోవిచ్‌కీ జరిగిన ద్వంద యుద్ధాన్ని గురించి చెపుతున్నప్పుడు ఆర్కాడీ మాట్లాడకుండా విన్నాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. విచారం వేసింది. కాని అవి పైకి వ్యక్తపరచడం అనవసరమని అతను అనుకున్నాడు. తన పెదతండ్రికి తగిలిన గాయం అంత ప్రమాదమయినది కాదుగదా అనిమాత్రం అడిగాడు. బజరోవ్, ఆ గాయం చాలా విచిత్ర మయినదేగాని, వైద్యదృష్ట్యా మాత్రం కాదని వెటకారంగా సమాధానం చెప్పినప్పుడు అతను చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నాడు. కాని అతనికి హృదయంలో సిగ్గు, బాధకలిగాయి. బజరోవ్ అది గ్రహించాడు.

"అవునోయి తమ్ముడూ," అన్నాడు, "ఈ జమీందారులతో కలిసి నివసించడంవల్ల, నువ్వుకూడా ఒక జమిందారు వయిపోతావు. శౌర్య ప్రధానమయిన వ్యసనాలలో పాల్గొంటావు. సరే, అంచేత మా నాన్నదగ్గరకు పోతున్నాను." బజరోవ్ ముగిస్తూ అన్నాడు "దారిలో ఇలా వచ్చాను......ఇదంతా నీతో చెప్పాలని. ఇదంతా ఉత్త అవతవక వ్యవహార మని నాకూ తెలుసును. అది కాదులే—నే నిక్కడికి ఎందుకు వచ్చానో నాకు తెలియదు. చూశావూ, అప్పుడప్పుడు తన పిలక తనే చేతపుచ్చుకుని తన్నుతనే ఒక్కసారి తెలివి వచ్చేవరకు గుంజడం, ప్రతీవ్యక్తికీ అవసరం. ఈమధ్య నేను అపనే చేస్తున్నాను......కాని నేను దేన్నయితే ఇంక శాశ్వతంగా వదులుకుంటున్నానో, అది ఒక్కసారి, ఆఖరుసారి చూసి పోదామని వచ్చాను."

"ఆ మాటలు నన్ను ఉద్దేశించి కాదుగదా?" ఆర్కాడీ ఉద్రేకంతో అన్నాడు, "నన్ను పూర్తిగా వదిలివెయ్యాలని అనుకోడం లేదుగదా?"

బజరోవ్ తీక్ష్ణంగా, చురుకుగా అతని కళ్లలోకి చూశాడు.

"అయితే నీ కంత బాధగా ఉంటుందా? అసలు నువ్వే నన్ను వదలి వేసినట్టు నాకు తోస్తోంది. అదీగాక నువ్వెంత నవనవలాడుతూ కొత్తగా కనబడుతున్నావు......అనా సర్గీవ్నాతో నీ వ్యవహారం జయప్రదంగా నడుస్తూన్నట్టుందే."

"అనా సర్గీవ్నాతో నా వ్యవహారం అంటే?"

"ఏం, నువ్వు పట్టణాన్నించి ఇక్కడికి వస్తా ఆమెకోసం కాదా? మరిచిపోయాను, ఆదివారపు పాఠశాల లెల్లా నడుస్తూన్నాయి? ఆమెను నువ్వు ప్రేమించడం లేదని నన్ను నమ్మించాలని నీ అభిప్రాయమా? లేకపోతే అప్పుడే కొంత పనాయించుకునే పరిస్థితిలో పడ్డావా?"

"యవ్‌గనీ, నేను ఇంతవరకూ నీ దగ్గర ఏమీ దాచలేదన్న సంగతి నీకు తెలుసు, నేను ఆత్మసాక్షిగా చెపుతున్నాను, నువ్వు పొరబడుతున్నావు."

"ఊహు! అది వేరే విషయం," బజరోవ్ మెల్లగా అన్నాడు, "కాని నువ్వు మొగమాట పడనక్కరలేదు. ఏమయినా నాకేమీ అభ్యంతరం లేని విషయం ఇది. నాగరకుడయితే నాజూకుగా, 'మన పథాలు భిన్న దిక్కులకు విడిపోతున్నట్టు అనిపిస్తోంది,' అంటాడు. నేను మాత్రం అల్లా అనలేను. మనలో ఒకళ్లంటే ఒకళ్లకి విసుగు పుట్టింది."

"యవ్‌గనీ......"

"తమ్ముడూ! అందులో పెద్ద ప్రమాదం ఏమీ లేదు. మనిషికి ఇంతకంటే గొప్పవిషయాలే విసుగుపుట్టిస్తాయి. ఇంక ఒకరి కొకరు సెలవు చెప్పుకోవాలనుకుంటాను. కాదూ? ఇక్కడ అడుగుపెట్టిన దగ్గరనించీ నా కేదో వెగటుగా ఉంది—కోలూగా రాష్ట్రాధికారి భార్యను చూసి గోగోల్ వ్రాసిన హృదయోపహారాలను చదివినంత వెగటుగా ఉంది. మరిచిపోయాను, 'అన్నట్టు వాళ్లని గుర్రాలను విప్పమనికూడా చెప్పలేదు."

"కాని అది చాలా అన్యాయం."

"ఏం?"

"నా విషయం నే నేమీ చెప్పను. కాని అల్లా చేస్తే అనాసర్గీవ్నా విషయంలో పెద్ద అపచారం చేసినట్టవుతుంది. ఆమెకు నిన్ను తప్పకుండా చూడాలని ఉంటుంది."

"అబ్బే! ఆ విషయంలో నువ్వు పొరబడుతున్నావు"

"కాదు! నేను చెప్పినది నిజమని నాకు తెలుసు," ఆర్కాడీ గట్టిగా అన్నాడు. "అపయిని ఎందుకీ నటన అంతాను? నువ్వు ఇక్కడికి రావడం మట్టుకు ఆమాట కొస్తే—ఆమెకోసం కాదూ?"

"అయుండవచ్చు. కాని నువ్వన్నది పొరబాటు." కాని ఆర్కాడీ అన్నది పొరబాటు కాదు. అనాసర్గీవ్నాకు బజరోవ్‌ని చూడాలని ఉంది. తన సేవకునిద్వారా ఆమె కబురుపంపింది. బజరోవ్ తన దుస్తులు మార్చుకు ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కొత్తగా కుట్టించుకున్న దుస్తులు పెట్టిలో పైనే అందుబాటుగానే ఉన్నాయి చివరకి. ఈసారి అనా సర్గీవ్నా, వెనక అతను తన ప్రేమను వ్యక్తపరిచిన గదిలోగాక, అతిథి మందిరంలో అతని కోసం కూర్చుంది. సద్భావంతో ఆమె కరస్పర్శకు తన చేతివేళ్లను అందించింది. కాని ఆమె ముఖంలో దాచుకోలేని తబ్బిబ్బు కనిపించింది.

"అనా సర్గీవ్నా," అన్నాడు బజరోవ్ రాగానే, "అన్నిటికంటే ముందుగా ఒక విషయమయి మీ మనస్సుని నేను కుదుటపరచాలి. మీ ఎదుట నిలబడి ఉన్న ఈ దీనుడు, తన పొరబాటును గుర్తించి చాలాకాల మయింది. తన తప్పిదాలను ఇతరులుకూడా మరిచిపోయియున్నిస్తా రని ఆశిస్తున్నాడు. నేను ఇక్కడినించి దూరంగా వెళ్లిపోతున్నాను. నేనంత మెత్తని మనిషిని కాదు. కాని, నన్నుగురించి మీరు ఏవగింపుతో స్మరిస్తూంటారనే భావంతో నే నిక్కడినించి వెళ్లిపోతే నా కంత సుఖంగా ఉండదు."

ఒక పెద్ద పర్వతం ఎక్కిన తరవాతలాగ అనాసర్గీవ్నా దీర్ఘంగా నిట్టూర్చింది. ఆమె ముఖం చిరునవ్వుతో వికసించింది. రెండోసారి ఆమె తన చేతిని అతనికి అందించింది. అతను నొక్కినప్పుడు అతని చేతిని తనుకూడా నొక్కింది.

"జరిగిన విషయాలు మరిచిపోదాం," అంది ఆమె. "అందుకు నేనూ ఆదుర్దాపడుతున్నాను. ఎందుకంటే, నా అంతరాత్మలో ఆనాడు నేనూ కొంత అపరాధం చేశానని అనిపిస్తోంది. ఆఖరుమాట, మనం మొదటిలాగ స్నేహితులుగా ఉండిపోవాలి. అనాటిది ఒక కల. కాదా? కలలు ఎవరు జ్ఞాపకం ఉంచుకుంటారు?"

"ఎవరు జ్ఞాపక ముంచుకుంటారు? అదీగాక ప్రేమ అనేది......మీకు తెలుసునో లేదో వట్టి కాల్పనికానుభూతి."

"నిజంగా? అది తెలుసుకున్నందుకు నాకు చాలా తృప్తిగా ఉంది"

ఆ విధంగా అనా సర్గీవ్నా మాట్లాడింది, ఆ విధంగానే బజరోవ్ కూడా మాట్లాడాడు. ఇద్దరూ నిజం చెపుతున్నట్టే అనుకున్నారు. నిజం, పరిపూర్ణమయిన నిజం వారి మాటలలో వ్యక్తమవుతోందా? వాళ్లంతట వాళ్లు ఆ విషయం చెప్పలేరు. కథకుడుకూడా చెప్పలేడు. కాని సంభాషణ జరుగుతున్నంత సేపూ ఒకరి నొకరు పూర్తిగా నమ్ముతున్నట్టు మాట్లాడుకున్నారు.

కిర్సనావ్‌ల ఇంట్లో అతను కాలాన్ని ఎల్లా వెళ్లబుచ్చినదీ చెప్పమని అనాసర్గీవ్నా బజరోవ్‌ని అడిగింది. పావెల్ పెట్రోవిచ్‌కీ తనకూ మధ్య జరిగిన యుద్ధంసంగతి చెప్పబోయి అతను చటుకుని ఆపుకున్నాడు. తనను గురించి ఏదో గొప్ప చెప్పుకుంటున్నట్టు ఆమె అనుకుంటుందేమోనని అతనికి అనుమానం వేసింది. తను ఏదో తన పరిశోధనలలో మునిగిపోయి కాలం గడిపినట్టు చెప్పాడు.

"ఇంక నేను," అనాసర్గీవ్నా అంది," మొదట ఏదో మనస్సు దిగులుగా నిస్పృహతో నిండిపోయింది. ఎందుకో తెలియదు. దేశాంతరం వెళ్లిపోదామని కూడా ప్రయత్నం కొంత చేశాను తెలుసా!......తరవాత అది పోయింది. మీ స్నేహితుడు ఆర్కాడీనికోలావిచ్ వచ్చాడు. అక్కడినించీ మళ్లీ నాభాధ్యతలు అన్నీ వహించి మామూలు పంథాలో నాపాత్రను నేను ధరించాను". "అది ఎల్లాంటిదో అడగవచ్చునా?"

"అత్తగారి పాత్రఅనుకోండిసంరక్షకురాలుగా అనుకోండి, తల్లిగా అనుకోండి— ఏదన్నా అనండి, అన్నట్టు చూశారూ, మొదట్లో మీకూ ఆర్కాడీ నికోలైచ్‌కీ ఇంత స్నేహం ఎల్లా కుదిరిందో అని చాలా వింతగా ఉండేది నాకు, అతను అంత విశిష్టత ఉన్న వ్యక్తిగా నాకు అనిపించలేదు. కాని ఈమధ్య అతనితో పరిచయం ఎక్కువయింది. అతను తెలివయిన వాడని నాకుతోచింది...... అదీగాక అతను యౌవనంలో ఉన్నాడు......అదీ గొప్పసంగతి ......మీలాగా నాలాగా కాదు. యవ్‌గనీ వాసిలిచ్!"

"మీదగ్గర వెనకటిలాగ సిగ్గుపడుతున్నాడా?" అని బజరోవ్ అడిగాడు.

"ఏం? ఇదివరకు అల్లా ఉన్నాడా?......" అనాసర్గీవ్నా ప్రారంభించింది. కొంతసేపు ఆగి మళ్లీ అంది. "ఇప్పుడు కొంచెం చనువుగా మసులుతున్నాడు. చనువుగా మాట్లాడుతున్నాడు. నన్ను చూసి ఇదివరకు తొలిగిపోయేవాడు. అప్పుడు నేనూ అతన్ని దగ్గరకు చేరనియ్యలేను. కాట్యాతో ఎక్కువ స్నేహంగా ఉండేవాడు.

బజరోవ్‌కి చిరాకు ఎక్కువయింది.? "ఆడది ఎప్పుడూ ఇంతే. నటనమాత్రం మానలేదు"? అనుకున్నాడు. పైకి అన్నాడు, "ఇదివరకు తప్పించుకు తిరిగేవాడని మీ రన్నారు. కాని కాని అతను మిమ్మల్ని ప్రేమించేవాడన్న సంగతి మీకు తెలియని విషయం కా దనుకుంటాను."

"ఏమిటి! అతనుకూడానా?" అనాసర్గీవ్నా పెదవులమధ్య నించి అంది.

"అతనుకూడా" బజరోవ్ అడకువగా వం అన్నాడు. "అది మీకు తెలియని విషయమనీ, నే నే కొత్తగా మీకు తెలియపరిచాననీ, నేను అను కో వలిసిందేనా?"

అనాసర్గీవ్నా చూపులుకిందకు దించింది "మీరు పొరబడుతున్నారు."

"నేను అల్లా అనుకోను. కాని నేను చెప్పి ఉండకూడదేమో." తనలో తను అనుకున్నాడు "ఇంకముందు నాతో అసత్యాలుమాత్రం చెప్పడానికి ప్రయత్నించకు."


"ఎందుకు కూడదు? కాని ఈ విషయంలో కూడా మీరు తాత్కాలికమయిన ఒక ఉద్రేకాన్ని పెద్దగా ఊహించి చెబుతున్నారేమో మీరు ప్రతీవిషయమూ పెద్దగా చేసి చెపుత రని నాకు అనుమానం కలుగుతోంది."

"అనాసర్గీవ్నా, ఇంక అవిషయం మన ప్రస్తావించకర్దు"

"ఏం? ఎందుకు?" అంది ఆమె, కాని అంతట ఆమె,సంభాషణను ఇంకో విషయంలో దింపింది. బజరోవ్ సమక్షంలో ఆమె ఇంకా అస్థిరంగానే ఉంది; అయితే వెనకటిదంతా తను మరిచిపోయినట్టు అతనితో చెప్పింది. తనలా తను అనుకుంది అతనితో చమత్కారంగా మాటకు మాట అంటున్నప్పుడుకూడా, హాస్యంగా మాట్లాడుతున్నప్పుడుకూడా,ఆమెలో ఏదోచిన్న భయభావం మెదులుతూనే ఉంది. సముద్రం మీద ఓడలో ప్రయాణం చేస్తున్నప్పుడు మనుష్యులు అల్లాగే నిర్లక్ష్యంగా, నవ్వుతూ మాట్లాడుకుంటారు. వాళ్లు నేలమీద ఉన్నట్టుగానే ఉంటుంది చూసేవాళ్లకి. కాని ఏదయినా ఒక చిన్న ప్రమాదం జరగనియ్యండి, మామూలుకి భిన్నమయినది ఏదిగాని జరగనియ్యగడి, అందరి ముఖాలమీద ఏదో భయభావం ముద్రితమయిపోతుంది. అనుక్షణమూ ఏదో ప్రమాదం రాబోతోందనే వదలని భయభావం.

అనా సర్గీవ్నా బజరోవ్‌ల సంభాషణ తరవాత అట్టేసేపు నడవలేదు. ఆమె ఆలోచనలో పడ్డట్టు అగుపించింది. పరధ్యానంగా సమాధానాలు చెప్పింది. చివరికి హాలులోకి వెడదామని అంది. అక్కడ ముసలి రాకుమారి, కాట్యా కూర్చుని ఉన్నారు. "మరి ఆర్కాడీ నికోలైచ్ ఏడీ?" అని అడిగింది గృహ యజమానురాలు. ఒక గంట నించీ ఎక్కడా కనపడలేదని విని అతని కోసం కబురుపంపింది. అతను అంత సులువుగా దొరకలేదు. తోటలో బాగా గుబురుగా చెట్లు పెరిగిన చోట, తన గడ్డాన్ని చేతులమీద ఆన్చి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆ ధ్యానం ప్రశస్తమయినది, విషాదపూర్వకమయినది మాత్రం కాదు. అనాసర్గీవ్నా బజరోవ్‌తో ఏకాంతంగా కూర్చుని మాట్లాడుతోందని అతనికి తెలుసు. ఇదివరకులాగ అతనికి అసూయకలగలేదు. అంతే కాదు. అతని ముఖం క్రమంగా వికసించింది. అతని మనస్సులో వింత, సంతోషం పెనగులాడాయి. అతని మనస్సు ఏదో నిశ్చయానికి వస్తోంది.


★ వార్తా చిత్రాలు ★




గవర్నర్ జనరల్ శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారిగారికి ఢిల్లీ పురపాలకసంఘంవారు 1 వ తేదీన పౌరసన్మానము చేసినప్పుడు, వారు సమాధాన మిచ్చుచున్న దృశ్యం.



జమ్మూ ఫరీద్‌కోట రస్తాలో మధుపూర్ వంతెనకు ప్రారంభోత్సవం జరుపుతున్న ప్రధాని నెహ్రూ.



సోనమార్గ యుద్ధరంగానికి వెళ్లినప్పుడు అక్కడి పర్వతప్రాంతంలో ఒక పొట్టి గుఱ్ఱం ఎక్కి స్వారీచేయబోతున్న భారతప్రధాని నెహ్రూ. ప్రక్కన నిలిచివున్నది రక్షణమంత్రి సర్దార్ బలదేవ్ సింగ్.



ప్రధాని ఓమందూరు పెదరామస్వామిరెడ్డిగారు అనంతపురంలో గాంధీ శిలావిగ్రహా విష్కరణం జరుపుతున్న దృశ్యం.



అమెరికా అధ్యక్షపదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోడానికి ఫిలడెల్ఫియాలో జరిగిన పార్టీ కోలాహలం.



అమెరికా అధ్యక్షు ఎన్నికకు రిపబ్లికను పార్టీ నియమించిన థామస్ డ్యూయీ. ఎడమ ప్రక్కన ఉన్నవారు ఉపాధ్యక్ష పదవికి నియమింపబడిన ఎర్ల్ వారన్.

Regd. No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T., Madras.